కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన బుక్ హౌస్



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



దేశవ్యాప్త సమ్మె ఎందుకు?

'గెలాక్సీ లీడర్' సహా హౌతీల లక్ష్యాలపై 20 ఫైటర్‌జెట్స్‌తో ఇజ్రాయెల్ దాడులు

లోపలి పేజీల్లో

మోదీ ప్రభుత్వం ధనవంతుడిని మరింత సంపన్నుడిగా చేస్తోంది



సంపుటి 08, సంచిక: 218 | మంగళవారం | 08-07-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## అమ్మ పేరుతో ప్రతి ఇంట్లో
# రెండు మొక్కలు నాటాలి



- అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కలు పెంచాలి
- ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది
- మహిళలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది
- సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి
- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్శిటీలో వనమహోత్సవం ప్రారంభం



నాడు రాజీవ్ గాంధీ స్థానిక సంస్థలలో మహిళా రిజర్వేషన్లను తీసుకురావడం వల్లే పట్నం సునీత మహేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లాలో నాలుగు సార్లు జెడ్‌పిచైర్‌పర్సన్ కాగలిగారు. గద్వాల విజయలక్ష్మి జిహెచ్‌ఎంసి మేయర్, శ్రీలత డిప్యూటీ మేయర్ అయ్యారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ 33 శాతం మహిళా రిజర్వేషన్ రాబోతున్నాయి. 51 సీట్లకు అదనంగా మరో తొమ్మిది సీట్లు కలిపి మొత్తం 60 సీట్లు(టికెట్స్) మహిళలకు ఇప్పించి, గెలిపించుకొని చట్ట సభల్లోకి తీసుకెళ్లే బాధ్యత నేనే తీసుకుంటా.

– సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

'పెద్దలు వనమే మనం, మనమే వనం' అని చెప్పారని,ప్రకృతిని మనం కాపాడుకుంటేనే ప్రకృతి మనల్ని కాపాడుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని దేశ ప్రధాని పిలుపునిచ్చారని, ప్రధాని పిలుపును సాదరంగా ఆహ్వానిస్తూ.. పిల్లలను పెంచే నైపుణ్యం కలిగివున్న మహిళ అని, ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో రెండు మొక్కలు నాటలని పిలుపునిచ్చారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటాలని,ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని,మీ పిల్లల్లాగే నాటిన మొక్కలను సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని యూనివర్సిటీ ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవం 2025 ను ప్రారంభించారు. ఆ తరువాత యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.అనంతరం స్థానిక శాసనసభ్యులు తరువాయి 2లో

## 'ఖేలో ఇండియా గేమ్స్' తెలంగాణలో నిర్వహించండి

- క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి
- కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్

'ఖేలో ఇండియా గేమ్స్2026'ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ ఎల్. మాండవీయకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతో పాటు జాతీయ క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని తరువాయి 2లో

# 9న దేశంలో భారీ ఉద్యమాలకు నాంది సార్వత్రిక సమ్మె



సమ్మెలో 25 కోట్ల మంది

జాతీయ సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన 25 కోట్ల మందికి పైగా కార్మికులు పాల్గొంటారని భావిస్తున్నాం.

- అనేక రాష్ట్రాల్లో బంద్ తరహా వాతావరణం చూస్తాం
- కేంద్ర ప్రభుత్వానికి సంప్రదింపులపై విశ్వాసం లేదు
- నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, దేశ ప్రజల కోసమే సమ్మె
- ఖాళీలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు
- కనీస వేతనం రూ.26వేలు, కనీస పిఎఫ్ పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి
- ఏ పెన్షన్ లేనోళ్ళకు నెలకు రూ.6 వేలు ఇవ్వాలి
- 4 లేబర్ కోడ్‌లు అమలు చేయకపోతే పెట్టుబడులు రావంటున్నారు
- పెట్టుబడులు రాకపోవడానికి కారణం కార్మికులు కాదు.. అదానీ, అంబానీలే..
- బిఎంఎస్ అనుబంధ సంఘాల కార్మికులు సైతం సమ్మెకు మద్దతిస్తున్నారు

కార్మిక, రైతాంగ సుదీర్ఘ పోరాటాలకు పది కేంద్ర కార్మిక సంఘాల సమ్మె కీలకం

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్

**న్యూఢిల్లీ :** జూలై 9న పది కేంద్ర కార్మిక సంఘాలు 17 పాయింట్‌ల చార్టర్ ఆఫ్ డిమాండ్‌లతో పిలుపునిచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మె నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, నిరుద్యోగులు, కార్మికుల కోసం ఉద్దేశించినదని సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకురాలు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. 'ది హిందూ' ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, కార్మిక వర్గం, రైతు సమాజం, వ్యవసాయ కార్మికులను సుదీర్ఘ పోరాటానికి సిద్ధం చేయడానికి ఈ సమ్మె అత్యంత కీలకమైనదని ఆమె పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్ హక్కులను అణచివేస్తున్న ప్రభుత్వ చర్యలను ఆమె నిలదీశారు. భారతదేశానికి పెట్టుబడిదారులు రా కపోవడానికి కారణం కార్మికులు కాదని, ఒకటి లేదా రెండు కంపెనీలను ప్రోత్సహించే ప్రభుత్వ విధానమే అందుకు కారణమని ఆమె అన్నారు.

**ప్రశ్న : గతంతో పోలిస్తే ప్రస్తుత సమ్మె ప్రాసంగికత ఏమిటి?**

**అమర్‌జీత్ కౌర్ :** ప్రస్తుత సమ్మె ప్రాముఖ్యత ఏమిటంటే, భారతదేశంలో పెద్ద ఉద్యమాలకు ఇది నాంది అవుతుంది. ఇక భరించేది లేదు. ఈ ప్రభుత్వం నియామకాలను నిలిపివేసింది. యువతకు ఉద్యోగాలు సృష్టించడం లేదు. దానికి బదులు తక్కువ జీతాలతో, ఎటువంటి సామాజిక భద్ర త లేకుండా పదవీ విరమణ చేసిన వారిని నియమించడం మొదలెట్టారు. ఇప్పటికే ఈ విధానాన్ని రైల్వేలో, ఉక్కు రంగంలో ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వంలో, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో దాదాపు 15 లక్షల ఉద్యోగ ఖాళీలు నోటిఫై అయి ఉన్నాయి. కానీ, ప్రభుత్వం నియామకాలకు సిద్ధంగా లేదు, బదులుగా అనేక ఉద్యోగాల ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తోంది. ఈ దేశంలో నిరుద్యోగం అనేది చాలా, చాలా తీవ్రంగా ఉండబోతుందనేది స్పష్టం. ప్రస్తుత ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించకూడదని నిర్ణయించుకున్నారు. వారు యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని (యుపిఎస్) కొనసాగిస్తామని చెబుతున్నారు. యుపిఎస్ అనేది జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్) కన్నా దారుణం. మీరు యుపిఎస్‌ను ఎంచుకుంటే, తిరిగి ఎన్‌పిఎస్ లేదా ఒపిఎస్‌కు మారేందుకు వీలు ఉండదు. ఇక మూడవది, మేము వ్యతిరేకించిన ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఉద్యోగకల్పన అనుసంధాన ప్రోత్సాహకం) విధానాన్ని ప్రభుత్వం కొనసాగిస్తున్నది. దీని కోసం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఇపిఎఫ్‌ఒ)లో దాచుకున్న కార్మికుల డబ్బును యజమానులకు నిధులు సమకూర్చడానికి ఉపయోగిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తరువాయి 2లో



## బిహార్ ఓటర్ల జాబితా సవరణపై 10న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ :** ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న సుప్రీంకోర్టు విచారించనున్నది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల చెల్లుబాటును పరిశీలించనున్నట్లు పేర్కొంది. పలువురు పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి బెంచ్ గురువారం కేసును విచారించేందుకు అంగీకరించింది. ఈ పిటిషన్లపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేయాలని బెంచ్‌ను సిబల్ కోరగా.. విచారణ జరుగుతుందని జస్టిస్ సుధాన్షు తెలిపారు. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టిఎంసి ఎంపి మహువా మొయిత్రాతో పాటు ఎడిఆర్ సంస్థ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తరువాయి 2లో

## 10న మంత్రివర్గ సమావేశం

- స్థానిక సంస్థల ఎన్నికలు, గిగ్ వర్కర్లకు భద్రత చట్టం, సమగ్ర విత్తన చట్టంపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రుల కు, సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తూ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సంబంధించిన అంశాలు, గిగ్ వర్కర్లకు భద్రత చట్టం, సమగ్ర విత్తన చట్టం, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణ తేదీలు తదితర అంశాలపై చర్చించవచ్చు. అలా గే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఇందిరమ్మ ఇండ్లపై మ రోసారి కేబినెట్ సమావేశంలో చర్చ జరగవచ్చని సమాచారం.

## 10 పని గంటల విధానం వద్దు

తక్షణమే జిఒ282ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి : కూనంనేని డిమాండ్

ప్రజా పక్షం /హైదరాబాద్

మేడే త్యాగాల స్ఫూర్తితో బ్రిటిష్ కాలంలోనే సాధించుకున్న 8 గంటల పని హక్కును మార్చడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.రాష్ట్రంలోని వాణిజ్య ప్రదేశాలలో ఉద్యోగులు, కార్మికులను రోజుకు 10 గంటల పాటు పని చేసేందుకు యాజమాన్యానికి వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ. 282ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు భంగకరమని ఆయన విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తరువాయి 2లో

## గత బిఆర్‌ఎస్ పాలనలో
# ఎటిఎంలా మత్స్యశాఖ

- అవినీతి, అక్రమాలతో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం
- ఈ యేడాది 82 కోట్ల చేప పిల్లల విడుదలకు ఏర్పాట్లు
- చేప ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్ ఉండేలా కార్యాచరణ
- రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

గత బిఆర్ఎస్ పాలకులు మత్స్యశాఖను ఒక ఎటిఎంలా వాడుకున్నారని రాష్ట్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, క్రీడా, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. సోమవారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఉజ్వల పార్కు సమీపంలో చేప పిల్లల పెంపకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తరువాయి 12లో





## బ్యాంకింగ్, బీమారంగాల నుంచి
# సమ్మెలో లక్షమంది

ఫైనాన్సియల్ సెక్టార్ యూనియన్స్ జాయింట్ ఫోరం ప్రకటన

- బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం
- పార్లమెంట్‌లో బిల్లు పెట్టిన రోజే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో రెండు తెలుగు రాష్ట్రాలలోని బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన దాదాపు లక్ష మంది ఉద్యోగులు పాల్గొననున్నట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జాయింట్ ఫోరం ఆఫ్ ఫైనాన్సియల్ సెక్టార్ యూనియన్స్ (జెఎఫ్ఎఫ్ఎస్‌యు) ప్రకటించింది. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంభిస్తున్న తరువాయి 2లో



## గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టులో తీర్పు రిజర్వ్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్–1 పిటీషన్లపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరువైపులా వాదనలు పూర్తవడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని పలువురు గ్రూప్–1 అభ్యర్థులు పిటీషన్లు దాఖలు చేశారు. ఏప్రిల్‌లో ఈ పిటీషన్లపై వాదనలు జరిగిన సందర్భంలో హైకోర్టు గ్రూప్–1 నియామకాలపై స్టే విధించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మాత్రం పూర్తి చేయెుచ్చని హైకోర్టు టిజిపిఎస్‌సిని ఆదేశించింది. కాగా, హైకోర్టుకు మే నెలలో వేసవి సెలవు ఉండటంతో నెల రోజుల తర్వాత ఈ పిటీషన్లపై మరోసారి విచారణ ప్రారంభమైంది. న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర రావు విచారణ నిర్వహించారు. విడతల వారీగా జరిగిన విచారణలో ఇరువైపుల న్యాయవాదులు సుదీర్ఘ వాదనలు వినిపించారు. మూల్యాంకనం, పరీక్షా కేంద్రాల కేటాయింపు, తరువాయి 2లో

## ఖనిజ ఉత్పత్తి, సరఫరాల వ్యవస్థ కాపాడుకునేందుకు
# ఉమ్మడిగా కృషి చేయాలి

బ్రిక్స్ దేశాల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

**రియో డీ జనీరో :** కీలక ఖనిజాల ఉత్పత్తి, సరఫరా సేవల వ్యవస్థను కాపాడుకునేందుకు అనివార్యంగా ఉమ్మడి కృషి చేయాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ దేశాల సదస్సులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు ఇచ్చారు. బ్రిక్స్ వార్షిక సదస్సులో మోదీ మాట్లాడుతూ, కీలకమైన ఖనిజ వనరులు, వాటి సాంకేతికతను కాపాడుకోవాలన్నారు. ఏ దేశం కూడా ఈ ఖనిజ వనరులను తమ స్వార్థ ప్రయోజనాల కోసం లేదా ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా ఉపయోగించకుండా కాపాడేవిధంగా పూర్తి భరోసా ఉండాలని, ఈ కీలక ఖనిజ వనరల సరఫరా వ్యవస్థను కాపాడుకోవాలని అన్నారు. శాంతి, ప్రగతి,స్థిరత్వంతో కూడిన ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకోవడానికి సహకారం, సమానత్వం, సమ్మిళితత్వ సూత్రాలను పాటిస్తూ, అన్ని దేశాలూ ఉమ్మడి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. 'బహుళపక్షాలమధ్య ఐక్యత, ఆర్థికాంశాలు,కృత్రిమ మేధ' అనే అంశంపై జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. కృత్రిమ మేధను ఉపయోగించడానికి,దాపరికంలేకుండా, దుర్వినియోగానికి అవకాశం లేకుండా కృత్రిమ మేధను వినియోగించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రామాణికతలను సృష్టించాలని ఆయన కోరారు. కీలకమైన ఖనిజవనరులను ఎగుమతి చేయడంపై చైనా ఆంక్షలు విధించడంతోపా టు ఈ రంగంలో దాపరిక విధానాలు కూడా అనుసరించడంపై ఆందోళన వ్యక్తమవుతున్న పరిస్థితులమధ్య ప్రధానమంత్రి పైవిధంగా వ్యాఖ్యానించారు. ''కీలకమైన తరువాయి 12లో




## వాణిజ్య ఒప్పందాలకు ట్రంప్ ఒత్తిడి



బుధవారంలోపు (జులై 9వ తేదీ) వాణి జ్య ఒప్పందాలు చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై ఒత్తిడి చేశారు. పెంచిన వాణిజ్య సుంకాల అమలును వాయిదా వేస్తూ గడచిన ఏప్రిల్ నెలలో ట్రంప్ విధించిన గడువు జులై తొమ్మిదో తేదీతో ముగుస్తుంది. ఈలోపు దేశాలన్నీ కొత్త వాణిజ్య ఒప్పందాలు తరువాయి 12లో




## సమాజానికి సేవ చేసేందుకు యువత ముందుకు రావాలి

కెయు స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ


ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

నేటి దేశ యువత పరిశోధన, అభివృద్ధికి కొత్త పరిశోధన మైలురాళ్లను నిర్దేశిస్తున్నారని గవర్నర్, కాకతీయ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవ సందర్భంగా వివిధ ఫ్యాకల్టీ పిహెచ్‌డి అభ్యర్థులకు పట్టాలు, వివిధ సబ్జెక్టుల మొదటి ర్యాంక్ పొందిన వారికీ గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేస్తూ విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, ఆహ్వానితులు, ప్రముఖులను ఉద్దేశించి, కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇజ్రాయెల్ నన్ను చంపాలని చూస్తోంది : పెజెష్కియన్



**మాస్కో:** ఇజ్రాయెల్ అధికారులు తనను హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఇరాన్ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ చెప్పారు. ''వాళ్ళు నన్ను ఇంతకుముందు హత్య చేసేందుకు ప్రయత్నం చేశారు, ఔను, నిజమే, హత్యకు తగిన చర్యలు తీసుకున్నారు, కానీ హత్య చేయలేకపోయారు, విఫలమయ్యారు'' అని చెప్పారు. అమెరికా జర్నలిస్టు థక్కర్ కార్ల్‌సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయం చెప్పారు. ఆయన చెప్పిన ప్రకారం పది రోజుల క్రితం పెజెష్కియన్‌పై హత్యా ప్రయత్నం జరిగింది. ''మేం ఏ విధంగా సమస్యలను అధిగమించి ముందుకు వెళ్ళాలి?అనే విషయంపై సమావేశం జరుపుతున్నాం, ఆ సమయంలో మేం సమావేశమైన ప్రదేశంపై బాంబు దాడి చేసే ప్రయత్నం జరిగింది'' అని ఆయన చెప్పారు.

## 'గెలాక్సీ లీడర్' సహా హౌతీల లక్ష్యాలపై
# 20 ఫైటర్‌జెట్స్‌తో ఇజ్రాయెల్ దాడులు





**దుబాయ్:** యెమన్ కేంద్రంగా పనిచేస్తున్న హౌతీ ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ సోమవారం తెల్లారకముందే గగనతల దాడులు ప్రారంభించింది. దీంతో హౌతీలు కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో ఎదురుదాడులు ప్రారంభించారు. యెమెన్‌లో హౌతీలకు ఉన్న అనేక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని 20 యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ దాడులు చేసిందని ఆ దేశ రక్షణశాఖ ధృవీకరించింది. ఆదివారంనాడు ఎర్ర సముద్రంలో వెళుతున్న లైబీరియా నౌకను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులు చేశారు. దీంతో నౌకలో మంటలు చెలరేగాయి. నావికా సిబ్బంది కూడా చేసేదిలేక ఓడను వదిలి వెళ్ళిపోయారు. ఈ ఘటన తర్వాత ఇజ్రాయెల్ ఎఫ్–16 యుద్ధ విమానాలతో దాడులు ప్రారంభించింది. తదుపరి మరిన్ని దాడులు చేస్తామని కూడా ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరించారు. హౌతీలు ఏం చేసినా అది ఇరాన్ చేసినట్టేనని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ వైపు ఎవరు వేలెత్తి చూపించినా ఆ వేలును నరుకుతామన్నారు. హౌతీలు తమ చర్యలకుగాను భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. అదేవిధంగా హౌతీల మిలిటరీ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సారీ మాట్లాడుతూ, తాము దీర్ఘకాలంపాటు స్థిరమైన యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. హోదైదాహ్, రాస్ ఇలాస్, సలీఫ్ ఓడరేవులతోపాటు రాస్ ఖతిఫ్ విద్యుత్ కేంద్రంపై కూడా దాడులు చేసింది. 'గెలాక్సీ లీడర్' భారీ వాణిజ్య నౌకపై కూడా ఈ దాడులు జరిగాయి. 2023లో హౌతీ ఉగ్రవాదులు ఈ గెలాక్సీ లీడర్ నౌకను హైజాక్ చేసి ఇప్పటివరకూ తమ అధీనంలో ఉంచుకున్నారు. సముద్రతల గస్తీకి, ఆపరేషనల్ ప్లానింగ్‌కు ఈ నౌకను హౌతీలు ఉపయోగించుకుంటున్నారని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడిఇఎఫ్) తెలిపింది. ఈ నౌకలో ఉన్న వివిధ దేశాలకు చెందిన 25 మంది నావికాదళ సిబ్బందిని కూడా హౌతీలు బంధించారు. ఇలా బందీలైనవారిలో ఫిలిప్పైన్స్, బల్గేరియా, రుమేనియా, ఉక్రేన్, మెక్సికో దేశాలకు చెందిన నావికా సిబ్బంది ఇంకా హౌతీలకు బందీలుగా ఉన్నారు. అంతర్జాతీయ సముద్ర జలాలలో వాణిజ్య నౌకల కదలికలను తెలుసుకుని దాడులు చేయడానికి వీలుగా హౌతీ ఉగ్రవాదులు ఈ నౌకలో రాడార్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకుని తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారని ఐ డి ఎఫ్ చెప్పింది. ఇజ్రాయెల్‌కు, తమ శత్రుదేశాల నౌకలకు వ్యతిరేకంగా దాడులు చేసేందుకు, ఆయుధాలు చేరవేసేందుకు హౌతీ ఉగ్రవాదులను ఇరాన్ దేశం పెంచి పోషిస్తోందని, వారి లక్ష్యాలను దెబ్బతీసేందుకే దాడులు చేశామని ఐ డి ఎఫ్ తెలిపింది.

## సుమీ బోర్డర్ జంక్షన్ రష్యా స్వాధీనం
### ఉక్రేన్‌పై 100 డ్రోన్లతో దాడి

**లుగాన్స్క్ :** రష్యాకు ఉక్రేన్‌లోని సుమీ రీజియన్‌కు మధ్య సరిహద్దులలో ఉన్న ఐదు కిలోమీటర్ల ప్రాంతం అంతా పూర్తిగా తమదేశం అధీనంలోకి వచ్చిందని రష్యా సైనిక నిపుణుడు ఆంద్రీ మారోచ్‌కో చెప్పారు. సుమీ ప్రాంతంలోని బెస్సలోవ్‌కా గ్రామాన్ని విముక్తి చేసిన తర్వాత రష్యా జాతీయ సరిహద్దుల్లో సుమీ ప్రాంతాన్ని అనుసంధానం చేస్తూ ఉన్న చౌరాస్తా సరిహద్దు ప్రాంతం తమ అధీనంలోకి వచ్చిందని ఆయన సోమవారంనాడు టాస్ వార్తా సంస్థకు చెప్పారు. ఇదిలా ఉండగా, ఉక్రేన్ రాజధాని కీవ్ పౌర ప్రాంతాలపై రష్యా సోమవారం తెల్లారకముందే 100 డ్రోన్లతో దాడులు చేసిందని చెప్పడాన్ని రష్యా సైనిక వర్గాలు తిరస్కరించాయి. ఉక్రేన్ డ్రోన్లతో దాడులు చేస్తుందన్న భయంతో రష్యా విమానాశ్రయాలలో వందలాది విమానాలు గాల్లోకి ఎగరకుండా ఉండిపోయాయనీ, దీంతో వారాంతంలో రష్యా ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి గందరగోళ పరిస్థితి తలెత్తిందని ఉక్రేన్ రవాణాశాఖాధికారి చేసిన ప్రకటనను కూడా క్రెమ్లిన్ వర్గాలు తోసిపుచ్చాయి.

అదేవిధంగా గడచిన 24 గంటల్లో రష్యా చేసిన దాడుల్లో కనీసం 10 మంది పౌరులు మరణించారనీ, మరో 38 మంది గాయపడ్డారనీ, వీరిలో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నాని ఉక్రేన్ అధికారులు చెప్పారు. ఇటీవలికాలంలో రష్యా తన దాడులను ఉద్ధృతం చేసింది. గడచిన వారంలో 1270 డ్రోన్లను, 39 క్షిపణులు, మరో 1000 శక్తిమంతమైన గ్లైడ్ బాంబులను ఉక్రేన్‌పై ప్రయోగించిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోమవారం నాడు ప్రకటించారు.

## ఎలాన్‌మస్క్ పార్టీ పెట్టడం హాస్యాస్పదం : ట్రంప్



**న్యూయార్క్:** ప్రపంచ కుబేరుడు, టెస్లాన్–స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్‌మస్క్ కొత్తపార్టీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శలు చేశారు. ఆయన కొత్త పార్టీ పెట్టడం హాస్యాస్పదమైన విషయమని అన్నారు. ఆయన పూర్తిగా తప్పుదారి పట్టారని, ఆయన చర్యలు హాస్యాస్పదమైనవని విమర్శించారు. ''అమెరికన్ పార్టీ'' పెడుతున్నట్లు ట్రంప్‌కు ఒకప్పటి మిత్రుడు మస్క్ శనివారంనాడు ఎక్స్ వేదికగా ప్రకటించారు. ''ఇలా ఒక పార్టీని ప్రారంభించడం నా దృష్టిలో హాస్యాస్పద చర్య'' అని ఆదివారంనాడు ట్రంప్ పాత్రికేయులతో అన్నారు. ఎయిర్‌ఫోర్స్ ఒన్ విమానాలో ప్రయాణిస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో ఎప్పుడూ రెండు పార్టీల వ్యవస్థ మాత్రమే ఉంటుందన్నారు. ఇప్పుడు కొత్తగా మూడోపార్టీని ప్రారంభించడం గందరగోళాన్ని జోడించినట్లే కాగలదన్నారు. ''మస్క్ పూర్తిగా దారితప్పడం నాకు విచారంగా ఉంది'' అని ట్రూత్ సోషల్‌లో రాశారు. గడచిన ఐదు వారాలుగా వినాశకరమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు సబ్సిడీల ప్రోత్సాహాన్ని ఆపేయాలని కోరుకున్న మస్క్ ప్రణాళిక దెబ్బతినడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. పైగా నాసా అడ్మినిస్ట్రేటర్‌గా తన మిత్రుణ్ణి నియమించాలని ఆయన తనను అడిగి అసబద్ధంగా ప్రభావితం చేయాలని చూశారని విమర్శించారు. ఎలాన్‌మస్క్ కార్పొరేట్ సంస్థతో భాగస్వామ్యంలో ఉన్న అతిపెద్ద నాసా వంటి సంస్థను నడపడానికి ఆయన స్నేహితుణ్ణి నియమించాలని అడగడం, మస్క్ కూడా అంతరిక్ష వ్యాపారంలో నిమగ్నమై ఉండటంవల్ల ఈ నియామకంలో ఎంతమాత్రం ఔచిత్యం ఉండదన్నారు.

## మయన్మార్‌లో ఘర్షణలు
# భయంతో 4వేలమంది భారత్‌కు వలస



**నేసిడా:** మయన్మార్‌లో ఘర్షణాత్మక ప్రాంతాలలో గడచిన నాలుగు రోజులుగా భారీ ఎత్తున అంతర్గత యుద్ధం జరుగుతోంది. దీంతో భయభ్రాంతులైన ప్రజలు గడచిన నాలుగు రోజులుగా భారత్‌కు తరలివెళ్ళారు. భారత్ ఈశాన్యప్రాంత రాష్ట్రం మిజోరాంలోని ఉన్నతాధికారులు సోమవారంనాడు ఈ విషయం వెల్లడించారు. సైనికుల ఆధిపత్యాన్ని తిరస్కరించిన చిన్‌లాండ్‌లోని స్థానిక ప్రజాదళాలు సైన్యంతో ఉద్ధృత యుద్ధం చేస్తున్నాయి. దీంతో భయంతో ఆ ప్రాంతంలోని ప్రజలు దట్టమైన అడవులలోంచి ప్రయాణించి మయన్మార్ వదలి మిజోరాం చేరుకున్నారు. ప్రత్యర్థి చైనా సాయుధగ్రూపులతో జరిగిన ఘర్షణల కారణంగా స్థానిక ప్రజలు భయపడి మిజోరాంకు చేరుకున్నారని ఆ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి వన్‌లాల్ మావియా చెప్పారు. ఇలా భయంతో వచ్చినవారికి భారత్‌లో బంధువులు ఉన్నారు. వారి ఇళ్ళకు వీరంతా తరలివచ్చారు. మరికొంతమంది నీడ లేక కమ్యూనిటీ హాల్స్‌లో తలదాచుకున్నారు. మిజోరాంలో ఇప్పటికే 30 వేలమంది మయన్మార్ ప్రజలు ఆ దేశం నుండి పారిపోయివచ్చి తలదాచుకున్నారు. ఈ విధంగా మయన్మార్ నుండి భారత్‌కు వలసలు పెరుగుతున్నాయి. 2021లో మయన్మార్‌లో సైనిక జుంటా పాలకుల ముఠా అధికారం చేపట్టినప్పటినుండీ ఆ దేశంలో అంతర్గత సంఘర్షణలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. దేశంలో ప్రజలు ఎన్నుకున్న పాలకులంతా జైళ్ళల్లో రాజకీయఖైదీలుగా మగ్గుతున్నారు.

## ఇరాక్ గుహల్లో గాలింపు చర్యలు
### ఎనిమిదికి పెరిగిన టర్కీ మృతులు

**బాగ్దాద్:** ఉత్తర ఇరాన్‌లోని గుహల్లో జరుగుతున్న గాలింపు చర్యల్లో ఇప్పటివరకూ ఐదుగురు టర్కీ సైనికులు మరణించగా సోమవారం మీథేన్ గ్యాస్ బారినపడి మరో ముగ్గురు సైనికులు మరణించారు. మరణించిన టర్కీ సైనికుల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. 2022 మేలో ఈ ప్రాంతంలో కుర్దిష్‌లు జరిపిన కాల్పుల్లో మరణించిన టర్కీ సైనికుడి జాడ తెలుసుకోవడంకోసం ఆ దేశసైనికులుగుహల్లోముమ్మరగాలింపు చర్యలు చేస్తున్నారు. ఇరాక్–కుర్దిష్‌లమధ్యజరుగుతున్నయుద్ధాన్ని నివారించేందుకు టర్కీ మధ్యవర్తిపాత్ర నిర్వహించింది. టర్కీ మధ్యవర్తిత్వం కారణంగా కుర్దిష్‌లు 40 సంవత్సరాలుగా చేస్తున్న సాయుధ పోరాటాన్ని ఆపేశారు.ఇది టర్కీకి గొప్ప విజయం. జైలుపాలైన పికెకె నాయకుడు అబ్దుల్లా ఓక్లాన్ ఇచ్చిన పిలుపుతో నిషేధిత కుర్దిష్ ఉగ్రవాద బృందం కాల్పుల విరమణనుపాటించింది. కుర్దిష్ వర్కర్స్ పార్టీ (పికెకె) గ్రూపును రద్దుచేస్తున్నట్లు వారు ప్రకటించారు. 1984లో ప్రారంభమైన ఈ యుద్ధంలో ఇప్పటివరకూ 40,0000మంది మరణించారు. తమపై దాడి చేస్తే తప్ప పికెకె సభ్యులు తిరిగి ఆయుధాలు ముట్టుకోరని ఆ సంస్థ ప్రకటించింది. కుర్దిష్ ఫైటర్లు నాలగు సంవత్సరాక్రితం కాల్చి చంపిన టర్కీ సైనికుడి అవశేషాలకోసం టర్కీ సైనికులు గాలిస్తున్నారు.

## విధానం వద్దు
(మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఇలాంటి జిఓల ద్వారా దొడ్డిదారిన అమలు చేయడం సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఒకవైపు దేశవ్యాప్తంగా ఈనెల 9న 4 లెబర్ కోడ్ల రద్దు చేయాలని సార్వత్రిక సమ్మెకు సిద్ధమైన తరుణంలో ఇలాంటి తిరోగమన జిఒ జారీ చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని కూనంనేని అన్నారు. ఈ జిఓలో కార్మికులు 10 గంటలు పని చేసే సమయంలో ఓవర్ టైమ్ ఇవ్వాలని, ఆరు గంటలకు ఒకసారి అరగంట విశ్రాంతి ఇవ్వాలని, వారానికి 48 పని గంటలు మించొద్దని ఉన్నప్పటికీ, ఆచరణ సాధ్యం కాదని, ఎందుకంటే తూతూ మాత్రం తనిఖీల ఉంటాయని స్పష్టం చేశారు. 10 గంటల పని విధానం పెట్టడం అంటే చిన్నగా 10 గంటల పని విధానానికి అలవాటు చేయడమని, విరామం సమయంలో ఓటిల పేరుతో వెట్టి చాకిరి చేయించుకోవడమేనన్నారు.కార్మిక శాఖ అధికారులు పట్టించుకోని ఉదంతం కళ్ళ ముందటే ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 10 గంటల పని విధానం అమలుకు అనుమతి ఇస్తూ జారీ చేసిన జిఓ282ను ఉపసంహరించుకోవాలని కోరారు.

**సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు :** 4 లేబర్ కోడ్లతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న 10కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కూనంనేని తెలిపారు. సమ్మెకు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు సంఘీభావంగా నిలవాలని కోరారు.

## విచారణ(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియను అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని మనోజ్ ఝా కోరారు. ఇసి ఉత్తర్వులు ఉత్తర్వు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కువ్యక్తిగత స్వేచ్ఛ), ఆర్టికల్ 325 (కులం, మతం, లింగం ఆధారంగా ఎవరినీ ఓటరు జాబితా నుంచి మినహాయించకూడదు), ఆర్టికల్ 326 (18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు)లను ఉల్లంఘిస్తుందని.. ఆదేశాలను రద్దుచేయాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘించిందని మొయిత్రాఆరోపించారు.

## ఉద్యమాలకు నాంది
(మొదటి పేజీ తరువాయి)

కింద పనిదినాలను పెంచాలని, అన్ని రంగాలకు నెలకు జాతీయ కనీసవేతనంగా రూ.26,000, కనీస పిఎఫ్ పెన్షన్‌గా నెలకు రూ.9,000, ఏ పెన్షన్ పథకాల పరిధిలోకి రాని వారికి నెలకు రూ.6,000 నెలవారీ పెన్షన్ ఉండాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

**ప్రశ్న : ఈ డిమాండ్లపై ప్రభుత్వం మీతో ఏదైనా చర్చలు జరి–పిందా?**

**అమర్‌జీత్ కౌర్ :** గత సంవత్సరం మేము కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కలిసిన సందర్భంలో మా డిమాండ్ల గురించి వివరణాత్మక ప్రెజెంటేషన్ చేసాము. ఈడిమాండ్లను తాను అధ్యయనం చేస్తానని ఆయన మాకు చెప్పారు. కానీ, దేశంలో కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈప్రభుత్వానికి సం ప్రదింపులపై విశ్వాసం ఉండదు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సి) దశాబ్దానికి పైగా సమావేశం కాలేదు. ఐఎల్‌సిని సమావేశపరచమని మాండవియాను మేము కోరాము. లేబర్‌కోడ్‌లను కేంద్రం అమలు చేస్తుందని మార్చిలో మాండవియా చెప్పారు. లేబర్ కోడ్‌లను అమలు చేసిన రోజు వాటి కాపీలను తగలబెట్టాలని, మే 20న సమ్మె చేయాలని మేము నిర్ణయించుకున్నాము.

సరిహద్దుల్లోని పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, మేము సమ్మెను జూలై 9కి వాయిదా వేశాము. కానీ ప్రభుత్వానికి అటువంటి ఆలోచనలు లేవు. లేబర్ కోడ్‌ల ప్రకారం కార్మిక చట్టాలను మార్చాల్సిందిగా ప్రధానమంత్రి కార్యాలయం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సలహా లేఖలు పంపుతోంది. రాష్ట్రాలు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నాయని, నిరసనలు వారి వైపు మళ్ళించాలని కేంద్ర ప్రభుత్వం, భారతీయ మజ్దూర్ సంఘ్ చె బుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు మినహా, ఎవరూ ఈ కోడ్‌లను నోటిఫై చేయలేదు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికి చాలా స్పష్టంగా తెలుసు. కాబట్టి వారు డబుల్ గేమ్ ఆడుతున్నారు. కేంద్రం 29 చట్టాలను కలిపి క్రోడీకరించింది. కోడ్‌ల ఆధారంగా, వారి నియమాలు, చట్టాలను మార్చమని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల ను అడుగుతోంది. ట్రేడ్ యూనియన్లు రాష్ట్రప్రభుత్వాలతో పోరాడుతాయి, మేము పోరాడుతూనే ఉంటాం. లేబర్ కోడ్‌లను అమలు చేయవద్దని రాష్ట్రాలను హెచ్చరించాము. మేము దానిపై పోరాడుతాము.

**ప్రశ్న : సులభతర వ్యాపారం(ఈజ్ ఆఫ్ దూ యింగ్ బిజినెస్) కోసం, పెట్టుబడులను ఆకర్షించడానికి కోడ్‌లు అవసరమని ప్రభుత్వం చెబుతోంది..**

**అమర్‌జీత్ కౌర్ :** కార్మిక కోడ్‌లను అమలు చేయకపోతే రాష్ట్రాల్లో పెట్టుబడులు ఉండవని వారు రాష్ట్ర ప్రభుత్వాలను భయపెడుతున్నారు. రాష్ట్రాలు భారత రాజ్యాంగాన్ని, కార్మిక చట్టాలను పాటించాలి. నిజమైన యజమానులు, పెట్టుబడిదారులకు స్థిరత్వం ముఖ్యం. అలాగే పారిశ్రామిక వృద్ధికి పారిశ్రామిక శాంతి కీలకం అని వారికి తెలుసు. పెట్టుబడులు తగ్గడానికి కారణం కార్మికులు కాదు.దీనికి మన ప్రభుత్వ ఆర్థిక, సామాజిక విధానాలు, ప్రపంచ ఆర్థిక మందగమనం కారణాలు. మతపరమైన దాడులు సర్వసాధారమైనవిగా మారిన దేశంలోకి విదేశీ పెట్టుబడిదారులు ఎందుకు రావాలి? శాంతిభద్రతలు ఒక తీవ్రమైన ప్రశ్న. క్రోనీ క్యాపిటలిజం(ఆశ్రిత పెట్టుబడిదారులు) కూడా పెట్టుబడిదారులకు మరొక అడ్డంకి. వనరులు అధికంగా అదానీ, అంబానీకి అప్పగించబడుతున్నాయి. మన ప్రభుత్వం రెండు కార్పోరేట్లకు మద్దతు ఇస్తుందని , ఈ పోటీలో సమాన అవకాశాల పరిస్థితి లేదని తెలిసినప్పుడు పెట్టుబడిదారులు ఎందుకు వస్తారు? కాబట్టి దీనికి కార్మికులు బాధ్యత వహించరు. కార్మికుల ఆందోళనలు ఇక్కడ అణచివేయబడుతున్నాయి.

**ప్రశ్న : ఈసారి ఈ సమ్మెకు ఎన్ని రంగాలు స్పందిస్తాయి?**

**అమర్‌జీత్ కౌర్ :** బ్యాంకులు, బీమా కంపెనీలు, ఉక్కు రంగం, బొగ్గు రంగం, ఖనిజాలు, పెట్రోలియం రంగం, కాపర్ రంగం, కొన్ని విమానాశ్రయాలలో సమ్మె నోటీసులు అందాయి. రైల్వే కార్మికులు సమ్మెకు మద్దతుగా సమీకరణలు చేస్తారు, కానీ రైల్వేలో సమ్మె ఉండదు. రక్షణ ఉత్పత్తుల రంగం సమ్మెకు వెళుతోంది. వారు ప్రతి చోటా సమ్మె నోటీసులు ఇచ్చారు. అన్ని రాష్ట్రాలు, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. అస్సాం, తమిళనాడు, గోవా, పంజాబ్, బీహార్, కేరళ, పశ్చిమ బెంగాల్, అనేక ఇతర రాష్ట్రాలలో 'బంద్ వంటి' వాతావరణం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీలను యూనియన్లు సంప్రదించాయి. వారు తమ మద్దతును ప్రకటించారు. సందేశం వెళ్లింది. బిఎంఎస్ అనుబంధంగా ఉన్న యూనియన్‌ల కార్మికులు మద్దతు ప్రకటించారు. ఈ సమ్మె కార్మిక వర్గాన్ని, రైతు సమాజాన్ని, వ్యవసాయ కార్మికులను సుదీర్ఘ పోరాటానికి సిద్ధం చేయడానికి అత్యంత ముఖ్యమైనది.

## తీర్పు రిజర్వ్
(మొదటి పేజీ తరువాయి)

మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య, అభ్యర్థుల మార్కుల వివరాలు ఇలా చాలా అంశాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని పిటీషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు వాదించారు. గ్రూప్–1 అక్రమాలపై సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని పిటీషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు. ఉద్యోగాలకు ఎంపికవని అభ్యర్థులు అపోహలతో పిటీషన్లు దాఖలు చేశారని, పారదర్శకంగా మూల్యాంకనం జరిగిందని టిజిపిఎస్‌సి తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. నిబంధనల ప్రకారమే పరీక్షా కేంద్రాల కేటాయింపు జరిగిందని వాదించారు. ఎంతమంది పరీక్షకు హాజరయ్యారనే విషయంలో నామినల్ రోల్స్‌తో పాటు అభ్యర్థుల వేలిముద్రలను పరిగణలోకి తీసుకొని పూర్తి వివరాలు వెల్లడించామన్నారు. తెలుగులో మెయిన్స్ రాసిన అభ్యర్థులు తక్కువ సంఖ్యలో గ్రూప్1కు ఎంపికయ్యారని, ఇంగ్లిష్‌లో రాసిన వాళ్లు తమ ప్రతిభ ఆధారంగానే గ్రూప్1కు ఎంపికయ్యారు తప్పితే టిజిపిఎస్‌సికి ఎక్కడ తెలుగు భాష పట్ల వివక్ష లేదని కోర్టుకు తెలిపారు.

**వాదనలు మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలి :** గ్రూప్1 నియామకాలపై ఉన్న స్టేను తొలగించాలని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటీషన్‌లపైనా వాదనలు ముగిశాయి. సంవత్సరాల తరబడి కష్టపడి ఉద్యోగం సాధించినా కోర్టు కేసుల వల్ల సకాలంలో నియామకాలు జరగడంలేదని ఇంప్లీడ పిటీషనర్ల న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు వేసిన పిటీషన్లతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో నష్టం జరుగుతోందని వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసిం ది. వాదనలు మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని జడ్జి తెలిపారు.

## సమ్మెలోకి లక్షమంది (మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలైన బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ రంగాలను కూడా ప్రభావితం చేస్తూ వాటి మనుగడకే ప్రమాదకరంగా తయారయ్యాయని, ఈ విధానాలను ప్రతిఘటిస్తామని జెఎఫ్ఎఫ్ఎస్‌యు హెచ్చరించింది. హైదరాబాద్‌లోని ఎపిటిబిఇఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ సంస్థల ఉద్యోగులు, అధికారుల యూనియన్లతో కూడిన జెఎఫ్ఎఫ్ఎస్‌యు నాయకులు బి.ఎస్.రాంబాబు, సమద్ ఖాన్ (ఎపిటిబిఇఎఫ్ – ఎఐబిఇఎ), ఫణికుమార్ (ఎఐబిఓఎ), టివిఎన్ఎస్.రవీంద్రనాథ్ (ఎస్‌సిజెడ్ఐఇఎఫ్), టి.సతీష్ (ఎన్ఎఫ్ఆర్ఆర్‌బిఇ), జి.తిరుపతయ్య (ఎల్ఐసిఇయు), కె.గంగాధర్ నాయుడు, ఎం.హరీష్‌బాబు (బిఇఎఫ్ఐ), ఎస్.గుణశేఖర్, ఎల్.మద్దిలేటి(ఐసిఇయు), యూనియన్ల నాయకులు డి.గిరిధర్, ఆర్.శ్రీనివాస్, మహ్మద్ జావెద్ తదితరులు మాట్లాడారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, ఇప్పటికైనా ఈ విధానాలను విరమించుకోనట్లయితే పార్లమెంట్‌లో బిల్లు పెట్టిన రోజే దేశవ్యాప్తంగా బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థలలో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ సంస్థలలో తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్న సిబ్బంది పనిభారంతో సతమతమౌతుంటే, కొత్తగా పని గంటలను పెంచాలనే ప్రతిపాదనను తీసుకురావడం గర్హనీయమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పరిరక్షణ, ఉద్యోగులు, కార్మికులు, ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ సంస్థలను కాపాడాకోవాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం ఈ నెల 9న జరిగే సమ్మెకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ కంపెనీలను బలోపేతం చేయాలని, తాత్కాలిక, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ విధానాన్ని రద్దు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ సంస్థలలో తగినంత శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ప్రధాన కార్యదర్శి టివిఎన్ఎస్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ ఇన్స్యూరెన్స్ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా దాడి చేస్తుందని, వంద శాతం ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ ఇన్స్యూరెన్స్ సంస్థలను విదేశీ సంస్థలకు దారాదత్తం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ భవిష్యత్ కోసం చేసే ఇన్స్యూరెన్స్ పాలసీల ప్రిమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని, ఇన్స్యూరెన్స్ వ్యాపారంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను నిరోధించాలని, ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎఐబిఓఎ (ఎపి,టిఎస్) అధ్యక్షులు ఫణికుమార్ మాట్లాడుతూ నేషనల్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి అందరికీ నిర్దిష్ట పెన్షన్(ఓపిఎస్) పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. టి.సతీష్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులను కూడా ప్రైవేటీకరించటానికి చట్టం చేసి ఐపిఓ ద్వారా మూలధనం సమకూర్చుకోవాలని ఒత్తిడి చేస్తున్నదని, ఈ ప్రతిపాదనను విరమించుకుని జాతీయ గ్రామీణ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## రెండు మొక్కలు నాటాలి
(మొదటి పేజీ తరువాయి)

టి.ప్రకాష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, లక్ష్యాన్ని పూర్తి చేయుటకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అందరు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతోందని,సోలార్ ప్లాంట్ల ఏర్పాటు,ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని,ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండ, టిఎస్ఆర్‌టిసి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని,పట్టణ ప్రాంతాల్లో మహిళలు కూడాను మహిళా సంఘాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించామని తెలిపారు.అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని సిఎం చెప్పారు.

**రియల్ ఎస్టేట్‌తో చెట్లు కోల్పోతున్నాం – మంత్రి కొండా సురేఖ...**

అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ వృక్షో రక్షిత రక్షితః చెట్లను పెంచడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవడం జరుగుతుందని,జీవవైవిధ్యన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు.చెట్లను పెంచడం ద్వారా వర్షాలు సకాలంలో కూరుస్తాయని,వంద శాతం మొక్కలు నాటేందుకు కృషి చేయాలని,భౌగోళిక పరిస్థితి మెరుగుపడే విధంగా రాష్ట్రమంతా విరివిగా వనాలు పెంచాలని,అందుకు అందరూ భాగస్వాములు కావాలని అన్నారు.రియల్ ఎస్టేట్ సంస్థలు చెట్లను నరికి వేయడం మూలంగా గ్లోబల్ వార్మింగ్ వస్తుందని, భూకంపాలు, సునామీలు రావడం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి మల్లు రవి,ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్,కాలే యా దయ్య, ఎమ్మెల్సీలు,కార్పొరేషన్ చైర్మన్లు,చల్లా నరసింహారెడ్డి,జ్ఞానేశ్వర్ ముదిరాజ్,జి హెచ్ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్,కమిషనర్ కర్ణన్,రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఉన్నతాధికారులు. తదితరులు పాల్గొన్నారు.

## 'తెలంగాణలో నిర్వహించండి'
(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రిని సిఎం కోరారు. కేంద్రమంత్రి మన్సు ఖ్ ఎల్.మాండవీయను ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణుల ఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్‌హాల్, హైదరాబాద్ హకీంపేట్‌లో ఆర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్‌బి స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి మాండవీయకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే క్రీడా వసతులను మెరుగుపర్చేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం ఇవ్వాలని సిఎం కోరారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఇవెంట్లు తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరిగానే రైలు ప్రయాణాల్లో ఛార్జీ రాయితీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(క్రీడలు) ఎ.పి.జితేందర్‌రెడ్డి, ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధిపై కపిల్ దేవ్ ప్రశంస...**

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో కపిల్ దేవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఎం రేవంత్ రెడ్డి కపిల్ దేవ్‌కు వివరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లో తాను భాగస్వామిని అవుతానని కపిల్ దేవ్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియాతో పాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు, అక్కడి క్రీడా ప్రముఖులతో తమ భేటీల వివరాలను సిఎం రేవంత్ రెడ్డి కపిల్ దేవ్‌కు వివరించారు. సమావేశంలో సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## 10న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడ్ ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు 'ఫార్మసిస్ట్ పోస్టులకు' జాబ్ మేళా నిర్వహించను న్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో జాబ్‌మేళా జరగనుంది.

మెడ్‌ప్లస్ ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన వంద పోస్టులను భర్తీ చేయనున్నారు. డి ఫారసీ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతీ యువకులు 18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నామని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. రూ.12,000 నుండి రూ.25,000వేల వరకు వేతనం పొందే ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు కోసం మరిన్ని వివరాలకు సాయి శైలేష్, హెచ్‌ఆర్ (9666662481) ఫోన్‌ను సంప్రదించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో స్వయంగా హాజరు కావాలని సూచించారు.

## ఆయిల్ పామ్ సాగుదారులకు అనుకూలంగా దిగుమతి విధానాలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతుల హక్కులు, వారి జీవనోపాధి రక్షణ, దేశీయ ఆయిల్ పామ్ పరిశ్రమ స్థిరత్వం కోసం రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేసి కేంద్రంపై ఒత్తిడి తెద్దామని వ్యవసాయశాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చా రు. ఆయిల్ పామ్‌పై కేంద్రం దిగుమతి సుంకం తగ్గించడంతో ఆయిల్ పామ్ ఉత్పత్తి చేస్తున్న దేశీయ రైతులు తీవ్రంగా నష్టపోతుండగా, మిల్లర్లు, రిఫైనర్లు, రీటైల్ వ్యాపారులు మాత్రం లాభపడుతున్నారన్నారు. ఈ అన్యాయాన్ని నిలదీసి రైతుల పక్షాన గళం వినిపించేందుకు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రులతో కలిసి కేంద్రాన్ని కలవనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నలుగురు దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో సంప్రదింపులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయిల్ పామ్ దిగుమతులపై ప్రస్తుత కస్టమ్స్ డ్యూటీని పెంచాలన్న అంశంపై చర్చలు జరిగాయని మంత్రి వెల్లడించారు. ఆయిల్ పామ్ రైతులకు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని, ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయం వ్యక్తమైందన్నారు.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో మంత్రి తుమ్మల సంప్రదింపులను నిర్వహిస్తునే మరోవైపు ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మిజోరం, నాగాలాండ్ త్రిపుర రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు వ్యక్తిగతంగా లేఖలు రాసినట్లు తెలిపారు. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో ప్రత్యక్షంగా సమావేశమై, ఆయిల్ పామ్ సాగుదారులకు అనుకూలంగా దిగుమతి విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు.

గతంలో మాదిరిగా క్రూడ్ పామ్ ఆయిల్‌పై దిగుబడి సుంకాన్ని 44 శాతానికి పెంచాల్సిందేనన్నారు.


## మానుకోట సిపిఐ జిల్లా కార్యదర్శిగా విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శిగా బి.విజయ సారథి మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కురవి మండల కేంద్రంలో పోగుల శ్రీనివాస్‌గౌడ్ ప్రాంగణంలో జరిగిన సిపిఐ జిల్లా మహాసభలో విజయసారథిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులుగా మహబూబాబాద్‌కు చెందిన బి.అజయ్‌సారథిరెడ్డి, కురవి మండల కేంద్రానికి చెందిన నల్లు సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కట్టె బోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పాండురంగాచారి, రేషపల్లి నవీన్, వరిపెల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వరావు మరో 24 మందిని కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు.

## వైద్య పరికరాలకు వెంటనే రిపేర్లు

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో టిజిఎంఎస్‌ఐడిసిహెడ్ ఆఫీసులోని ఐదుగురు బయోమెడికల్ ఇంజనీర్లతో కూడిన సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి సూచించారు. టిజిఎంఎస్‌ఐడిసిలో ఎక్విప్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా సీనియర్ బయోమెడికల్ ఇంజనీర్‌ను నియమించాలన్నా రు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సబ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ప్రతి సబ్ యూనిట్‌లో ఒకరిద్దరు బయోమెడికల్ ఇంజనీర్లను నియమించాలని ఆదేశించారు. ఎక్విప్‌మెంట్ మెయింటనన్స్ విషయంలో హాస్పిటల్లో పనిచేసే టెక్నీషియన్లకు, ఎలక్ట్రీషియన్లకు బేసిక్‌శిక్షణ ఇవ్వాలని, మిషన్ రిపేర్ వచ్చిన గంటలోపల హాస్పిటల్ సూపరింటెండెంట్ సబ్ యూనిట్‌కు, హెడ్ ఆఫీసుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సూపరింటెండెంట్ నుంచి సమాచారం వచ్చిన 6 గంటలలోపల బయోమెడికల్ ఇంజనీర్ ఆ హాస్పిటల్‌ను సందర్శించి, ఆ సమస్య ఏమిటో గుర్తించాలని అన్నారు. మైనర్ రిపేర్లు ఉంటే హాస్పిటల్ స్థాయిలో ఒక్కరోజులోనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా కొత్త విధానం ఉండాలన్నారు. మేజర్ రిపేర్లను మూడు రోజుల లోపల ఆ సమస్యను పరిష్కరించి, యంత్రాన్ని వర్కింగ్ కండిషన్‌లోకి తీసుకురావాలని తెలిపారు. ఒకవేళ ఏవైనా స్పేర్ పార్ట్స్ అవసరమైతే, వెంటనే సంబంధిత ఎక్విప్‌మెంట్ సప్లయర్ల కు సమాచారం ఇచ్చి దీనిని రిపేర్ చేయించాలని అన్నారు.

హాస్పిటల్ స్థాయిని బట్టి, ఆయా హాస్పిటల్‌లో ఏయే ఎక్విప్‌మెంట్ ఉండాలో ఒక స్టాండర్డ్ లిస్ట్ తయారు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఇందుకు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, డిఎంఇ నరేంద్ర కుమార్, వివిపి కమిషనర్ అజయ్ కుమార్ సభ్యులుగా కమిటీని నియమించారు. ఎక్విప్‌మెంట్ పూర్తిగా ఉపయోగంలో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత హాస్పిటల్ సూపరింటెండెంట్లదేనని, ప్రతి యంత్రం, ఫర్నీచర్ పేషెంట్లకు ఉపయోగపడే విధంగా చూసుకోవాలని దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా అన్ని హాస్పిటల్స్‌లో ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేయండి**

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన హాస్పిటల్స్ ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. కొత్త టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో మెడికల్, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోళ్లపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వినియోగిస్తున్న ఎక్విప్‌మెంట్ వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్‌ను కొనుగోలు చేయాలని, కొత్త హాస్పిటల్స్‌కు పేషెంట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ఆ అంచనాలకు తగినట్టుగా ఫర్నీచర్, ఎక్విప్‌మెంట్ ఉండాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుకూ వారంటీ ఉండాలని, మెయింటనన్స్ విషయంలో సప్లయర్లను బాధ్యులుగా చేయాలని సూచించారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్‌లో కనీసం 3 నెలలకు సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని టిజిఎంఎస్‌ఐడిసి అధికారులకు సూచించారు. టి డయాగ్నోస్టిక్ హబ్స్‌లో అన్ని రకాల పరీక్షలు, స్కాన్‌లు చేయాలని, ఒక్క పరీక్ష కోసం కూడా పేషంట్లను బయటకు పంపించొద్దని అన్నారు. 24 గంటల లోపల రిపోర్టులు అందజేయాలన్నారు. ఎంఆర్ఐ మిషన్ల కొనుగోలు, ఇన్‌స్టలేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

## సిగాచి ఘటన అత్యంత దురదృష్టకరం : చాడ వెంకటరెడ్డి

**ప్రజా పక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఈ ఘటన పూర్తిగా మానవ తప్పిదమని, ఇందులో ఇప్పటివరకు 41 మంది కార్మికులు ప్రాణాలు కొల్పోవడం బాధకర మని ఆయన పేర్కొన్నారు. మారిన పరిస్థితుల కు అనుగుణంగా యాజమాన్యం అధునాతన మైన పరికరాలను అమర్చుకోకుండా కార్మి కుల జీవితాలతో చెలగాట మాడిందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఒక పరిశ్రమలో ఇంతమంది చనిపోవడం మొదటి సారి అని, ఈ ఘటనను అనుభవంగా తీసు కొని రాష్ట్రంలోని అన్ని ఫ్యాక్టరీలపై సేఫ్టీ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేపట్టాలని చాడ వెంకట రెడ్డి కోరారు. ఈ సందర్భంగా చనిపోయిన వారికి సంతాపాన్ని వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపారు.

## సమ్మెలో మహిళలు

### మహిళా కార్మికులకు తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను 4కోడ్‌లుగా రూపొందించి కార్మిక హక్కులను హరించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సంఘాలు, అసోసియేషన్లు ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న మహిళా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఎఐటియుసి) అధ్యక్షురాలు పి. ప్రేమపావని, కన్వీనర్లు నందూరి కరుణ కుమారి, సి.హెచ్.సీతామహాలక్ష్మి, డి.కమలారెడ్డిలు పిలుపునిచ్చారు. కార్పొరేట్ల అనుకూల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, కస్తుర్బా బాలికల విద్యాలయం, సర్వ శిక్షాభియాన్, గ్రామీణ ఉపాధి హామీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న లక్షలాదిమంది మహిళా కార్మికులు తక్కువ వేతనాలతో ఎక్కువ పనిచేపిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తురన్నారు.. తమ శ్రమను వెచ్చిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చే విధంగా పనిచేస్తున్న వీరికి కనీసవేతనాలు, గ్రాట్యుటీ, సామాజిక భద్రతా చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం వీరికి చట్ట భద్రతను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జిఒ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో శ్రామిక మహిళలంతా నిరసిస్తూ ఈనెల 9న జరిగే సమ్మెలో వేలాదిగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

**సంయుక్త కిసాన్ మోర్చా ఆధర్యంలో సమ్మెకు మద్దతుగా నేడు గ్రామీణ ప్రాంతాల్లో నిరసనలు :** కేంద్ర ప్రభుత్వ అవలంభిస్తున్న కార్మి క, రైతు, వ్యవసాయ కార్మిక విధానానికి వ్యతిరేకంగా ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా (నేడు) 8వ తేదీన గ్రామీణ ప్రాంతాల్లో, 9వ తేదీన మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలనిసంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్లు టి సాగర్, జక్కుల వెంకట య్య, డి జి నరేంద్ర ప్రసాద్, ఆర్ వెంకట్రాములు, ఇ.విజయ్ పిలుపునిచ్చారు.



సమ్మెకు మద్దతుగా ఎస్‌కెఎం ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం ద్వారా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని, రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా వ్యవసాయ మార్కెట్ విధాన ముసాయిదా పత్రంతో రద్దుచేసిన మూడు చట్టాలను అమలు చేసేందుకు కేంద్రం పూనుకుంటున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండ కనీస మద్దతు ధరల చట్టం చేసేందుకు ముందుకురాని కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణ చట్టం ద్వారా రైతాంగానికి మరింత నష్టం చేస్తోందన్నారు. వీటన్నింటిని తిప్పికొట్టి మరోసారి కేంద్రం మెడలు వంచేందు కు ఈ నెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## 'వైల్డర్‌నెస్ రిసార్ట్'పై చర్యలు తీసుకుంటాం

### ప్రభుత్వం నుంచి బోటింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవు

### టిజిటిడిసి ఎండి మల్లూరి క్రాంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వికారాబాద్ సమీపంలో సర్పన్‌పల్లి ప్రాజెక్టులో వైల్డర్‌నెస్ రిసార్ట్ నిర్వహిస్తున్న బోటింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవని పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)మేనేజింగ్ డైరెక్టర్ మల్లూరి కాంత్రి తెలిపా రు. హైదరాబాద్ నుంచి విహార యాత్రకోసం వైల్డర్‌నెస్ రిసార్ట్‌కు వెళ్లి బోట్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మహిళలు రీటా కుమారి (55), పూనమ్ సింగ్(56)లు శనివా రం మృతి చెందిన ఉదంతం పై విచారణకు ఆదేశించామని కాంత్రి తెలిపారు. ఏదైనా చెరువు, సరస్సులో బోటింగ్ నిర్వహించాలంటే అందుకు పర్యాటక శాఖ, ఇరిగేషన్ శాఖల అనుమతులు తప్పకుండా ఉండాలి. అయితే సర్పన్‌పల్లి బోట్ ప్రమాదం ఘటనలో ప్రాథమిక విచారణలో ఎలాంటి అనుమతులు లేకుండానే దొంగ చాటుగా బోటింగ్ నడిపిస్తున్నారని తేలింది. సర్పన్‌పల్లి ప్రాజెక్ట్‌లో రిసార్ట్ యజమాని 8 ఎకరాలు ఆక్రమించుకుని చెరువులోనే రిసార్ట్ కట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు తానుగా విహార యాత్రకు వచ్చే యాత్రీకుల కోసం ఈ చెరువులో బోట్‌లను నడిపిస్తున్నారు. ఈ రిసార్ట్ యజమాని గతంలో దుర్గంచెరువు వద్ద జరిగిన రేవ్ పార్టీలో అరెస్టు అయినట్లు, అలాగే విశాఖపట్నంలో కూడా అసాంఘిక కార్యకలాపాల నిర్వహణలో అరెస్టు అయినట్లు తెలిసింది. ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల ప్రకారం జలాశయాల్లో బోటింగ్ నిర్వహణకు పర్యాటక శాఖ, నీటి పారుదల శాఖ అధికారులకు సదరు రిసార్ట్ యాజమాన్యం ఎలాంటి అనుమతుల కోసం కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదు. అసలు ప్రైవేటు వ్యక్తులు బోటింగ్ నిర్వహించకూడదని, టూరిజం శాఖ అధికారుల ఆధ్వర్యంలోనే బోటింగ్ నిర్వహణ ఉండాలని గత ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం జరిగిన ప్రమాదంపై రిసార్ట్ యజమానిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలి. అయితే అలాంటిదేమి ఇక్కడ జరగకపోవడం గమనార్హం. బోటింగ్ నిర్వహించే సమయంలో లైఫ్ జాకెట్లు కూడా ఇవ్వలేదని, కనీసం ఇవి ఉంటే మహిళలు చనిపోయే వారు కాదని అధికారులు అంటున్నారు. ఒబోల్తా పడిన బోట్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా లేదని, దాన్ని నడిపిస్తున్న డ్రైవర్ కు కూడా లైసెన్స్ లేదని తెలిసింది.

నిజానికి కాకినాడలో శిక్షణ పొందిన వారికి మాత్రమే బోట్ డ్రైవర్‌గా పెట్టాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఇక్కడి డ్రైవర్‌కు అలాంటి శిక్షణ ఏదీ లేదని తేలింది. సదరు రిసార్ట్ నిర్వాహకులు ఏడాదికాలంగా ఇక్కడ బోటింగ్ నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని టిజిటిడిసి ఎండి క్రాంతి తెలిపారు.

## సాగర్‌లో దళితులకు భూములపై అటవీశాఖ కొర్రీలు

### సమాచార రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేద ప్రజలు దశాబ్దాలకాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపించి, సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు.హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్, అంబేద్కర్ సచివాలయంలో సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కె.జానారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కె. జయవీర్ రెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డిఎస్.లోకేష్ కుమార్, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నాగార్జున సాగర్ నియోజకవర్గం లో 40–50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, కానీ వివిధ నిబంధనల పేరుతో ఆ భూములు అటవీ శాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీలు వేస్తున్నారన్నారని అన్నారు.

ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జిల్లాలకు పిసిసి ఇన్‌ఛార్జ్‌ల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాల ని సంబంధిత జిల్లాల ఇన్‌చార్జిలను టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశించారు. పార్టీ జిల్లా ఇంచార్జ్‌లతో సోమవారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఎఐసిసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ 10 మంది ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్‌లు సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన విధివిధానాలను మీనాక్షి నటరాజన్ జిల్లాల ఇన్‌చార్జ్‌లకు వివరించారు. త్వరలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం చేపట్టాలని ఆమె ఆదేశించారు.

**జిల్లా ఇన్‌చార్జ్‌ల నియామకం:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసేందు కు పార్టీకి ఉమ్మడి జిల్లాల వారీగా ఇంచార్జ్‌లను పార్టీ సీనియర్ నాయకులను టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సోమవారం నియమించారు. ఖమ్మం జిల్లాకు సిడబ్ల్యుసి సభ్యులు సిహెచ్.వంశీచంద్ రెడ్డిని, నల్గొండ జిల్లాకు ఎఐసిసి కార్యదర్శి ఎస్.ఎ.సంపత్ కుమార్‌ను, వరంగల్ జిల్లాకు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ను, మెదక్ జిల్లాకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, హైదరాబాద్ జిల్లాకు టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి)ని, మహబూబ్‌నగర్ జిల్లాకు పిఎసి సభ్యులు కుసుమ కుమార్‌ను, ఆదిలాబాద్ జిల్లాకు ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌ను, కరీంనగర్ జిల్లాకు ఎంఎల్‌సి అద్దంకి దయాకర్‌ను, నిజామాబాద్ జిల్లాకు వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ హుస్సేన్‌ను, రంగారెడ్డి జిల్లాకు సాట్ చైర్మన్ శివసేన రెడ్డిని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## మేము ప్రతిపక్షాలపై అడ్డమైన కేసులు పెట్టలేదు : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్, బిఆర్ఎస్ లేకపోతే గులాబీ జెండా ఎగరకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో రేవంత్ రెడ్డి తరహా లేకి పనులు చేయలేదని, ప్రతిపక్షాలపైన అడ్డమైన కేసులు పెట్టలేదని, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను పోలీసులతో కొట్టించలేదన్నారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కెసిఆర్ లాంటి ముఖ్యమంత్రులను చూసిన ప్రజలు, రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూసి ఛీ అనుకుంటున్నారని అన్నారు. బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు కెటిఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే ఇప్పుడు 100 సీట్లు గెలుస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని, అందుకే వంద కాదు బొంద అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తెచ్చిన కెసిఆర్ గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం న్యాయమా?, తెలంగాణ సిఎం కుర్చీలో కూర్చునే భాగ్యం రేవంత్ రెడ్డికి రావడానికి కారణమే కెసిఆర్ అని అన్నారు.

## తెలంగాణ నికర జలాల దోపిడీకే 'బనకచర్ల'



**ప్రజాపక్షం/శంకరపట్నం:** గోదావరి నదీ మిగులు జలాలు, వరద జలాల పేరుతో తెలంగాణ నికర జలాలను కొల్లగొట్టడం కొరకే ఆంధ్రప్రదేశ్ బనకచర్ల ప్రాజెక్టును రూపొందించిందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తన స్వార్థ అవకాశవాద రాజకీయాల కొరకు నాడు కెసిఆర్ అనుసరించిన తీరు నేడు తెలంగాణకు శాపంగా మారిందని దుయ్యబట్టారు. శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ గ్రామంలో సోమవారం తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ మోరె గణేష్ అధ్యక్షతన తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని బనకచర్ల ప్రాజెక్టు నిలిపివేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర నాయకత్వం కృష్ణ, గోదావరి నదులపై అడ్డగోలుగా ప్రాజెక్టు నిర్మాణం చేసుకుని తెలంగాణకు రావాల్సిన నీళ్ల రాకుండా దోచుకెళ్లారని, తిరిగి తాజా అదే తంతు మొదలు పెట్టారని దుయ్యబట్టా రు. దాని కొనసాగింపే గోదావరి నుంచి 300 టిఎంసిల నీళ్లను కొల్లగొట్టడానికి బనకచర్ల ప్రాజెక్టు అన్నారు. గోదావరి నది తెలంగాణ ప్రాంతంలో 79 శాతం ప్రవహిస్తుండగా ఆంధ్రాలో 21 శాతం భూభాగంలో మాత్రమే ప్రవహిస్తోందని తెలిపారు. గోదావరి నదీ ఆంధ్రాలో ప్రవహించే భూభాగం ప్రకారం 310 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకోవాల్సి ఉండగా ఇప్పటికే 684 టీఎంసీల నీటిని వాడుకుంటున్నారని, తిరిగి ఇప్పుడు మిగులు జలాల పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారని, ఇది తెలంగాణ నీటి వాటాకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ నాయకులు బనకచర్ల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నాడు జగన్, కెసిఆర్‌లు నదులు అనుసంధానం పేరుతో చేసుకున్న ఒప్పందాల్లో రహస్య ఒడంబడి గా బనకచర్ల ఉందనే వాస్తవం తెలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం జలాల మీద గెజిటెడ్ తీసుకొచ్చినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బిఆర్ఎస్, బిజెపి నాయకులు రాజకీయ పబ్బం గడుపుకోకుండా తమ తప్పిదాలను ఒప్పుకుని ప్రజలు మందు క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, ధర్మార్జున్, మహిళా జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికల్ల స్రవంతి, యువ జన సమితి జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, పల్లె శ్రీనివాస్, భాను కిరణ్, గోపగోని సాయిరాం, బల్ల వీరు, గోపగోని అరుణ్, తదితరులున్నారు.

## తిరుపతిలో బర్దన్ కాలనీ



**తిరుపతి:** భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.బి.బర్దన్ స్మృత్యర్థం ఆయన పేరుతో ఆంధ్రప్రదేశ్ పట్ట ణం తిరుపతిలో ఒక కాలనీని ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో 40 సభ్యులతో సిపిఐశాఖ ఏర్పడింది. భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బర్దన్ కాలనీ పార్టీ శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా బర్దన్ కాలనీలో 100 చెట్లు నాటారు. 100 సిపిఐ జెండాలను కూడా ఆవిష్కరించారు. ప్రతి నాయకుడూ ప్రాథమిక శాఖ సమావేశంలో పాల్గొనాలన్న తీర్మానం మేరకు పార్టీ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ ఈ మహాసభలో పాల్గొన్నారు. బర్దన్ కాలనీ సిపిఐ శాఖా కార్యదర్శిని ఎన్నుకున్న తర్వాత బహిరంగ సభ జరిగింది. ఇకమీదట బర్దన్ కాలనీలో పార్టీశాఖ కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయి.



## మీ చానల్ సంగతి చూస్తాం...

### బిఆర్ఎస్‌ను హెచ్చరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు సవాల్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజె పి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మీడియా సంస్థలపై బిఆర్ఎస్ దాడుల ను తీవ్రంగా ఖండించారు. బలమైన ప్రతిపక్షం ఉంటే ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవదన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి ఫోకస్ చేయలేదన్నారు. ఈసారి దృష్టిసారిస్తామని చెప్పారు. 25 రోజుల్లో పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. అందులో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. బిజెపిలో వర్గాలేమి లేవని, అందరం పార్టీ లైన్‌లో కలిసికట్టుగా వెళ్తామన్నారు. మీడియాపై బిఆర్ఎస్ దాడులు దుర్మార్గమని, మీడియా సంస్థలపై చెయ్యేస్తే టి న్యూస్ అంతు చూస్తామని రాంచందర్ రావు అన్నారు. తక్షణమే బిజెపివైఎం కార్యకర్తలు ఎబిఎన్, ఆంధ్రజ్యోతి సంస్థలకు రక్షణ కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై బిఆర్ఎస్ మూకలు దాడులు చేసే అవకాశం ఉన్న ట్లు పోలీసుల నంచి సమాచారం వచ్చిందన్నారు. మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదన్నారు.


హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్

హెచ్‌యండిఏ చట్టం 2008 యొక్క U/s. 15 (4) పబ్లిక్ నోటిఫికేషన్
(G.O.Ms.No. 152 MA & UD Dept. Dated 26.06.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 చట్టం నం.8) లోని సెక్షన్ 15 లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP 2031 ప్రకారం ఊహించిన భూ వినియోగానికి ప్రభుత్వం ఈ క్రింది మార్పును చేస్తోంది. G.O.Ms.No.33 MA మరియు UD తేది 24.01.2013 చూడండి, ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరం. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం, కొండకల్ గ్రామంలోని సర్వే నెం.లోని సైట్. నెం. 15, 16, 17, 18, 20, 22, 23, 27, 28, 29, 30, 31 మరియు 32 లో 81,341.78 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం ప్రస్తుతం నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP 2031లో పారిశ్రామిక ఉపయోగం కోసం కేటాయించబడింది. G.O.Ms.No.33 MA, తేదీ: 24.01.2013 ప్రకారం, ఇప్పుడు నివాస వినియోగంగా గుర్తించబడింది. పైన పేర్కొన్న వివరాలు http://gazette.telangana.gov.in/ మరియు http://hmda.gov.in//వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

Sd/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (MK)
HMDA

DIPR R.O.No: 4683-PP/CL/ADVT/1/2025-26 Date: 07-07-2025

ప్రజాపక్షం
మంగళవారం, 08 జులై

# మరాఠీ సోదరుల కలయిక

దాదాపు 20 సంవత్సరాల క్రితం విడిపోయిన బాల్‌థాక్రే శివసేన వారసులు ఉద్ధవ్‌థాక్రే, రాజ్ థాక్రే కజిన్ సోదరులను బిజెపి కలిపింది. మోదీ ప్రభుత్వ త్రిభాషా సూత్రాన్ని–హిందీయేతర రాష్ట్రాల్లో మూడవ భాషగా హిందీని విధిగా అమలు జరిపే ప్రయత్నానికి వ్యతిరేకంగా వారు ఏకమైనారు. మహారాష్ట్రలో ఉన్నది బిజెపి నాయకత్వంలో శివసేన (ఏకనాథ్ షిండే), ఎన్‌సిపి (అజిత్ పవార్)లతో కూడిన సంకీర్ణ ఎన్‌డిఎ ప్రభుత్వం. 1–5 తరగతులవరకు మూడవ భాషగా హిందీ బోధనను నిర్బంధం చేస్తూ దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం ఒకటికి రెండు ఉత్తర్వులు జారీ చేసి మరాఠా మాతృభాషాభిమానులను రెచ్చగొట్టింది. ఉద్ధవ్‌థాక్రే శివసేన, రాజ్ థాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) ఇదే అదనుగా ఆందోళనకు సన్నద్ధమవుతుండగా, ప్రభుత్వం ఆ రెండు ఉత్తర్వులు ఉపసంహరించుకొని, త్రిభాషా సూత్రం అమలుపై విధివిధానాల రూపకల్పనకు ఒక కమిటీ వేసింది. ప్రభుత్వం వెనక్కు తగ్గడాన్ని ఉద్ధవ్–రాజ్‌థాక్రే సోదరుల విజయోత్సవంగా జరుపుకున్నారు. బాల్‌థాక్రే జీవించి ఉన్నంతకాలం శివసేనలో రాజ్‌థాక్రేదే పెత్తనం. అయినా నీళ్ల కన్నా రక్తం చిక్కన అన్నట్లు బాల్‌థాక్రే తన కుమారుడు ఉద్ధవ్‌థాక్రే తన వారసునిగా ప్రకటించిన దరిమిలా రాజ్‌థాక్రే బయటకు వెళ్లిపోయి ఎంఎన్‌ఎస్ స్థాపించారు. మరాఠాయేతరులతో రౌడీయిజం, అల్లర్లు తప్ప రాజ్‌థాక్రే సాధించిందేమీ లేదు. కాగా, ఉద్ధవ్‌థాక్రే తమ మరాఠా ఆవేశాన్ని కొంత సడలించుకుని బిజెపితో ప్రయాణిస్తూ ముఖ్యమంత్రి పదవి కోసం కొట్లాడాడు. అది సాధ్యం కాక కాంగ్రెస్, ఎన్‌సిపిలతో కలిసి కూటమిగా ఏర్పడి ముఖ్యమంత్రి పదవి చేపట్టి తన కోరిక నేరవేర్చుకున్నాడు. అయితే ఏక్‌నాథ్ షిండే బిజెపి ప్రోత్సాహంతో శివసేనను చీల్చి తనదే అసలు శివసేన అనిపించుకున్నాడు. శివసేనను, ఎన్‌సిపిని చీల్చే ఎత్తుగడల్లో సఫలమైన బిజెపి మొన్నటి ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకుని ఎన్నాళ్ళ నుంచో అందరి ద్రాక్షగా ఉన్న మహారాష్ట్ర గద్దెను సొంతం చేసుకుంది.

ప్రతిపక్ష కూటమి ఛిన్నాభిన్నంగా ఉన్న స్థితిలో బిజెపి ప్రభుత్వం హిందీని పాఠ్యాంశంగా రుద్ది ఉద్ధవ్, రాజ్‌థాక్రే సోదరులను ఏకం చేసింది. దీని వెనుక రాజకీయాలు కూడా లేకపోలేదు. గడిచిన దశాబ్దాల్లో ఉత్తరప్రదేశ్, బీహార్ల నుంచి హిందీ మాట్లాడే ప్రజలు పెద్ద ఎత్తున మహారాష్ట్రకు వలస వచ్చారు. వారు బిజెపికి ఉండగా ఉన్నారు. ''భూమి పుత్రులకు ఉపాధి'' అనే నినాదంతో ఒకనాడు దక్షిణాదులపై ముఖ్యంగా తమిళులపై ''పంగి–లుంగి'' అంటూ దాడులు చేసి తన మరాఠా పునాదిని, హిందుత్వను జోడించి విస్తరించుకున్న శివసేన, ఇప్పుడు ఉత్తరాదివారిపై పోరాడవలసి వచ్చింది. అందుకు ''హిందీ'' వ్యతిరేక ఆందోళన అవకాశం ఇచ్చింది. అయితే తమిళనాడులాగా హిందీ బోధనను వ్యతిరేకించడం వేరు, హిందీ మాట్లాడే వారిపై దాడులు చేయటం వేరు. మహారాష్ట్రలో ముంబయి, పూణె, నాగపూర్ సహా పట్టణ ప్రాంతాల్లో అత్యధికులు హిందీ మాట్లాడతారు. హిందీ సినిమాలకు కేంద్రం ముంబయి. అందువల్ల వీధుల్లో, దుకాణాల్లో హిందీ మాట్లాడే వారిపై ఎంఎన్‌ఎస్ దాడులు చేయటం ఖండించదగింది. ప్రతి ప్రాంతీయ భాషకు దాని చరిత్ర, ఔన్నత్యం ఉన్నాయి. వాటిని పరిరక్షించుకోవలసిందే. కానీ ''హిందూ–హిందుస్థాన్–హిందీ'' నినాదంతో హిందీని హిందీయేతరులపై బలవంతంగా విధించే బిజెపి వైఖరి విచ్ఛిన్నకరమైంది. దాని విచ్ఛిన్నతను ఖండిస్తూ విచ్ఛిన్న చర్యలకు పాల్పడే ప్రాంతీయుల చర్యలు అంతే ఖండనార్హం.

మరాఠీ భాషాభిమానాన్ని థాక్రే సోదరులు ఆయుధంగా ప్రయోగించడానికి తక్షణ కారణం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ముఖ్యంగా బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ను గెలుచుకోవాలన్న తాపత్రయం. ఈ భాషా దురభిమానం దేశంలోని అన్ని జాతులు సహజీవనం చేస్తున్న మహానగరాల్లో లౌకిక జీవనానికి విఘాతం తెస్తుంది. రాజకీయంగా లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు ఎదురు దెబ్బ.

# దేశవ్యాప్త సమ్మె ఎందుకు?



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2019–2020 సంవత్సరాలలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చింది. కార్మికవర్గ ప్రతిఘటన ఉద్యోమాల కారణంగా వాటి అమలుకు సాహసం చేయలేకపోయింది. ఈ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జులై 9న జాతీయ సార్వత్రిక సమ్మెకు 10 కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. వాటితో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు, రైతు సంఘాలు ఐక్యంగా పిలుపునిచ్చాయి.

> *లేబర్ కోడ్‌లు 2020లో పార్లమెంట్ ఆమోదించిన ఐదేండ్లుగా వాటి అమలును ఐక్య ప్రతిఘటన ద్వారా కార్మిక వర్గం అడ్డుకుంది. భారతీయ న్యాయసంహిత (బిఎన్‌ఎస్)లోని సెక్షన్ 111 ప్రకారం కార్మికులందరూ కలిసి సామూహికంగా ఫిర్యాదు చేసినా సమ్మె నోటీసు ఇచ్చినా, సమ్మె చేసినా 'నాన్ బెయిలబుల్' కేసులు పెట్టొచ్చు.*

కొత్త లేబర్ కోడ్‌లతో నష్టాలేమిటో ఒక సారి పరిశీలిద్దాం. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కారణంగా నేడు పరిశ్రమలలో కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. తమ సంస్థలో 300 మంది కార్మికుల సంఖ్య కంటే తక్కువ మంది పని చేస్తున్నారనే కారణం చూపి, ఇష్టానుసారం కార్మికులను తొలగించేందుకు (హైర్ అండ్ ఫైర్ విధానం) అమలు చేసేందుకు యాజమాన్యాలకు ఈ కోడ్‌లు ఆయుధంగా మారనున్నాయి. సాధారణంగా పారిశ్రామిక కార్మికులకు నిర్దిష్ట ఆదేశాలు (స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం ప్రకారం పని పరిస్థితులు(సర్వీస్ కండిషన్‌లు)లపై కార్మికులతో యాజమాన్యాలు చర్చించి నిర్ణయించాల్సి ఉంటుంది. కొత్త లేబర్ కోడ్‌ల కారణంగా 300 లోపు కార్మికులు ఉండే పారిశ్రామిక సంస్థలలో ఈ స్టాండింగ్ ఆర్డర్స్ వర్తించవు. ఫలితంగా అత్యధిక పారిశ్రామిక కార్మికులు తమ పని పరిస్థితుల విషయంలో యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది.

ఒక సంస్థలో ఒకటి కన్నా ఎక్కువ కార్మిక సంఘాలు ఉన్నట్లయితే, కనీసం 51 శాతం కార్మికుల మద్దతు కలిగిన సంఘానికే ఏకైక గుర్తింపు హోదా ఇవ్వాలి. సంప్రదింపుల కమిటీలో 20 శాతానికి ఒక్కరు చొప్పున ప్రాతినిధ్యం ఇచ్చి, యాజమాన్యమే నియమిస్తుంది. కార్మికులు సమ్మె చేయడం వీలు కాని పరిస్థితులను కోడ్ కల్పిస్తుంది. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం పబ్లిక్ యుటిలిటీ సర్వీసుల (ప్రజావసరాల సేవల)లో పని చేసే వారు మాత్రమే సమ్మె చేసేందుకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ఏ సంస్థలోనైనా సరే సమ్మెకు ముందుగా నోటీసు ఇవ్వాల్సిందే. సమ్మె నోటీసు ఇచ్చిన 60 రోజుల లోగా సమ్మె చేయకూడదనటం సమ్మె హక్కును హరించటమే. ట్రిబ్యునల్ ప్రొసీడింగ్స్ కొనసాగుతున్నంత వరకుచ ఆ ప్రొసీడింగ్స్ ముగిసిన తరువాత 60 రోజుల వరకు సమ్మె చేయకూడదు. దీని వలన కన్సీలియేషన్ చర్చలు ట్రిబ్యునల్ ప్రొసీడింగ్స్ ఉద్దేశపూర్వకంగా దీర్ఘకాలం పొడిగించి సమ్మె చేయకుండా ఉండేందుకు ప్రభుత్వాలకు, కార్మిక శాఖకు పూర్తి అధికారాలను కట్టబెట్టింది. సమ్మెలో పాల్గొనే కార్మికులను, సమ్మెకు ప్రోత్సహించినా, ఆర్థికంగా సహకరించిన కార్మికులను, కార్మిక సంఘాల నాయకులను భారత న్యాయ సంహిత సెక్షన్ 111 ప్రకారం నేరంగా పరిగణించి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడమే కాక భారీ స్థాయిలో జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించే విధంగా మార్పులు చేసుకున్నారు. మరోవైపు కార్మికశాఖ, ప్రభుత్వ అనుమతి లేకుండానే కంపెనీలను లేఆఫ్ చేసేందుకు, లాకౌట్ విధించేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛకు ఈ కోడ్‌లో చట్టబద్ధత కల్పించారు. కాబట్టి లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు పోరాడుతున్నాయి.

భార్య, భర్తలిద్దరూ 2 యూనిట్లుగా, ఇద్దరు పిల్లలు కలిసి మరో యూనిట్‌గా, ఈ విధంగా మూడు వినిమయ యూనిట్లు ప్రాతిపదికగా కనీస వేతనాన్ని నిర్ణయించాలి. రోజుకు ఒక్కో యూనిట్‌కు 2700 కేలరీల శక్తినిచ్చే ఆహారంకు అయ్యే ఖర్చు, కుటుంబానికి సంవత్సరానికి 72 గజాల వస్త్రం, ప్రభుత్వ హౌసింగ్ స్కీములో అతి తక్కువ స్థలం వున్న ఇంటికి ప్రభుత్వం ఎంత అద్దె వసూలు చేస్తుందో దాని ప్రకారం ఇంటి అద్దె, వీటన్నింటికీ ఎంత మొత్తం అవుతుందో అంత మొత్తాన్ని కనీస వేతనంగా నిర్ణయించాలి.




**దేశవ్యాప్త సమ్మె డిమాండ్లు ఇవే**

- నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి
- కనీస వేతనం నెలకు రూ.26,000, కనీస పెన్షన్ రూ.9,000
- సమాన పనికి సమాన వేతనం
- అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత
- పెన్షన్‌తో సహా సమగ్ర సామాజిక భద్రతలో అందరినీ భాగస్వాములను చేయాలి
- ఎన్‌పిఎస్, యుపిఎస్‌ను రద్దు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరణ
- దరఖాస్తు చేసిన 45 రోజులలో కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్
- ఐఎల్‌ఒ సమావేశాలు సి87, సి98లను తక్షణమే ఆమోదించాలి
- ధరల పెరుగుదలను నియంత్రించాలి
- ఆహారం, మందులు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, ముఖ్య యంత్రాలపై జిఎస్‌టి రద్దు
- ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ విభాగాల ప్రైవేటీకరణను ఆపాలి
- నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి) ఉపసంహరించాలి
- అటవీ హక్కుల చట్టాన్ని (ఎఫ్‌ఆర్‌ఎ) కఠినంగా అమలు చేయాలి
- సంపన్నులు, కార్పొరేట్ పన్నును పెంచాలి
- భావ ప్రకటనా స్వేచ్ఛ, అసమ్మతి హక్కు, మత స్వేచ్ఛ, విభిన్న సంస్కృతులు, భాషలను పరిరక్షించాలి
- సమాఖ్యవ్యవస్థ, రాజ్యాంగంపై దాడిని ఆపాలి

ప్రస్తుత చట్టాల ప్రకారం కనీస వేతనాన్ని 5 సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా సవరించాలి. సంవత్సరానికి రెండు సార్లు డిఏని సవరించాలి. పాతచట్టం ప్రకారం ఫ్లోర్ లెవల్ వేతనాన్ని రెండు సంవత్సరాలకు ఒకసారి సవరించాలి. ధరల పెరుగుదలకు అనుగుణంగా డిఏని సెంట్రల్ అడ్వయిజరీ బోర్డుతో సంప్రదించి నిర్ణయించాలని కోడ్‌లు తెచ్చారు.

పాత చట్టం ప్రకారం కార్మికుడు 8 గంటలు పని చేయాలి. కానీ ఈ ముసాయిదా రూల్స్ ప్రకారం 10 గంటల పనిదినం వారానికి ఎన్ని గంటలు పని చేయాలో చెప్పకపోవడంలో మోసం దాగి ఉన్నది. ఇది భారత దేశం కూడా ఆమోదించిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) కన్వెన్షన్ ప్రకారం వారానికి 48 గంటల పనికి మించరాదు అన్నదానికి విరుద్ధం. వేతనాల కోడ్ ప్రకారం మహిళలు, పురుషులకు ''సమాన పనికి సమాన వేతనం'' ఇవ్వాలి. సమాన వేతన చట్టం నిబంధనలు రద్దు చేసి కేవలం లింగ వివక్ష కారణంగా సమాన వేతనాలివ్వకపోవటం ఒక్క దానినే నేరంగా పరిగణించాలని వేతనాల కోడ్‌లో పేర్కొన్నారు. యాజమాన్యాలు వేతనాలు సక్రమంగా చెల్లిస్తున్నాయా లేదా పట్టించుకునే యంత్రాంగమే వుండదు. నియామకాలు, ప్రమోషన్లలో వివక్ష కొనసాగే ప్రమాదం ఉన్నది. ఈ లేబర్ కోడ్‌లలో వుండాల్సిన కనీస వేతనం నిర్ధారణ, బోనస్ ఫార్ములా, వాటిని సకాలంలో చెల్లించటం వేతనాలకు అనుబంధంగా వుండే ఓవర్ టైమ్ అలవెన్స్, ఇన్సెంటివ్ వంటివి నీరుగార్చబడినాయి.

మొత్తం కార్మికులలో 70 శాతం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులుగా వున్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనులను సంవత్సరాల నుండి చేస్తున్నారు. లేబర్ కోడ్‌ల వలన కాంట్రాక్ట్ వర్కర్లకు ఎటువంటి రక్షణ, ప్రయోజనాలు లభించవు. ఇప్పుడున్న కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం 20 లోపు వర్కరు ఉన్నా కాంట్రాక్టర్ లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. కానీ ఈ కోడ్‌లో ఈ పరిమితిని 50కి పెంచారు. దీని ప్రకారం 50కి లోపు వర్కర్స్ వున్న కాంట్రాక్టర్ లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదు. లైసెన్స్ లేని కాంట్రాక్టర్‌ను కాంట్రాక్ట్ వర్కర్ల హక్కులు, ప్రయోజనాలు అమలు చేసేలా చేయటం సాధ్యం కాదు. కాబట్టి మరింత ఎక్కువ మంది కాంట్రాక్ట్ కార్మికులకి హక్కులు, ప్రయోజనాలు లభించవు ఈ లేబర్ కోడ్‌ల వలన.

> *1991లో ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు 21 సార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిగాయి. గత ప్రభుత్వాలకు సమ్మెలతోనే భారత కార్మికవర్గం సమాధానం చెప్పింది. నేడు కూడా 2025 జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెతోనే కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలి. కార్మికవర్గం అందుకు సిద్ధం కావాలి.*

కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకుండా ఎగవేస్తే లేదా పారిపోతే కార్మికులకు దిక్కులేదు. కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం శాశ్వత స్వభావం గల పనులను రెగ్యులర్ వర్కర్స్‌తో చేయించాలి. కానీ ఈ కోడ్ దీనిని ఎత్తివేసింది. రెగ్యులర్ కార్మికులు ఉండాలని ఈ కోడ్ అంటున్నది. కానీ ''కోర్'' అంటే ఏమిటో నిర్వచించే పనిని సంబంధిత ప్రభుత్వాలకు వదిలేసింది. కార్మికుల, యూనియన్ల ప్రమేయం లేకుండా చేస్తుంది. ఈ కోడ్ సక్రమంగా అమలు జరగని సంస్థలు, కంపెనీల్లో కార్మికులు కోర్టులో సివిల్ కేసు వేయడాన్ని కూడా నిషేధించింది.

ఇలాంటి ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు దీర్ఘకాలిక బలమైన ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం 2025 జులై 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గంతో పాటు ప్రజలు కూడా సంపూర్ణంగా భాగస్వామ్యం కావాలని కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి.

# పనిగంటలు పెంచితేనే కార్మిక, ఉద్యోగ సంక్షేమం సాధ్యమా!?



డా.కోలాహలం రామ్‌కిశోర్
9849328496

పనిగంటలు పెంచడం ద్వారా ఉత్పాదకతను మెరుగుపరచవచ్చనే ఆలోచన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో ఒక వివాదాస్పద అంశంగా నిలిచింది. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి 2023లో 70 గంటల పని వారం అవసరమని సూచించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిగంటలు పెంచే జీవోలు జారీ చేయడం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసిం ది. కార్మిక సంఘాలు, వామ పక్ష పార్టీలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి, ఇది కార్మికుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వాదిస్తున్నాయి. ఈ వ్యాసం చారిత్రక సందర్భం, ఆధునిక అధ్యయనాలు అలాగే నైతిక దృక్కోణం నుంచి ఈ సమస్యను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది.

### చారిత్రక నేపథ్యం: 8-8-8 సూత్రం

19వ శతాబ్దంలో ఉద్యోగ, కార్మిక విప్లవ సమయంలో, కార్మికులు రోజుకు 12–16 గంటలు అమానుష పరిస్థితులలో పనిచేసేవారు. ఈ అధిక పనిగంటలు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవనం మరియు సామాజిక శ్రేయస్సుపై తీవ్ర ప్రభావం చూపాయి. 1817లో రాబర్ట్ ఓవెన్ ప్రతిపాదించిన 888 సూత్రం— 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు వ్యక్తిగత జీవనం— కార్మిక ఉద్యమాల ఫలితంగా 20వ శతాబ్దంలో అమల్లోకి వచ్చింది. ఈ విభజన శాస్త్రీయంగా కార్మికుల సామర్థ్యం, శ్రేయస్సును పెంపొందించింది. అయితే, ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో లాభాల కోసం ఈ సూత్రాన్ని విస్మరించే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి.



### ఆధునిక సందర్భం

నారాయణ మూర్తి 70 గంటల పనివారం సూచన భారతదేశంలో ఉత్పాదకత పెంచడానికి ఉద్దేశించబడినప్పటికీ, ఇది కార్మిక సంక్షేమాన్ని విస్మరించినట్లు విమర్శలు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రంగాలలో పనిగంటలు పెంచడానికి జీవోలు జారీ చేయడంతో, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వామపక్షాలు దీనిని లాభ దృష్టితో కూడిన మొండి విధానంగా గుర్తించాయి. ఈ నిర్ణయాలు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవనం అలాగే సామాజిక సమతుల్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వారు వాదిస్తున్నారు. ఇటీవలి అధ్యయనాలు పనిగంటలు పెంచడం వల్ల ఉత్పాదకతలో తాత్కాలిక పెరుగుదల కనిపించినప్పటికీ, దీర్ఘకాలంలో ఇది ప్రతికూల ఫలితాలను తెస్తుందని సూచిస్తున్నాయి. 2019లో నిర్వహించిన ఒక మెటా విశ్లేషణ ప్రకారం, వారానికి 48 గంటలకు మించి పనిచేసే కార్మికులు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, నిద్ర లోపం, వృత్తిపరమైన గాయాలకు గురవుతారు. ఈ అధ్యయనం ప్రభుత్వాలు, యజమానులు పనిగంటలను పరిమితం చేయాలని, కార్మికుల ఆరోగ్యాన్ని రక్షించాలని సిఫార్సు చేస్తుంది.

మరోవైపు, తక్కువ పనిగంటలు లేదా నాలుగు రోజుల పనివారం వంటి ప్రత్యామ్నాయ షెడ్యూల్‌లు కార్మికుల ఆరోగ్యం, సంతృప్తి మరియు ఉత్పాదకతను మెరుగుపరుస్తాయని అధ్యయనాలు చూపిస్తున్నాయి. 2023లో యూకేలో నిర్వహించిన నాలుగు రోజుల పనివారం ప్రయోగం 92 శాతం కంపెనీలు దీనిని శాశ్వతంగా అమలు చేయడానికి మొగ్గు చూపాయి, ఎందుకంటే ఇది ఉద్యోగుల సంతృప్తిని పెంచడమే కాకుండా, ఆదాయాన్ని 8 శాతం పెంచింది. ఈ ప్రయోగం కార్మికుల ఒత్తిడి తగ్గించి, కుటుంబ జీవనానికి మరింత సమయం కేటాయించడానికి వీలు కల్పించింది.

### ఆర్థిక దృక్కోణం: లాభాలు వర్సెస్ సంక్షేమం

పెట్టుబడిదారీ విధానంలో, లాభాలు పెంచడం కోసం కార్మికులపై అదనపు ఒత్తిడి విధించడం సర్వసాధారణం. మార్క్స్ లేబర్ వాల్యూ థియరీ ప్రకారం, కార్మిక శక్తి వినియోగం కాపిటలిస్ట్ లాభాలకు ప్రధాన వనరుగా ఉంటుంది, కానీ దీనిని 'అదృశ్యం' చేయడం ద్వారా కార్మికుల సహకారాన్ని తక్కువ చేస్తారు. నారాయణ మూర్తి వంటి పారిశ్రామికవేత్తలు ఎక్కువ పనిగంటలు ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని వాదిస్తున్నప్పటికీ, ఇది కార్మికుల ఆరోగ్యం, దీర్ఘకాల ఉత్పాదకతను దెబ్బతీస్తుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

ఉదాహరణకు, ఒక కాల్ సెంటర్ అధ్యయనం ప్రకారం, పనిగంటలు 1 శాతం పెరిగితే, ఉత్పాదకత కేవలం 0.9 శాతం మాత్రమే పెరుగుతుంది, ఇది అలసట వల్ల సామర్థ్యం తగ్గుతుందని సూచిస్తుంది. ఇది లాభాల కోసం కార్మికుల సంక్షేమాన్ని త్యాగం చేయడం దీర్ఘకాలంలో ఆర్థికంగా నష్టదాయకమని చూపిస్తుంది. ఎక్కువ పనిగంటలు కార్మికుల కుటుంబ జీవనంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. యూరోపియన్ సోషల్ సర్వే (2022) ప్రకారం, ఎక్కువ పనిగంటలు జీవన సంతృప్తిని తగ్గిస్తాయి, ముఖ్యంగా ఆరోగ్యం మధ్యవర్తిగా ఉన్నప్పుడు. నాలుగు రోజుల పనివారం వంటి విధానాలు కార్మికుల ఒత్తిడిని తగ్గించి, సామాజిక సమతుల్యతను పెంపొందిస్తాయని ఈ అధ్యయనం సూచిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం నీతి పరమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. లాభ దృష్టితో కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవనాన్ని పణంగా పెట్టడం న్యాయబద్ధమా? కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఈ విధానాలను 'అమానుష'మని విమర్శిస్తున్నాయి, ఎందుకంటే ఇవి కార్మికుల హక్కులను కాలరాస్తాయి.

### ప్రత్యామ్నాయాలు - సిఫార్సులు

అధ్యయనాలు తక్కువ పనిగంటలు లేదా సౌకర్యవంతమైన షెడ్యూల్‌లు ఉత్పాదకత, కార్మిక సంక్షేమాన్ని మెరుగుపరుస్తాయని సూచిస్తున్నాయి. ఉదాహరణకు, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (2023) నివేదిక ప్రకారం, సౌకర్యవంతమైన పని ఏర్పాట్లు ఉద్యోగుల సంతృప్తిని పెంచుతాయి, ఉత్పాదకతను మెరుగుపరుస్తాయి. ప్రభుత్వాలు పని గంటలను పరిమితం చేసే చట్టాలను బలోపేతం చేయాలి, మరియు కంపెనీలు కార్మికుల ఆరోగ్యం, జీవన సంతృప్తిని పరిగణనలోకి తీసుకోవాలి.

చివరిగా... పనిగంటలు పెంచడం ద్వారా లాభాలు సాధించాలనే పెట్టుబడిదారీ విధానం దీర్ఘకాలంలో కార్మికుల సంక్షేమాన్ని, ఉత్పాదకతను దెబ్బతీస్తుంది. 888 సూత్రం చారిత్రకంగా కార్మికుల హక్కులను రక్షించింది, ఆధునిక అధ్యయనాలు తక్కువ పనిగంటలు లేదా సౌకర్యవంతమైన షెడ్యూల్‌లు మెరుగైన ఫలితాలను ఇస్తాయని చూపిస్తున్నాయి. ప్రభుత్వాలు, పరిశ్రమలు లాభాలతో పాటు కార్మికుల ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సును పరిగణనలోకి తీసుకోవాలి. నైతిక దృష్టితో, సమతుల్య విధానం అవలంబించడం ద్వారా సమాజం, ఆర్థిక వ్యవస్థ రెండూ ప్రయోజనం పొందగలవు.

# పిడుగుల నుంచి రక్షణ చర్యలు


**వర్షాకాలం ఉరుములు, మెరుపులు, పిడుగులతో తస్మాత్ జాగ్రత్త..**



నైరుతి రుతపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాలలో అధిక వర్షపాతం నమోదు అవుతూ ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం అక్కడక్కడా కురుస్తుంది. ప్రజలకు, వాహనదారులకు పిడుగుల భయం పట్టుకుంది. వేసవి ముగియగానే పిడుగుల కాలం మొదలవుతుంది. కొన్ని వేల మెగావాట్ల శక్తి కలిగిన పిడుగులు అటు జీవుల ప్రాణాలు తీయడంతో పాటు విలువైన వస్తువులను కాల్చి బూడిద చేస్తుంటాయి. వర్షాకాలం ఆరంభంలో ఆకాశంలో జరిగే ఒత్తిడి, అలజడుల వల్ల పిడుగులు పడుతుంటాయి. వర్షం ప్రారంభం కాగానే నిర్లక్ష్యం విడిచి అప్రమత్తంగా ఉంటే పిడుగుల భారీ నుంచి కొంత వరకు బయట పడవచ్చు. ఆకాశంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడిన సందర్భాల్లో ఏదో ఒక చోట పిడుగు కాటుకు గురై ప్రతీ ఏటా వందలాది మంది మృత్యువాత పడుతున్నారు. మూగజీవాలు సైతం పిడుగుకు బలైపోతున్నాయి. అధిక శాతం మంది పశువుల కాపర్లు, వ్యవసాయ భూముల్లో పనిచేసుకునే రైతులు, కూలీలు ఎక్కు వగా ఉంటున్నారు. పిడుగు శబ్దానికి కొందరు ప్రాణాలు వదులుతుండగా, ఇంకొందరు దాని భయం, తీవ్రతకు బలవుతున్నారు. పిడుగులు పడే సమాచారాన్ని విపత్తుల నివారణ శాఖ ముందుగానే పలు సందార్భాల్లో ప్రకటిస్తున్నప్పటికీ ప్రమాదాలు తప్పడం లేదు. పిడుగుల బారి నుంచి తప్పించుకోవడానికి అప్రమత్తతతో వ్యవహరించాలి. గాలులు వీస్తున్నా, ఉరుములు ఉరిమినా పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో సమీపంలో గల పెద్ద భవనాల్లోకి వెళ్లడం మంచిది. ఉరుములు, మెరుపులు, గాలివాన సమయంలో ద్విచక్రవాహనాలు, కారు లు, ఆటోలు మిగతా వాహనాలు నడపడం మానుకోవాలి. లోహపు వస్తువులను తాకకుండా ఉండాలి. ఆరుబయట ప్రదేశాల్లో సెల్‌ఫోన్ వినియోగించవద్దు. ఉరుములు, మెరుపుల సమయంలో ఇళ్లలో తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఇంట్లో విద్యుత్‌తో నడిచే అన్ని వస్తువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికత వల్ల పిడుగులు పడే సమాచా రాన్ని యాప్ ద్వారా సైతం తెలుసుకునే వీలుంది. యాప్ ద్వారా ఏ ప్రాంతంలో పిడుగు పడుతుందో కొంతవరకు తెలిసిపోతుంది. మనం ఎంత వరకు రక్షణ పొందవచ్చునో తెలుసుకునే వీలుంది. విపత్తుల నివారణ శాఖ సైతం వర్షం, పిడుగులు, ఉరుములు, మెరుపుల సమాచారాన్ని ఎప్ప టికప్పుడు ప్రకటిస్తుంటుంది. ముందుగానే ఆయా జిల్లా లలో కలెక్టరులు, మండలాల తహసీల్దార్లను, అధికారులను అప్రమత్తం చేస్తోంది. పిడుగుపాటుకు గురయ్యే సమ యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా విపత్తుల శాఖ అధికారులు కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పిడుగు పాటు కు గురై మృత్యువాత పడిన బాధిత కుటుంబాలకు ప్రకృతి విపత్తు నష్టం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందిస్తుంటాయి. ఎర్తింగ్ తప్పకుండా ఏర్పాటు చేయాలి.. అధిక ఓల్టేజీ వచ్చి ఇళ్లలోని విద్యుత్తు గృహోపకరణాలు దగ్ధం అవుతుంటాయి. పిడుగులు పడే సమయంలో ఓల్టేజీ కొన్ని వందల రెట్లు పెరిగే అవకాశం ఉంది. దీన్ని నివారించేందుకు ఇంటికి తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. తీగలు, ఫ్యూజులు సైతం ఐఎస్ఐ మార్కు కలిగిన నాణ్యమైన ఉత్పత్తులనే వాడాలి.

ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో అన్ని విద్యుత్తు గృహపకరణాలను బంద్ చేసి ఉంచడం, ప్లగ్ తీగలను తీసి ఉంచడం మంచిది. భవనాలు, ఇళ్లపై సైతం పంచలోహాలతో తయారు చేసిన పరికరాన్ని బిగించుకోవడం వల్ల కొంతమేర పిడుగు బారినుంచి తప్పించుకోవచ్చు. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్స్, భవనాలు, చర్చిలు, దేవాలయాలు, మజీదులపై ఇలాంటి పరికరాన్ని బిగించడం సాధారణంగా జరుగుతుంటుంది. చెట్ల కిందకు వెళ్లడం ప్రమాదం. పిడుగులు పడతాయన్న సూచనలు కనిపించే సమయంలో చెట్ల కిందకు వెళ్లడం మంచిది కాదు. పిడుగులు భూమి మీదకు వచ్చే సమ యంలో ఎత్తయిన చెట్లు, పచ్చిక మైదానాలు, కొండలు, లోహాలను ఆకర్షిస్తాయి. చెట్ల కింద నిలుచున్న సమయంలో పిడుగులు పడితే శక్తి మనుషుల నుంచి ప్రసరించి ప్రమాదాల బారిన పడుతారు. ఆ సమయంలో నిలబడి ఉండటం కంటే నేలపై పడుకోవడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గే అవకాశం ఉంటుంది.జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం. అధిక జాగ్రత్తలు పాటిస్తే వానాకాలంలో పడే పిడుగుల బారి నుంచి రక్షణకు గురయ్యే అవకాశాలున్నాయి. వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద ఉండ కూడదు. విద్యుత్ స్తంభాలు, తీగలకు సమీపంలో నిలబడకూడదు. ప్రధానంగా ఎత్తయిన ప్రాంతాలపై పిడుగులు పడే అవకాశాలున్నాయి. పంచలోహ పరికరాన్ని బిగించుకోవడం వల్ల పిడుగు బారి నుంచి రక్షణ పొందే అవకాశాలున్నాయి. ప్రమాదాలకు గురైతే తక్షణమే చికిత్స అందించాలి వానాకాలం సీజన్‌లో పిడుగు ప్రమాదాలకు గురైన వ్యక్తులకు తక్షణమే చికిత్సలు అందించడానికి కుటుంబ సభ్యులు, ఇరుగు, పొరుగు ప్రయత్నించాలి. సమీపంలో ఉన్న వైద్యశాలకు తీసుకవెళ్లి చికిత్స అందించాలి. పిడుగులు పడిన సందర్భాల్లో శరీరం కాలి గాయాలు కావడం, అకస్మాత్తుగా గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు పని చేయకపోవడం వంటి ప్రమాదాలు జరుగుతుంటాయి. సరియైన సమయంలో చికిత్స అందించడం వల్ల కొంత మేలు కలిగే అవకాశాలు వున్నాయి. ప్రతీ ఒక్కరూ పిడుగుల గూర్చి, వాని రక్షణ చర్యలు గూర్చి తెలుసుకోవాలి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకి అవగాహన కల్పించాలి. పట్టణాలు, నగరాలలో, గ్రామంలలో అధికారులు, సిబ్బంది కూడా పిడుగు పాటు వల్ల జరిగే అనర్థాలు, ముందు జాగ్రత్తలు మీద అవగాహన కల్పించాలి.

– కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాలపల్లి, 9848445134



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## జిడిపిలో పరిశ్రమల వాటా క్షీణిస్తూ... 'బడా వ్యాపారాలు' పెరుగుతున్నాయ్

**న్యూఢిల్లీ:**నరేంద్ర మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ విమర్శలదాడికి దిగింది. ప్రభుత్వం బడా వ్యాపారాలపై దృష్టి సారించింది కానీ అలాంటి వ్యాపారాలు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి (కమ్యునికేషన్స్) జైరామ్ రమేష్ సోమవారం తన 'ఎక్స్' పోస్ట్‌లో ఈ విషయమై స్పందిస్తూ స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి)లో పరిశ్రమల వాటా క్షీణిస్తోందని, పరిశ్రమలపై ఏకాగ్రత పెరిగినట్లే ధరలపెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణాలలో ఇది ఒకటి అవుతోందన్నారు. పారిశ్రామిక వృద్ధిపై ప్రధానమంత్రి ఆయన భజన పరులు పెద్ద పెద్ద వాదనలు కొనసాగిస్తున్నారు. 'ఇందులో మూడు వాస్తవాలు వివాదాస్పదమైనవి. పరిశ్రమలపై ఏకాగ్రత పెరిగినందువల్లే స్థూల దేశీయ ఉత్పత్తిలో పరిశ్రమల వాటా క్షీణిస్తోంది. దీనివల్ల వినియోగదారులు ధరల పెరుగుదలను ఎదుర్కొంటున్నారు. ఇది వినియోగదారులకు ధరలు పెంచింది. ధరల పెరుగుదల కారణంగా ద్రవ్యోల్బణం ఏర్పడటానికి ఇది ప్రధానకారణాలలో ఒకటిగా ఉంది' అని తన పోస్ట్‌లో ఆరోపించారు.

# ప్రజలు, కాంగ్రెస్ నేతలను భయపెట్టేందుకు బిజెపి యత్నం



### ఎన్నికల హామీలు పూర్తిగా విస్మరించింది
### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శ

**రాయ్‌పూర్ :** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పాలక బిజెపి విస్మరించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. 'జల్, జంగల్, జమీన్' (నీరు, అడవి,భూమి)ను రక్షించుకోవడానికి పోరాటంలో ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి ఒక్కరినీ బెదిరించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తూ వాటిని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు.భారీవర్షాలమధ్య రాయ్‌పూర్‌లోని సైన్స్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన 'జై జవాన్–జై కిసాన్‌జై – సంవిధాన్' అనే బహిరంగ ర్యాలీలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వంలో పేదలు దోపిడీకి గురువుతున్నారన్నారు. 2023 మే నుండి జాతి ఘర్షణలకు గురైన మణిపూర్‌లో పర్యటించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమయం లేకుండా పోయిందని ఖర్గే విమర్శించారు. ఇడి, ఐటి వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి బిజెపి తమ నాయకులను బెదిరించడానికి ప్రయత్నిస్తోంది, వారి బెదిరింపులకు ఎప్పటికీ భయపడబోమన్నారు. మాజీ ముఖ్యమంత్రి (భూపేశ్ బఘేల్)తో సహా ఛత్తీస్‌గఢ్‌లోని తమ పార్టీ నాయకులను (దర్యాప్తు సంస్థలను ఉపయోగించి) వేధిస్తున్నారన్నారు. బిజెపి కూడా సోనియా గాంధీ మరియు రాహుల్‌జీలను నేషనల్ హెరాల్డ్ కేసులో ఇరికించడానికి ప్రయత్నించిందని, ఎల్లప్పుడూ కాంగ్రెస్‌ను అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తారని ఖర్గే మండిపడ్డారు. ఎన్నికలకు ముందు బిజెపి చాలా వాగ్దానాలు చేస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరచిపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. అందరినీ బెదిరించడం కాషాయ పార్టీ నేతలకు అలవాటైపోయిందని, మీరు భయపడనప్పుడే బతుకుతారన్నారు. మన జల, అడవి, జమీన్ (నీరు, అడవి, భూమి)ను మనం కాపాడుకోవాలనుకుంటే, మీరందరూ బిజెపికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఐక్యంగాఉండాలన్నారు. నేడు, అదానీ, అంబానీ వంటి వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ వచ్చి భూమిని ఆక్రమించుకుంటున్నారని, వారు గనుల కోసం అడవులలో లక్షలాది చెట్లను నరికివేస్తున్నారన్నారు. మోడీజీమన గిరిజన సోదరులు, ఛత్తీస్‌గఢ్ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత దుయ్యబట్టారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీసగఢ్‌నుమళ్లీ మళ్లీ ఎందుకు సందర్శిస్తున్నారు? ఇది వారి అత్తమామల స్థలమా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రధాని, హోంమంత్రి సూచనలను అనుసరిస్తారని, వారు లేవండి అని చెబితే, అతను లేస్తాడు, వారు కూర్చోండి అని చెబితే కూర్చుంటాడు అని ఎద్దేవా చేశారు. ఇది ఛత్తీస్‌గఢ్ ఆత్మగౌరవానికి పెద్ద ద్రోహమన్నారు. పెద్ద అవమానం అని ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బొగ్గు, ఇతర ఖనిజ నిక్షేపాలను దోచుకోవడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు వస్తున్నారని, వారు ప్రజల గురించి ఆందోళన చెందడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. 'మోదీ జీ, షా జీ పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇస్తున్నారు. ఖనిజాల కోసం తనిఖీ చేయడానికి షా ఇక్కడ సందర్శిస్తున్నారు' అని పేర్కొన్నారు.


## హిమాచల్‌లో నీట మునిగిన బ్యాంకు రూ. కోట్లలో నష్టం అంచనా




**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌ను వరదలు ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సహకార బ్యాంకు నీట మునిగింది. లక్షల్లో నగదు, లాకర్లలో దాచిన నగలు, విలువైన పత్రాలు పాడైనట్లు భావిస్తున్నారు. దీంతో కోట్లలో నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మండి జిల్లాలోని తునాగ్‌లో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు చాలా ప్రసిద్ధి. సమీపంలోని పట్టణాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు, వేలాది మంది ఖాతాదారులు తమ డబ్బును ఈ బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటారు. నగదుతోపాటు నగలు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో దాచుకున్నారు. కాగా, జూన్ 20 నుంచి జూలై 6 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాన్ని 23 ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వర్షాలు, వరదలకు మండి జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో తునాగ్ మార్కెట్ ప్రాంతంలోని రెండతస్తుల బిల్డింగ్‌లో ఉన్న రాష్ట్ర సహకార బ్యాంకు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. నీటి ప్రవాహం ఉధృతికి ఒక షట్టర్ పైకి లేచింది. మరో రెండు షట్టర్‌లు వంకరపోయాయి. మరోవైపు వరద నీటి వల్ల ఆ బ్యాంకులోని లక్షలాది నగదుతోపాటు లాకర్లలో ఉన్న నగలు, డబ్బు, ఇతర పత్రాలు పాడై ఉంటాయని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. కోట్లలో నష్టాన్ని అంచనా వేస్తున్నారు. దీంతో వ్యాపారులు, కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు. వరదల వల్ల ఆ బ్యాంకు నుంచి కొట్టుకుపోయిన విలువైన వస్తువులు చోరీ కాకుండా ఉండేందుకు స్థానికులు అక్కడ కాపలా ఉన్నారు.

## మోదీ ప్రభుత్వం ధనవంతుడిని మరింత సంపన్నుడుగా చేస్తోంది

### కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ధ్వజం
### ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌లో పెద్ద ఆటగాళ్ల తారుమారుపై మౌనం దేనికని ప్రశ్న



**న్యూఢిల్లీ :** భవిష్యత్తులు మరియు ఎంపిక (ఎఫ్ అండ్ ఓ) మార్కెట్‌లో పెద్ద ఆటగాళ్ల తారుమారుపై నరేంద్ర మోదీ ప్రభుత్వం మౌనం వహించడం ద్వారా ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తూ సాధారణ పెట్టుబడిదారులను నష్టాల అంచుల్లోకి నెట్టివేస్తున్నదని కాంగ్రెస్ ముఖ్యనేత, లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆయన సోమవారం నాడు తన 'ఎక్స్' పోస్టింగ్‌లో ఈ విషయమై మాట్లాడుతూ ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌లోని లొసుగులను తా ను ఊహించానన్నారు. 'నేను 2024లోనే స్పష్టంగా వివరించాను. భవిష్యత్తులు, ఎంపికల మార్కెట్ పెద్ద ఆటగాళ్లు, చిన్న ఇన్వెస్టర్లకు ఆటస్థలంగా మారింది. చిన్న ఆటగాళ్ల జేబులు నిరంతరం ఖాళీ అవుతున్నాయని కూడా చెప్పాను' అని రాహుల్‌గాంధీ గుర్తుచేశారు. ఇప్పుడు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) స్వయంగా జేన్ స్ట్రీట్ (గ్రూప్) వేల కోట్ల రూపాయలను తారుమారు చేసిందని ఒప్పుకుంది. దీనిపై చాలాకాలంగా సెబీ ఎందుకు మౌనం వహిస్తోంది ? అని ఆయన తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా, మార్కెట్‌ను మోసం చేసే వ్యక్తులు ఇంకెంత మంది ఉంటారోనని రాహుల్‌గాంధీ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఎవరి ఆదేశం మేరకు మోదీ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చున్నదని, ఇంకా ఎన్ని పెద్ద షార్క్‌లు రిటైల్ పెట్టుబడిదారులను తగ్గిస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం ధనవంతుడిని మరింత ధనవంతుడిగా మారుస్తూ సాధారణ పెట్టుబడిదారులను మాత్రం నష్టాల అంచుల్లోకి నెట్టివేస్తుందన్న వాస్తవం ప్రతీ సందర్భంలోనూ స్పష్టమవుతోందన్నారు. 2024 సెప్టెంబర్ 24న రాహుల్‌గాంధీ ట్యాగ్ చేసిన తన పోస్ట్‌లో అనియంత్రిత ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ 5 సంవత్సరాలలో 45రెట్లు పెరిగిందని, మూడేళ్లలో చిన్న ఇన్వెస్టర్లు రూ. 1.8 లక్షల కోట్లు నష్టపోయారని వివరించారు.

## బీహార్ ఎన్నికల సంఘం పోస్టాఫీస్‌లా పనిచేస్తోంది : తేజస్వి యాదవ్

**పాట్నా :**అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పేరుతోఓటర్లజాబితాను సవరించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. దీనిపై బిహార్‌లో ప్రతిపక్ష మహాకూటమి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఓటర్ల జాబితా సవరణదేనికని,రెండునెలల్లోజాబితాను సవరించడం సాధ్యమా? అనిఆర్‌జెడి కీలక నేత తేజస్వి యాదవ్‌ప్రశ్నిస్తున్నారు. తాము ఈ నెల 5న ఎన్నికల సంఘాన్ని కలిసిఅతి తక్కువ సమయంలో ఎన్నికల జాబితాను సవరించడంతో వచ్చే సమస్యలపై సందేహాలు లేవనెత్తామని తెలిపారు. కానీ ఎన్నికల సంఘం నుంచి తమకు ఇంతవరకు వివరణ రాకపోవడం ఆందోళనకరమైన విషయమన్నారు. బీహార్ ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీస్‌లా పనిచేస్తున్నదని, తమ సందేహాలకు సమాధానం ఇచ్చే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘం దగ్గర లేదని విమర్శించారు. ఎన్నికల సంఘం ఆదివారం మూడు పరస్పర విరుద్ధమైన సూచనలు చేసిందని అన్నారు.

## ఎలుగుబంటి దాడిలో ముగ్గురు మృతి

**భోపాల్:** ఎలుగుబంటి దాడిలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు కర్రలతో ఆ ఎలుగుబంటిని వెంబడించారు. దానిని కొట్టి చంపారు. మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం సంజయ్ గాంధీ టైగర్ రిజర్వ్ సమీపంలోని బస్తువా గ్రామంలో ఐదుగురు వ్యక్తులపై ఎలుగుబంటి దాడి చేసింది. ముగ్గురు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఎలుగుబంటి దాడిలో ముగ్గురు చనిపోవడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. కర్రలతో దానిని వెంబడించారు. ఒక పొదలో దాగి ఉన్న ఎలుగుబంటిని కొట్టి చంపారు. దాని దాడిలో ముగ్గురు మరణించగా మరో ఇద్దరు గాయపడిన సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతులను బబ్బు యాదవ్, దీన్‌బంధు సాహు, సంతోష్ యాదవ్‌గా గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడా ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## యూట్యూబర్ జ్యోతిమల్హోత్రాకు కేరళ సర్కార్‌తో లింక్ నివేదిక...

### బిజెపి కేరళ వ్యతిరేక ప్రతీకార చర్య
### తీవ్రంగా ఖండించిన సిపిఐ
### జాతీయ భద్రతా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకేనని సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ ధ్వజం




**న్యూఢిల్లీ :** గూఢచర్యం అభియోగాలపై అరెస్ట్ అయిన యూట్యూబర్ జ్యోతిని కేరళ రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రామోటింగ్ చేసేందుకు కేరళ ప్రభుత్వం ఆహ్వానించిందని ముడిపెడుతూ ఇచ్చిన నివేదికలను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గట్టిగా ఖండించింది. 'యూట్యూబర్ జ్యోతి గూఢచర్యం కేసులోకి కేరళ ప్రభుత్వాన్ని లాగాలని బిజెపి చేసే ప్రయత్నం ఇది అని కమ్యూనిస్టు పార్టీ దీనిని తీవ్రంగా ఖండించింది. జాతీయ భద్రతకు సంబంధించి తీవ్ర వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బిజెపి ఈ చర్యలకు పాల్పడుతోందని సిపిఐ ఎంపి పి.సందోష్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన ఇక్కడొక ప్రకటన విడుదల చేశారు. పాస్‌పోర్ట్ జారీ, వీసా క్లియరెన్స్, ఇంటెలిజెన్స్ మోనిటరింగ్ అన్నీ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నప్పుడు యూట్యూబర్ పాకిస్థాన్ వెళ్లినందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సూచించడం దారుణం అన్నారు. 'కేరళ ప్రభుత్వం ఆమె పాకిస్థాన్ సందర్శనలను ఏమైనా ఆమోదించిందా?. దానివల్ల ఆమెకు ఢిల్లీలోని ఐఎస్ఐ హ్యాండ్లర్లతో పరిచయం ఏర్పడిందా?. ఇది నిరాశపరిచే రాజకీయ ప్రేరేపిత పక్కదోవ పట్టించే చర్య' అని సందోష్‌కుమార్ బిజెపిపై నిప్పులు చెరిగారు. గూఢచర్యం, ఉగ్రవాదంతో ముడిపడిపడి ఉన్న తమ సభ్యులకు సంబంధించి ఇబ్బందికరమైన జాబితా బిజెపి కలిగి ఉందని ఆయన స్పష్టం చేశారు. 'భోపాల్‌లోని ఐటి సెల్ నుంచి ధృవ్ సక్సేనా, భజరంగ్ దళ్‌కు చెందిన బల్‌రామ్ సింగ్, లష్కర్‌ఏతోయిబా ఉగ్రవాది తాలిబ్‌సింగ్, ఆయుధాల సరఫరా కేసులో అరెస్ట్ అయిన బిజెపి నాయకుడు తారిఖ్ మీర్, రాష్ట్రపతి పతకం ప్రదానం చేయబడిన డిఎస్‌పి దవీందర్ సింగ్ హిజుబుల్ ఉగ్రవాదులకు ఎస్కార్టింగ్ చేస్తూ పట్టుబడ్డాడని, ఆతర్వాత పాకిస్థానీ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి ఉన్నాడని ఇదే బిజెపి వాస్తవిక జాతీయ భద్రతా రికార్డ్' అని ఆయన చెప్పారు. 'ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రదాడి నేరస్థులు ఇప్పటి వరకు కూడా కనుగొనబడి, అరెస్ట్ చేయబడలేదు' అని సందోష్ కుమార్ ఆరోపించారు. 'దీని అంతటికీ బాధ్యత తీసుకోడానికి బదులుగా బిజెపి ఇప్పుడు కేరళ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంది. మల్హోత్రా ఒక రొటీన్ టూరిజం ఈవెంట్‌మెంట్ ద్వారా ఒకసారి హాజరైన ఆమెకు, ఐఎస్ఐ రిక్రూట్‌మెంట్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేనప్పటికీ, కేంద్రానికి చెందిన సొంత దర్యాప్తు సంస్థలు ఆమె అనేకసార్లు పాకిస్థాన్‌ను పర్యటనలు, విదేశీ నిధులను గుర్తించడంలో విఫలమయ్యాయి. ఇది అంతా నేరుగా వారి అధికార పరిధి కిందకే వస్తుంది' అని సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ వెల్లడించారు. జాతీయ భద్రత అనేది కేంద్ర అంశం, కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి అంశం, తరచూ నిఘా వైఫల్యాలు ఎదుర్కొంటూ వారు చేతులు కడుక్కోలేరు. వారి సమూహంలోనే గూఢచర్యం, ఉగ్రవాద సంబంధాలు కలిగిఉన్న వ్యక్తుల పేర్ల జాబితా పెరిగిపోతోంది' అని సిపిఐ నేత సందోష్ ఆరోపించారు. 'భారతదేశ ప్రజలు జవాబుదారీతనానికి మాత్రమే అర్హులు. కానీ బలిపశువులు అయ్యేందుకు, రాజకీయ ప్రతీకారానికి గురయ్యేందుకు మాత్రం కాదు' అని ఆయన బిజెపిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్ర నిర్వహణలో జరిగే ప్రభావశీల కార్యక్రమానికి కేరళ ప్రభుత్వం ఆహ్వానించిన వారిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కూడా ఒకరు అని సమాచార హక్కు సంస్థ (ఆర్‌టిఐ) ప్రతిస్పందనను ఉటంకిస్తూ నివేదికలు వచ్చాయి.

## మహారాష్ట్ర తీరంలో అనుమానాస్పద బోటు..

**ముంబయి :** మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా రేవ్‌దండలోని కొర్లాయ్ తీరం సమీపంలో ఒక అనుమానాస్పద పడవను గుర్తించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ పడవ పాకిస్థాన్‌కు చెందినది కావచ్చని అనుమానిస్తున్నారు. రాయ్‌గఢ్ పోలీసులు,తీరప్రాంతభద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. కొర్లాయ్ తీరానికి రెండు నాటికల్ మైళ్లదూరంలో ఒక అనుమానాస్పద పడవను ఇండియన్ నేవీ రాడార్ ఆదివారం రాత్రి గుర్తుపట్టింది.ఇది పాకిస్థాన్‌పడవకావచ్చని, అయితే పడవను అడ్డుకుని అధీనంలోకి తీసుకున్న తర్వాతే దాని పూర్తి వివరాలు తెలుస్తాయని సీనియర్ అధికారిఒకరుతెలిపారు.ప్రాథమిక సమాచారం ప్రకారం పడవ రాయ్‌గఢ్ తీరానికి కొట్టుకుని వచ్చి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. పడవను గుర్తించడంతోతీరప్రాంతం వెంబడి గస్తీని పెంచారు. పడవ సమాచారం తెలిసిన వెంటనే రాయ్‌గఢ్ పోలీసులు,బాంబ్‌డిటెక్షన్‌అండ్‌డిస్పోజల్ స్క్వాడ్ (బిడిడిఎస్),తక్షణస్పందనబృందం (క్యూఆర్‌టి), నేవీ, కోస్ట్ గార్డ్ సిబ్బంది రాత్రికి రాత్రి ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

## ఓటర్ల జాబితాకు వ్యతిరేకంగా ప్రతిపక్షం ఐక్యం



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను సుప్రీంకోర్టులో సవాలు చేస్తున్న తొమ్మిది పార్టీలతోకాంగ్రెస్ కూడా జతకట్టింది. ఈ అంశంపై మొత్తం ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓటర్ల ఓటు హక్కును తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ ప్రారంభించిన సవరణ ప్రక్రియ రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో గందరగోళానికి కారణమవుతోందని, తమ ఓటు హక్కు దొంగిలించబడుతుందనే భయం తో కోట్లాది మంది ఓటర్లలో ఆందోళన సృష్టిస్తోందని ప్రధాన ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టు న్యాయం చేస్తుందని పూర్తి నమ్మకం ఉందని తెలిపింది. కాంగ్రెస్ తరపున సంతకం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ మాట్లాడుతూ వివిధ ప్రతిపక్ష పార్టీలతో కలిసి బిహార్‌లో నిస్సందేహంగా రాజ్యాంగ విరుద్ధమైన ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఇది బీహార్‌లోని గ్రామాలు, పట్టణాలలో విధ్వంసం సృష్టించిందని, కోట్లాది మంది ఓటర్లకు వారి ఓటు హక్కు దొంగిలించబడుతుందా అనే ఆందోళనను కలిగించిందన్నారు. ఇది పాలక ప్రభు త్వం సూచనల మే రకు ఇసిఐ చేపడుతున్న భారీ రిగ్గింగ్, దు శ్చర్య అని వేణుగోపాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయి తే సుప్రీంకోర్టు న్యాయం చేస్తుంద ని నమ్మకం తమకు ఉందన్నారు. నేడు కాంగ్రెస్, తొమ్మిది రాజకీయ పార్టీలతో కలిసి ఇసిఐ చేపడుతున్న లోపభూయిష్ట, విధ్వంసక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను సవాలు చేయడానికి కలిసి వచ్చిందని మరో కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. దుర్మార్గపు, దుష్ట పద్ధతి కారణంగా అధిక సంఖ్యలో ఓటర్ల ఓటు హక్కును తొలగించే ఈ ప్రక్రియను వ్యతిరేకించడానికి మొత్తం ప్రతిపక్షం కలిసి వస్తుందన్నారు. సుప్రీంకోర్టు ఈ విషయంపై విచారణ చేసేందుకు ఈనెల 10వ తేదీన షెడ్యూల్ చేసిందన్నారు. సత్యమేవ జయతే అని ఖేరా ఎక్స్‌లో తెలిపారు. 'ప్రజాస్వామ్యమా లేదా బిజెపి ఓటు అణచివేత యంత్రాంగమా? అని బిహార్ అడుగుతోందని, దేశమూ అడుగుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా అన్నారు. బిహార్ ఓటర్ల జాబితా జనవరి 2025లో ఖరారు చేయబడిందని, ఎన్నికల కమిషన్ కూడా దీనిని అంగీకరించిందని ఆయన అన్నారు. జూన్ వరకు సవరణలు జరిగాయని, ఆపై అకస్మాత్తుగా దానిని విస్మరించారని ఆయన పేర్కొన్నారు. అయితే ఎటువంటి రుజువు లేకుండా ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా 7 కోట్ల మంది ఓటర్లు ఇప్పుడు తమ భారతీయ పౌరసత్వాన్ని మళ్ళీ నిరూపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. 2003 తర్వాత జాబితాలో పేర్లు ఉన్న వారిని అనుమానంతో చూస్తున్నారన్నారు. గత 20 సంవత్సరాలుగా ఓటు వేస్తున్న పౌరులను ఇప్పుడు గుర్తింపు, నివాసం, పౌరసత్వ పత్రాలు అడుగడమేంటని నిలదీశారు. గుర్తుంచుకోండి, ప్రజాస్వామ్యం శకుని పాచికలకు కోల్పోదని కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో అన్నారు. ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను చేపట్టాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఈనెల 10న విచారించడానికి సుప్రీం కోర్టు సోమవారం అంగీకరించింది.

# ట్రంప్ కేటాయింపు వైఫల్యం వల్లే టెక్సాస్ విలయం!

### 27 మంది క్యాంప్ బాలికలు మరణించారని ధృవీకరణ
### 89 మంది వరద మృతులు : 41 మంది గల్లంతు
### లెక్కకు అందని గల్లంతైనవారి సంఖ్య
### బాధితుల సహాయానికి ట్రంప్ ఉత్తర్వు
### వాటికన్ సిటీలో ప్రత్యేక ప్రార్థనలు



**ఆస్టిన్ :** టెక్సాస్ రాష్ట్రం కెర్ కౌంటీలో జరిగిన వరద మహా విలయంలో మృతులసంఖ్యను సోమవారంనాటికి 89గా నిర్ధారించారు. సమ్మర్ క్యాంప్‌కు వచ్చి వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలికలకోసం విపరీతంగా గాలించినతర్వాత 27 మంది బాలికలు, వారి సిబ్బంది మరణించారని అధికారికంగా ధృవీకరించారు. ఇప్పటివరకూ మొత్తం 89 మంది మరణించారనీ, మరో 41 మంది జాడ తెలియరాలేదనీ నిర్ధారించారు. జాడ తెలియకుండా పోయినవారిసంఖ్య లెక్కకు అందడం లేదు. గురువారంనాడు రాత్రి ప్రారంభమైన చరిత్రాత్మకమైన భారీ వర్షాలు, నది వరద మట్టం పెరుగుదల గురించి నిద్రలో ఉన్న ప్రజలకు హెచ్చరికలు చేసి అప్రమత్తం చేయడంలో వాతావరణశాఖ విఫలమైంది. శుక్రవారం ఉదయం 5.20 గంటల సమయానికి పరిస్థితి చేయి దాటిపోయింది. బుధవారం మధ్యాహ్నం నుండీ మౌఖికంగా హెచ్చరికలు ప్రారంభమైనప్పటికీ వాట్సాప్ ద్వారా ఇతర మార్గాలలో నది ఒడ్డున ఉనన వేసవిశిక్షణ శిబిరానికి ఎందుకు ఆదేశాలు వెళ్ళలేదన్నది సమాధానంలేని ప్రధాన సమస్యగా మిగిలింది. దీనికి కారణం వాతావరణశాఖకు తగిన కేటాయింపులు చేయకపోవడం, సిబ్బంది నియామకాల కొరత ప్రధానమైన సమస్య కావచ్చునన్న విషయం వెలుగులోకి రావడంతో అందరి దృష్టీ ఇప్పుడు ట్రంప్ వైపు మళ్ళింది. వార్నింగ్ వ్యవ స్థ ఏర్పాటు చే యడం అత్యం త ఖరీదైన వ్యవహారం కావడం తో దానిని అందరూ విస్మరించారు. కానీ ట్రంప్‌తో పాటు వాణిజ్యమంత్రి హోవార్డ్ లుత్నిక్ కూడా ఈ ఆరోపణలను తిరస్కరించారు. కీలక నియామకాలు చేసే విషయంలో ఎలాంటి పొదుపు చర్యలూ పాటించలేదని, బడ్జెట్‌లో కోతలు పడలేదని వారు తమ వైఖరిని సమర్థించుకున్నారు. మరోవైపు ట్రంప్ వరద విలయంలో బాధితులకు న్యాయం చేసేందుకు, అక్కడి పరిస్థితులను సన్నిహితంగా పరిశీలించి తగిన సహాయం అందించేందుకు ఒక ఉత్తర్వులపై సంతకం చేశారు. వచ్చేశుక్రవారం తాను టెక్సాస్ వరద ప్రాంతంలో పర్యటిస్తానని ట్రంప్ చెప్పారు. ఇదిలా ఉండగా ఈ వరద విలయ ఘటనతో చలించిపోయిన పోప్ లియో–14 తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు రోమ్‌లోని వాటికన్ సిటీలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పొదుపు చర్యలు, బడ్జెట్‌లో కోతల ప్రభావం వాతావరణశాఖమీద పడిందని, ప్రజలకు ముందస్తు అలారమ్ ద్వారా హెచ్చరికలు చేసే వ్యవస్థ చాలా రోజులుగా పనిచేయకుండా పోయిందన్న వార్తలు ప్రముఖంగా తెరమీదకు రావడంతో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ట్రంప్ పాలనాయంత్రాంగం బడ్జెట్‌లో కోతల వల్ల నేషనల్ వెదర్ సర్వీసెస్‌లో సిబ్బంది నియామకాలపై తీవ్ర ప్రభావం చూపించింది. చాలా రోజులుగా నేషనల్ వెదర్ సర్వీసెస్ విభాగం సిబ్బంది కొరతతో సమస్యల్లో ఉంది. సిబ్బంది లేకపోవడంవల్ల వదరద ప్రమాద సమాచారాన్ని నిద్రలో ఉన్న ప్రజలకు సకాలంలో తెలియజేసే అవకాశం లేకపోయింది. ఇది ట్రంప్ 'మాగా' ప్లాన్ దురాశ వైఫల్యాన్ని బయటపెడుతోందని భావిస్తున్నారు. మరోవైపు టెక్సాస్‌లో వరద మహా విలయం కొనసాగుతుండగా, గల్లంతైన ప్రజలకోసం భారీ ఎత్తున వందలాదిమంది భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గ్వాడలుపే నది ఒడ్డున ఏటా నిర్వహించే ప్రఖ్యాత మైస్టిక్ సమ్మర్ క్యాంప్‌లో 750మందికిపైగా 14 ఏళ్ళలోపు బాలికలు పాల్గొంటున్నారు. ఆసమయంలో తెల్లవారుజామున గడచిన వందేళ్ళలో ఎన్నడూలేనంత భారీ వర్షాలవల్ల 45 నిమిషాల వ్యవధిలోనే నది నీటిమట్టం ఎనిమిది మీటర్ల ఎత్తుకు (26 అడుగులు ఎత్తుకు) పెరిగిపోయి వరద బీభత్సం మొదలైంది. మరణించినవారిలో ఈస్ట్‌ల్యాండ్‌కు చెందిన క్యాంప్ డైరెక్టర్ రిచర్డ్ డిక్‌సహా అనేకమంది యువ క్యాంపర్లు మరణించినవారిలో ఉన్నారు. ఐతే సెక్యూరిటీగార్డ్ ఒకరు కీలకమైన పాత్ర పోషించి అనేక మంది బాలికల ప్రాణాలు కాపాడారు. ఇప్పుడు ఆయనపై ప్రశంసలు కురుస్తున్నాయి. అదేవిధంగా వాలంటీరు మాజీ నావికాదళ అధికారి గ్రెగ్ ఫ్రోయిలిక్ కూడా 300 మందితో కూడిన సహాయబృందానికి నాయకత్వం వహించి ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కానీ ఈ సమ్మర్ క్యాంప్‌లో ఇంకా ఇతరులు ఎంతమంది పాల్గొన్నారు? ఎంతమంది జాడ తెలియకుండాపోయారు? అనే పూర్తి వివరాలు తెలియడంలేదు.

## సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం



ప్రజాపక్షం/నల్లగొండ : పేదల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.క్యాంపు కార్యాలయంలో 39 మంది లబ్దిదారులకు సీఎం ఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన రూ.23.38లక్షల చెక్ లను మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలు అవుతున్నాయని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమన్నారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## యాదయ్య మృతి సిపిఐకి తీరని లోటు

ప్రజాపక్షం/మునుగోడు: సిపిఐ నాయకులు యాదయ్య మృతి పార్టీ తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,బొల్లూరి నరసింహ,తీర్నారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలివెల గ్రామానికి చెందిన వంతంగి యాదయ్య అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం యాదయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. నివాళులర్పించిన వారిలో మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, సురిగి చలపతి,మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,మాధగోని సాయిలు, మాధగోని సత్తమ్మ, ఎండి జానీ,ఉనగంటి నర్సింహ,గోస్కొండ కృష్ణయ్య, పరికుపల రాజు, మల్లేష్, మాధగోని మల్లయ్య ఉన్నారు.





## చోరీలకు పాల్పడిన ఇరువురి అరెస్ట్

నిందితుల నుండి గంజాయి స్వాధీనం

ప్రజాపక్షం/చిట్యాల : అక్రమంగా గంజాయిని విక్రయిస్తూ, తాళం వేసిన ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇరువురు యువకులను నల్లగొండ జిల్లా చిట్యాల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక సిఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దుండగుల శివకుమార్(23), తలారి మనోజ్ కుమార్(22) హైదరాబాద్ లో నివాసం ఉంటున్నారు. వీరు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బును సంపాదించాలన్న నెపంతో గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ, దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు. నార్కట్ పల్లి మండలం చెరువుగట్టులోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వీరు తరచుగా వస్తూ పరిసర మండలాల గ్రామాలపై అవగాహన పెంచుకున్నారు. స్థానికంగా అద్దెకు ఉంటున్న మండలంలోని వట్టిమర్తిలోని కెనరా బ్యాంక్ మేనేజర్ గుంటూరి చైతన్య ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిపై ఊరికి వెళ్ళగా దీనిని గమనించిన నిందితులు గత నెల 30న చోరీకి పాల్పడి ఒక లాప్ టాప్, 3 విలువైన చేతి గడియారాలు, సెల్ఫోన్లు తస్కరించారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు జంక్షన్ సమీపంలో వీరు గంజాయి అమ్ముటానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం అందటంతో ఎస్ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది వీరిద్దరిని అరెస్ట్ చేశారు. నిందితుల నుండి 1250 గ్రాముల గంజాయి, తస్కరించిన వస్తువులను, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## సాగునీటితో జిల్లా సస్యశ్యామలం

ర్యాలంపాడు రిజర్వాయర్ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: నడిగడ్డ ప్రాంతంలో కృష్ణ తుంగభద్రా రెండు జీవనదులు ప్రవహిస్తున్న దృష్ట్యా సాగు భూములకు నీటి వనరులను కల్పించి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ సహకారంతో పనిచేస్తానని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ నుండి కాలువలకు నీటిని విడుదల చేశారు. నెట్టెంపాడు ప్రాజెక్టు క్రింద ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ నుండి కాలువలకు నీటిని విడుదల చేసుకోవడం ద్వారా సుమారు ఒక లక్ష ఇరవై వేల ఎకరాలకు నీరు అందనుందని, ముందస్తు వర్షాలు రావడంతో రైతులంతా పొలం పనులలో నిమగ్నమయ్యారని ఎమ్మెల్యే అన్నారు. దేశం ఆర్థికంగా ఎదగాలంటే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండారి భాస్కర్, విజయ్‌కుమార్, సుదర్శన్ రెడ్డి, జంబు రామన్ గౌడ్, చిట్టెం పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులకు గురిచేస్తోందని జిల్లా అధికారిపై కలెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్ల ఫిర్యాదు



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సునంద వేధింపులకు గురి చేస్తుందంటూ జిల్లా కలెక్టర్ సంతోష్ కు ఎమ్మెల్యే బండ్ల క్రిష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ఫిర్యాదు చేశారు. మొదట సమస్యను గద్వాల ఎమ్మెల్యే బండ్ల క్రిష్ణమోహన్‌రెడ్డికి క్యాంపు కార్యాలయంలో వివరించగా ఎమ్మెల్యే అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ పీడీ సునంద కింద పనిచేసే ఉద్యోగులను అనవసర విషయాలతో దుర్భాషలాడుతుందని, ఆమె బాధ భరించలేకపోతున్నామని వాపోయారు. అంగన్ వాడి కేంద్రంలో చెప్పులు వేసుకున్నందుకు మందలిస్తూ అందుకు చెప్పుల దండ వేసుకోవాలని దురుసుగా మాట్లాడుతుందన్నారు. పనిచేసేది మేమైతే మా కుటుంబాన్ని మొత్తం కలిపి ఆమె తిరుతుందని అంగన్వాడి టీచర్లు ఆరోపించారు. ప్రతిసారి ఆమె వ్యవహారశైలి ఇలాగే ఉందని ఆమె బాధ భరించలేకే నేడు జిల్లా కలెక్టర్ సంతోష్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. విధుల పరంగా మా తప్పిదాలు ఎత్తిచూపితే సరి చేసుకుంటామని అనవసరంగా నోరు పారేసుకుని ఇష్టానుసారంగా మాట్లాడుతుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

## సమాజంలో తల్లి ప్రేమను మించింది లేదు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : సమాజంలో తల్లి ప్రేమను మించింది లేదని, అమ్మలాంటి మహిళలకు అండగా ఉంటానని మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మదర్ ఎడ్యుకేషన్ , రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితకుట్టు శిక్షణ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం రాజగోపాల్ రెడ్డీ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 67 శాతం మంది మహిళలు శిక్షణ పొందేలా తోడ్పాటును అందించిన సంధ్య రెడ్డి సేవలు మర్చిపోకూడదన్నారు. రూ.25 లక్షలతో విద్యలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు బహుమతి ఇచ్చామని తెలిపారు. వలిగొండ రోడ్‌లో ఒక ఎకరం స్థలాన్ని ప్రభుత్వం తరపున కేటాయించి స్కిల్ డోవలప్మెంట్ కోసం అవసరమైతే రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసి భవనం కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మునుగోడు నియోజకవర్గం సమన్వయ కర్త పబ్బు రాజు గౌడ్, మాజీ జేడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ఉప్పు భద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు పాల్గొన్నారు.



# 10 గంటల పని పెంపు సరికాదు

వెంటనే రద్దు చేయాలి
ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి
ఎండి ఇమ్రాన్ డిమాండ్

ప్రజాపక్షం/వలిగొండ : కార్మికుల శ్రమను దోచుకోవడానికి 8 గంటలు ఉన్న పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ తీసుకువచ్చిన జీవో నంబర్ 282ను వెంటనే రద్దు చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ తెలిపారు. సోమవారం వలిగొండ మండల కేంద్రంలో జరిగిన ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం సల్వద్రి రవీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, లేబర్ కోడ్ అమలులో భాగంగా జిఓ నెంబర్ 282 ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనివిధానం రద్దు చేసి 10 గంటల పని విధానం అమలు చేయాలని విడుదల చేసిన జిఓ నెంబర్ 282ను వెంటనే రద్దు చేయాలని అయన డిమాండ్ చేశారు. 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు పా ల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల బాధ్యులు పోలేపాక యా దయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఎఐటియుసి మండల బాధ్యులు సల్వాద్రి రవీందర్, ఆటో యూనియన్ అధ్యక్షులు కనకబోయిన ఆంజనేయులు, సిపిఐ నాయకులు బోడిగే సుదర్శన్, కూరెళ్ల దేవేందర్ పాల్గొన్నారు.



### కార్మికులకు పదిగంటల పని విధానం జిఓను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/కోదాడ: కార్మికులకు పదిగంటల పని విధానం జీవోను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం బాలాజీనగర్ హౌజ్ గోదాం మేనేజర్‌కు 9న జరిగే సార్వత్రిక సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల తహరలోనే హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదబీమాను పది లక్షల వరకు ఏర్పాటు చేయాలని, వారి పిల్లల చదువులకు స్కాలర్‌షిఫ్ ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు నడుపుతున్నాయని వాటిని నియంత్రించాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని అన్నా రు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు భూక్య పాపానాయక్, బి.సైదా, శ్రీనివాస్, రమేష్, సైదులు, వెంకన్న, రాజారం పాల్గొన్నారు.

### ఎస్‌కెఎం సంపూర్ణ మద్దతు : వెంకటయ్య

ప్రజాపక్షం/కోదాడ: దేశవ్యాప్తంగా మోదీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కెఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఎస్‌కెయం జిల్లా కన్వీనర్ దొడ్డా వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం లాల్ బంగ్లాలో జరిగిన సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాల నాయకులు ముల్కలపల్లి రాములు, పోటు లక్ష్మయ్య, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రెమిడాలరాజు, ఎం.ముత్యాలు, ఉదయగిరి, వీరబాబు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/చండూరు: జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్ని రంగాల కార్మికులకు ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ ముద్రించిన వాల్ పోస్టర్లను సోమవారం చండూరులో కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దోటి వెంకన్న మాట్లడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జూలై 9న సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్మికులు కుక్కల నాగార్జున , కావలి శ్రీను, గంట కంపు ధర్మ , నీలకంఠం నాగరాజు , కావలి కుమార్ , కల్లెట్ల నర్సింహ్మా, బొడ్డు రమేష్ , కావలి గోపి, శంకర్ , కావలి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/చింతపల్లి : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఈ నెల తొమ్మిదవ తేదీన తల పెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాగారు. సిపిఐ మండల నాయకులు వేముల బుచ్చయ్య, అయితపాక సైదులు, మిడిదొడ్డి, రామకృష్ణ, గనిపల్లి జితేందర్, పోలే చెన్నయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.







## సిఎం పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: నూతన రేషన్‌కార్డులు ప్రారంభించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 14న తిరుమలగిరికి వస్తున్న సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకి సంబంధించి అధికారులకు కేటాయించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణంగా పరిశీలించి వేగవంతంగా అర్జీదారులకు సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో దరఖాస్తులలో భూ సమస్యలపై 47, ఎంపిడివో లకు 13, డిపివో10, ఇతర శాఖలకు సంబంధించి 25 మొత్తం 95 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశంలో డిఆర్‌డిఏ పిడి వివి అప్పారావు, డిపివో యాదగిరి, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిఈవో అశోక్, సిపివో కిషన్, సంక్షేమ అధికారులు దయానందరాణి, శంకర్, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులు

చోద్యం చూస్తున్న అధికారులు
సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు యూరియా, ఎరువుల కొరత రాకుండా ముందస్తుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం హుజూర్ నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాపారస్తులు ఇప్పటికే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారన్నారు. వానా కాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక ముందు ఎలా ఉంటుందోనని భయంగా ఉందన్నారు. కోదాడ వంటి పట్టణాల్లో వ్యాపారస్తులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని యూరియాను విక్రయించబోమని తీర్మానాలు చేసుకొని పత్రికా ప్రకటనలు ఇవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణలోకి తీసుకొని రాబోయే రోజుల్లో రైతులకు యూరియా కొరత రాకుండా, అధిక ధరలకు విక్రయాలు జరపకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు,మహిళా సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి దేవరం మల్లీశ్వరీ,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రమేష్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్,దొంతగాని సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట ఎప్పుడో?

మీసేవలో బుక్ చేసుకున్నా అన్‌లోడ్ టైంలో వసూళ్లు...500 నుండి 1000 ఇస్తేనే అన్‌లోడ్
ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ట్రాక్టర్ల యాజమాన్యం...
అన్ని తెలిసి ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో ఇసుకాసురులు ప్రజలను ముక్కపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. దేవరకొండ మండలంలోని ఆయా ఇసుక క్వారీల నుండి ఇసుక కోసం మీ సేవలో ఇసుక బుక్ చేసిన ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల నుండి ప్రజలు మీ సేవ ద్వారా ఇసుకను నిర్ణయించిన ధర మేరకు కిలో మీటర్ వ్యవధిలో ప్రజలు చెల్లిస్తున్నప్పటికి సంబంధిత ట్రాక్టర్ల యాజమాన్యం కుమ్మకై ప్రభుత్వం బుకింగ్‌పై వారికి డబ్బులు ఇస్తున్నప్పటికి నడిపినోడికి నడిపినంత అన్న చందంగా అధికారులతో నిబంధనలతో మాకేం పని మాపని మేము చేసుకుంటామని ట్రాక్టర్ల యాజమాన్యం ప్రజలు తమకు ఇసుక కోసం బుకింగ్ చేసిన వెంటనే ఓటిపి చెప్పమని సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్లు ఓటిపి అడిగి ఇసుకను తీసుకువచ్చాక 500 నుండి 1000 రూపాయలు ఇస్తేనే అన్‌లోడ్ చేస్తామని చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లో చలాన్ ద్వారా డబ్బులు కట్టామని మరళ డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే సంబంధిత ట్రాక్టర్ల యాజమాన్యం బుకింగ్ క్యాన్సల్ చేస్తామని, డబ్బులిస్తేనే అన్‌లోడ్ చేస్తామని ప్రజలకు నొక్కిచెప్పడంతో గత్యంతరం లేక ఇసుక అన్‌లోడ్ సమయంలో ట్రాక్టర్ యాజమాన్యం అడినంత ఇవ్వాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారుల మాత్రం అన్ని తెలిసిన తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరు సమంజసం కాదని, తక్షణమే మైనింగ్ అధికారుల ఇసుకాసురుల అఘడాల నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు. ఇక గ్రామాల్లో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్కడక్కడ గుట్టుచప్పుడు కాకుండా ఒక ట్రిప్పు ఇసుకకు 6000ఇందిరమ్మ ఇండ్లకు సప్లై చేసి లబ్దిదారులను దోచుకుంటున్నారన్నా రు.

**చర్యలు తీసుకోవాలి....సిపిఐ**

మీసేవ నుండి ఇసుక బుక్ చేసుకొని చలాన్ పొందిన ట్రాక్టర్ల యాజమాన్యం కుమ్మకై ఆన్ లోడ్ టైంలో ప్రజల నుండి డబ్బులు వసూలు చేయడాన్ని తక్షణమే అధికారులు స్పందించి అక్రమ వసూళ్లను అపాలని సిపిఐ దేవరకొండ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధికారులను కోరారు.

**న్యాయం చేయాలి...**ప్రజల నుండి అక్రమంగా ఆన్‌లోడ్ టైంలో వసూలు చేస్తున్న అక్రమ వసూళ్లను ఆపేందుకు సంబంధిత మైనింగ్ అధికారులు ట్రాక్టర్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబురాంనాయక్ అధికారులను కోరారు.

## ఫిర్యాదులను ప్రత్యక్షంగా పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తాను మార్క్ చేసిన ఫిర్యాదులను తిరిగి కింది స్థాయికి మార్క్ చేయకుండా ప్రత్యక్షంగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు.జిల్లా స్థాయిలో వచ్చిన ఫిర్యాదులు జిల్లా అధికారులతో పాటు, మండల స్థాయి అధికారులకు మార్క్ చేయడం జరుగుతున్నదని అయితే అలా వచ్చిన వాటిని అధికారులు వారి స్థాయిలోనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా తిరిగి కింది స్థాయికి పంపించవద్దని, ఒకవేళ సమస్యను పరిష్కరించడంలో ఏమైనా ఇబ్బంది ఉంటే పిర్యాదుదారుకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు.రేషన్ కార్డుల దరఖాస్తులను పౌరసరఫరాల అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని, రేషన్ కార్డుకు చేసుకున్న దరఖాస్తు తిరస్కరణకు గురైతే స్పష్టంగా తెలియజేయాలని అన్నారు.మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు వారి పరిధిలోని కేజీబీవీలను సందర్శించాలని, కేజీబీవీలలో తక్షణ పనుల నిమిత్తం 20వేలు రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అయితే సంబంధిత కేజీబీవిల ప్రత్యేక అధికారులు వారికి నచ్చిన పనులు కాకుండా, అవసరమైన వాటిని ప్రతిపాదించాలని సూచించారు. చాలా కేజీబీవీలలో కోతుల బెడద కారణంగా పెన్సింగ్ అవసరం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సిమెంట్ పెన్సింగ్‌కు ఎక్కువ ఖర్చు అయ్యే అవకాశం ఉన్నందున, ఇతర ఫన్సింగ్ ప్రతిపాదించాలని చెప్పారు.కాగా ఈ సోమవారం మొత్తం (70) ఫిర్యాదులు రాగా, రెవిన్యూ శాఖకు (47),జిల్లా అధికారులకు (23) వచ్చాయి. అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి ,గృహ నిర్మాణ పీడీ రాజకుమార్, ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి ,జిల్లా అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు.



## అలసత్వం వహించొద్దు : కలెక్టర్

ప్రజాపక్షం/మోటకొండూర్ : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అలసత్వం వహించొద్దని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆయన సోమవారం మోటకొండూర్ మండలంలోని కదిరేనిగూడెంలో ఆకస్మికంగా తనిఖీ చేసి ఇండ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ ఇందిర, తహసీల్దార్ నాగదివ్య, హౌసింగ్ పిడి, ఎఇ, పంచాయతి కార్యదర్శి శ్రీకాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## పంట కాలువలో గంజాయి ప్యాకెట్లు

ప్రజాపక్షం/దమ్మపేట : అశ్వారావుపేట మండలాల సరిహద్దు గ్రామం అచ్యుతాపురం గ్రామ శివారులోని ఓ పంట కాలువలో సుమారు 44 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అశ్వారావుపేట మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన రైతు గుద్దుల వెంకటేశ్వర్లు తన పొలంలో కుమారునితో కలిసి పనిచేస్తుండగా తన పంట కాలువలో గంజాయి ప్యాకెట్లు పెట్టి దానిపై పామాయిల్ మట్టలు కప్పి ఉంచడాన్ని గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించడంతో అక్కడ చేరుకున్న దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. మొత్తం 44 ప్యాకెట్లలో మొత్తం 90 కేజీల వరకు గంజాయి ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.



## బుడగం మంజులాదేవికి డాక్టరేట్

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం బిడ్డం బుడం మంజులా దేవికి డాక్టరేట్ దక్కింది. ఆంగ్లవిభాగంలో ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ఈ అరుదైన గౌరవం వరంగల్ కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో మంజులకు దక్కింది. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో పుట్టి పెరిగి డాక్టరేట్ దక్కించుకోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడైన బుడగం శ్రీనివాస్ తన భార్య మంజులకు ఇటీవల సాహితి అకాడమి అవార్డు, విన్నింగ్ నోవెల్స్ ఎతిమెటిక్ స్టడీ అఫ్ సెలక్ట్ ఇంగ్లీష్ నోవెల్స్ అనే అంశంపై లోతైన పరిశోధన పూర్తి చేసిన ఆమె థీసీస్ సమర్పించారు. ఆంగ్ల విభాగంలో పరిశోధకులుగా గుర్తింపు పొందిన ఆమెను కాకతీయ విశ్వవిద్యాయం గౌరవించి డాక్టరేట్‌తో సత్కరించింది.





## ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించండి

### కలెక్టర్‌కు పింఛన్‌దారుల వినతి

ప్రజాపక్షం/ఖమ్మం : ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ పొంది నెలలు గడిచినా బకాయిల చెల్లింపులు జరగలేదని తక్షణం బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పింఛన్‌దారులు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సామూహిక వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకున్న పింఛన్‌దారులు ఉద్యోగ విరమణ అనంతరం తమకు రావాల్సిన గ్రాట్యూటీ, జిపిఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, టిఎస్‌జిఎల్‌ఐ తదతర మొత్తాలను చెల్లించడం లేదని వారు వినతిపత్రంలో తెలిపారు. అవి రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఇదే వేదనతో ఉద్యోగ విరమణ చేసిన కొందరు తనువు చాలించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఉద్యోగ విరమణ పొందిన వారి బకాయిలను చెల్లించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, సంఘ బాధ్యులు ఐవి భాస్కరాచారి, పి. వీరభద్రరావు, వి.మేరీ ఏసుపాదం, జి. లక్ష్మి సుజాత, ఎండి మహబూబ్ అలీఖాన్, ఎస్‌కె మహ్మద్ హుస్సేన్, కె. నాగప్రసాద్, జి.కృష్ణారావు, తాడి అంజలి, కె.అన్నమ్మ, ఎం.నారాయణ, పివిఆర్‌కెవి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యపాన విక్రయాల్ని నిలిపివేయాలి

ప్రజాపక్షం/అశ్వాపురం : అశ్వాపురం మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల చుట్టుపక్కల ఉన్న కిరాణా షాపులలో మద్యాన్ని విక్రయం చేస్తున్న కిరాణా షాపులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎఐఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు అక్కినపల్లి నాగేంద్రబాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్‌సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల చుట్టుపక్కల మద్యాన్ని, సిగిరెట్, పాన్ సరకులు అమ్ముతున్నారని, విద్యార్థులు ఆకర్షితులై చదువులకు దూరంఅయ్యే పరిస్థితి ఉందని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇసంపల్లి ప్రసాద్, అజయ్, ప్రశాంత్, కళ్యాణ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## కూతురిని హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ప్రజాపక్షం/బోనకల్ : వివాహేతర సంబంధంతో కూతురిని హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ సత్తుపల్లి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు. ఖమ్మంజిల్లా బోనకల్ గ్రామానికి చెందిన పాలెపు సునీత తన మామ అయిన పాలెపు నర్సింహారావుతో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో 2022 ఫిబ్రవరి 8న ట్రాలీ డ్రైవర్ అయిన భర్త హరికృష్ణ బయటకు వెళ్లిన సమయంలో వీరిద్దరు కలిసి ఉండగా సునీత పెద్ద కుమార్తె చూసిందని, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో మెడకు వైరు వేసి లాగారు. అనంతరం భర్తకు ఫోన్ చేసి పెద్ద కుమార్తె ఆరోగ్యం బాగా లేదని చెప్పి 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు ధృవీకరించడంతో పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆసుపత్రికి వచ్చిన తండ్రి హరికృష్ణ కుమార్తె మెడపై నల్లగా కమిలినట్లుగా ఉండడంతో బోనకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాలెపు సునీత, నర్సింహారావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితులపై మోపిన నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు ప్రాసిక్యూటర్ మహ్మద్ ఎస్‌కె.అబ్దుల్ పాషా వాదించారు. విచారణ అధికారులు సిఐ మురళి, ఎస్ఐ కవిత, కోర్టు కానిస్టేబుల్ అరవింద్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీకాంత్‌లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.




## సమాజాన్ని ఆలోచింపజేసేదే సాహిత్యం

### ఒకే వేదికపై మూడు పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాపక్షం/ఖమ్మం : సమాజాన్ని ఆలోచింపజేసేదే సాహిత్యమని, ఆ దిశగా విస్తృత స్థాయిలో సాహిత్యం వెలువడాల్సి ఉందని పలువురు కవులు, వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ కవి ఏనుగు కిషోర్‌బాబు రచించిన అడ్డుగోడలు కథా సంకలనం, నడుస్తున్న చరిత్ర అనే కవితా సంకలనం, కిషోర శతకం అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ సోమవారం స్థానిక జెడ్పి మీటింగ్ హాల్‌లో జరిగింది. నడుస్తున్న చరిత్రను మాజీ శాసన సభ్యుడు కొండబాల కోటేశ్వరరావు ఆవిష్కరించగా, అడ్డుగోడలు పుస్తకాన్ని ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు ప్రసేన్ ఆవిష్కరించారు. కిషోర శతకం పుస్తకాన్ని ప్రముఖ కవి, విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసేన్ అధ్యక్షతన జరిగిన సభలో కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజాన్ని ఆలోచింపజేసేదే సరైన సాహిత్యమని అటువంటి సాహిత్యం రావాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా ఉందన్నారు. కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం కిషోర్ పుస్తకాల్లో కనిపించిందని సామాన్య వ్యవహారాల దగ్గర నుంచి పార్లమెంటు జరుగుతున్న తీరు వరకు నిర్భయంగా వాస్తవాన్ని వెల్లడించారన్నారు. తొలి పుస్తకాన్ని కిషోర్‌బాబు మాతృమూర్తి ఝాన్సీకి అందించగా, పుస్తక పరిచయాన్ని జనార్ధనసూరి నిర్వర్తించారు. ఈ సభలో కెసిపి సిమెంట్ మేనేజర్ వజ్జా మధుసూదన్, తల్లాడ ఎంపిడివో ఏనుగు సురేష్‌బాబు, పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/అశ్వాపురం : మండల కేంద్రంలోని జగజీవన్‌రామ్(ఎస్సీ) కాలనీలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు ఇసంపల్లి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మాదిగ అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా ఎబిసిడి వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అనేక పోరాటాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మిరియాల వెంకటేశ్వర్లు, సుంచు రామ్మూర్తి, గద్దల వెంకటేశ్వర్లు, గద్దల రామకృష్ణ, ఈనపెల్లి సాయి, శెట్టిపల్లి శేఖర్, ఇసంపల్లి సురేష్, శెట్టిపల్లి భాస్కర్, వల్లెపోగు సాంబ, మురికిపూడి వెంకటేశ్వర్లు, గొల్లపల్లి సురేష్, వెంకన్న, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం కల్పించాలి

### దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి






ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, మండల స్థాయిలో అధిక సమస్యల పరిష్కారం కావాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 జనవరి నుండి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న 185 ప్రజావాణి దరఖాస్తులను ఏడు రోజుల్లో పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలన్నారు. జిల్లా అధికారులు ప్రతివారం మండల అధికారులతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం మండల స్థాయిలో సమర్థవంతంగా చేపట్టాలని ప్రజా సమస్యలు చాలా వరకు మండలంలోనే పరిష్కారం కావాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. సామూహిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న గ్యాప్స్ గుర్తించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ అందించాలన్నారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల, వినోబా కాలనీవాసులు సర్వే నెం.147, 148, 149లో భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ 2000 కుటుంబాలకు 100 గజాల చొప్పున ఇచ్చిన ప్రొసీడింగ్ సాధారణంగా 11 ఏళ్లుగా ఇండ్లు నిర్మించుకుని ఉంటున్నామని తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిందని, కానీ ఇంతవరకు ఏర్పాటు చేయలేదని, తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామానికి చెందిన పర్వత నాగమణి తన కుమారుడు ఆరవ తరగతి చదువుతున్నాడని నాయకన్‌గూడెం గురుకులంలో సీటు ఇప్పించాలని దరఖాస్తు చేశాడు. కొణిజర్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన చల్లా తిరుపతమ్మ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు.

ఖమ్మం నగరానికి చెందిన మల్లేశ్వరి తాను పిజి డిప్లొమా కంప్యూటర్ చేశానని ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశానని తనకు ఉపాధి చూపించాలని దరఖాస్తు చేశారు. వైరా మండలం గండగలపాడు గ్రామ ప్రజలు జాతీయ రహదారి వల్ల భూములు కోల్పోయిన రైతులకు మిగిలిన భూములకు వెళ్లేందుకు మార్గం లేదని సర్వీస్ రోడ్డు, పంట కాలువలు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం రైల్వే కాలనీవాసులు నూతన పంచాయతీ కార్యాలయం భవనం రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మించాలని ప్రైవేటు స్థలం సేకరించవద్దని కోరుతూ దరఖాస్తు చేశారు.

సంబంధిత దరఖాస్తులను పరిష్కరించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించాలి

తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తెలంగాన ఓపెన్ స్కూల్ సొసైటీ రూపొందించిన సమగ్ర సమాచార సంపుటిక (బుక్ లెట్)ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో నిలిపివేసిన వారికి మరో అవకాశం కల్పిస్తూ పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేసేలా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పనిచేస్తుందన్నారు. 14 ఏళ్ల వయస్సు నిండిన వారికి ఓపెన్ స్కూల్ పదవ తరగతి, 15 ఏళ్ల నిండిన వారికి ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ లభిస్తుందన్నారు. ఓపెన్ స్కూల్ నందు తరగతులు సెలవు దినాల్లో ఉంటాయని, రెగ్యులర్‌గా బయట పనులు చేసుకుంటూ చదువుకోవచ్చునని తెలిపారు. పదవ తరగతి ఫీజు రూ.1500, ఇంటర్‌కు రూ.1800 ఉంటుందని తెలిపారు. పాఠ్యపుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి అనిల్, సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు

### నగరాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళనలు

### సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### సిపిఐ నగర సమితి సమావేశంలో కార్యదర్శి ఎస్‌కె.జానిమియా




ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం నగర అభివృద్ధికి నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు నిర్వహించనున్నట్లు సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా తెలిపారు. నూతనంగా ఎన్నికైన సిపిఐ నగర సమితి కార్యదర్శి వర్గ సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా మాట్లాడుతూ ఖమ్మం నగరం శరవేగంగా విస్తరించినందున ట్రాఫిక్ సమస్యతోపాటు మౌలిక వసతుల కల్పన ఇబ్బందికరంగా మారిందన్నారు. నగరంలో వైరా రోడ్డులో ఫ్లైఓవర్ నిర్మించి ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మున్నేటి వరదలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్స్‌కు సంబంధించి సాంకేతికంగా ఆలోచన చేయకపోతే మరో రూపంలో ముంపు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. నగరం తూర్పు నుంచి పడమటికి సగ భాగం వాలి ఉన్నందున మున్నేటికి వర్షపు నీరు చేరుతుందని ఈ వరద యధేచ్ఛగా మున్నేటిలో చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వేల సంఖ్యలో పేదలు నగరానికి చేరుకున్నారని వారికి నివాస స్థలాల సమస్యకు పరిష్కారం చూపాలని జానిమియా డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో నగరంలో పేదలకు ప్రభుత్వ భూముల్లో నివాస స్థలాలు కల్పించాలని దశల వారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని అందుకు గాను మరో ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు నిరసనగా ఈనెల తొమ్మిదిన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జానిమియా కోరారు. ఈ సమావేశంలో పోటు కళావతి, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, శశిధర్, ఏనుగు గాంధీ, నాన బాల రామకృష్ణ, వరదా నర్సింహారావు, పీట్ల కృష్ణమూర్తి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాపక్షం/మధిర : రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేసిందని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అన్నారు. సోమవారం మధిర మార్కెట్ యార్డ్ నందు మిర్చి కొనగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోళ్లలో జెండా పాటగా కాలసాని లక్ష్మీ పతి అనే రైతు పండించిన 118 బస్తాల తేజ రకం మిర్చి రూ.13,200 లతో కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో మధిర మార్కెట్ రెగ్యులర్ మార్కెట్‌గా చేస్తామన్నారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

### డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల శంకుస్థాపనలో తుమ్మల



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రజా సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార,చేనేత,జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అంబేద్కర్ సెంటర్ నుండి చర్ల రోడ్ వరకు రూ.1కోటి 15లక్షల వ్యయంతో నిర్మించనున్న డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల బాగోగుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీరాముడు నడయాడిన పుణ్యభూమి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భద్రాచలాన్ని సుందరభద్రాద్రిగా తీర్చిదిద్ది రామభక్తులు మెచ్చుకునే విధంగా ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. అనంతరం రామాలయ మాడవీధుల పనుల్లో భాగంగా జరుగుతున్న తొలగింపులను మంత్రి పరిశీలించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగిపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ డా.తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఎ ప్రాజెక్టు రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, ఆర్‌డిఒ దామోదర్‌రావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, బి.వెంకటరెడ్డి, అరికెళ్ల తిరుపతి రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను సందర్శించిన మంత్రి తుమ్మల**

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని బిజీ కొత్తూరు నందు మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను సందర్శించి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను వివరాలు అడిగి తెలుసుకుని, పనులు ఆలస్యమైన రీత్యా సిఎంఒకి ఫోన్‌లో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి తుమ్మలను కలిశారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు, మండల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలు, కష్ట జీవులు, కార్మికుల పార్టీ సిపిఐ

### ప్రజాబలంతోనే వందేళ్లు మనగలిగాం

### సిపిఐ నేత ముత్యాల విశ్వనాథం




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఈనెల 12న జరిగే సిపిఐ పాల్వంచ పట్టణ 19వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. సోమవారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని అన్నారు. సుదీర్ఘ త్యాగాలు, పోరాటాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లయినా చెక్కు చెదరకుండా అజేయంగా ఉంటుందన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో ఒకవర్గానికో చెందింది కాదని, ప్రజలకు సేవలందించేందుకు పురుడుపోసుకున్న పార్టీలో ప్రతినిధులుగా పనిచేయడం అదృష్టం అన్నారు. మహాసభకు పట్టణ పరిధిలోని ప్రతీ వార్డు నుండి కార్యకర్తలు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, జిల్లా సమితి సభ్యులు నాగేశ్వరరావు, పద్మజ, సుధాకర్, విశ్వేశ్వరరావు, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సునీల్, ఉపేంద్రచారి, వెంకన్న, జకరయ్య, రెహమాన్, లక్ష్మి, పద్మ, రాకేష్, గిరి, రమేష్, వెంకట్రామయ్య, రవిపాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేస్తాం

### ప్రైవేట్ కాంట్రాక్టర్ బేతం రాముపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

### విలేకరుల సమావేశంలో ఎడి ఉమారావు



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/అశ్వాపురం : బాధితులు ఎవరైనా ఉంటే న్యాయం చేయడమే మా శాఖ పరమైన ఉద్దేశ్యమని, వినియోగదారులను మోసం చేసి వారి దగ్గర డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తామని మణుగూరు ఇన్‌చార్జి ఎడి ఉమారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశ్వాపురం మండలంలో గత రెండు రోజులుగా ప్రజాపక్షం దినపత్రికలో విద్యుత్ శాఖపై వస్తున్న కథనాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగిందని అన్నారు. బాధితుల దగ్గర డబ్బులు వసూలు చేసిన వ్యక్తి మా శాఖ విచారణలో బేతం రాము అని నిర్ధారణ అయ్యిందన్నారు. మాకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, మాకు వచ్చిన సమాచారం మేరకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసు నమోదు చేసి బాధితుల దగ్గర ఎంత డబ్బులు వసూలు చేశారనేది స్పష్టంగా ఆధారాలతో సహా సేకరిస్తామని, మా శాఖ తరపున వారికి న్యాయం చేస్తామన్నారు. అదే విధంగా ప్రస్తుతం డివిజన్ మొత్తంలో ఆయన పేరు మీద ఉన్న కాంట్రాక్ట్‌లను రద్దు చేస్తున్నామని, ఇక మీదట ఈ శాఖలో వారి కుటుంబ సభ్యులు మీద కూడా ఎవరి మీద కాంట్రాక్ట్ ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. మండల విద్యుత్ శాఖలో కార్యాలయంలోని అధికారులకు ఎవరైనా ఫోన్ ద్వారా ఏడి 87124486074, ఏఈ 8712486068, ఫోర్ మెన్ 8712486087, ఎల్ఐ 8712486088 నంబర్లను సంప్రదించాలని, లేదా ఒక తెల్లకాగితంపై లిఖితపూర్వకంగా ఆధారాలు మాకు ఇస్తే మీ గృహాలకు వచ్చి విచారణ జరిపి విచారణలో నిర్ధారణ జరిగితే శాఖపరంగా అతనిపై కఠిన మైన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసు నమోదు చేసి శాఖపరంగా బాధితులకు న్యాయం చేస్తామని ప్రజలకు తెలిపారు.

## ప్రజల జీవనప్రమాణాల మార్పు ఎర్రజెండాతోనే




ప్రజాపక్షం/మధిర : దోపిడీ, అణిచివేతకు గురవుతున్న పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మార్పునకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండానేనని సిపిఐ మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవిబాబు, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అన్నారు. సిపిఐ మహాసభల్లో భాగంగా మండల పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ మధిర మండల కార్యదర్శిగా మడుపల్లికి చెందిన ఊట్ల కొండలరావును, పట్టణ కార్యదర్శిగా బెజవాడ రవిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 17మంది మండల కార్యవర్గ సభ్యులు, 35మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బెజవాడ రవిబాబు, ఊట్ల కొండలరావు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని తెలిపారు. అన్యాయం, దోపిడీ, అణిచివేతలున్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. పేదల పక్షాన నిలబడి అనేక భూపోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించి వేలాది ఎకరాలను పేదలకు పంచి బతుకు దారి చూపిందని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేసిందని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగానే గ్రామీణ, పట్టణ ప్రజలు కమ్యూనిస్టు పార్టీకి బలమయ్యారన్నారు. జూలై 19, 20 తేదీల్లో సిపిఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభ మధిరలో జరుగుతుందని, ఈ మహాసభల కరపత్రాలు ప్రజలకు పంచి ఆర్థిక సహాయ సహకారాలు తీసుకుని ప్రజలను భాగస్వాములను చేసి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ట్రిపుల్ ఐటికి విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీకి విజ్డమ్ హై స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎం అన్వేష్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 571 మార్కులు సాధించడమే గాక, ఎన్సీసీలో ఉత్తమ క్యాడెట్ అవార్డు, జోనల్‌స్థాయి క్రీడల్లో రాణించడం విశేషం. అన్వేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఐపిఎస్ అధికారి కావడం తన లక్ష్యమని, తన లక్ష్యసాధనకు నిరంతరం పాటుపడతానన్నారు. విద్యార్థులు బాల్య దశ నుండే క్రమశిక్షణ కలిగి, ఏ రోజు పాఠ్యాంశాలను ఆరోజే పూర్తి చేసి, ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ గమ్య సాధనకు నిరంత రం శ్రమించాలని పాఠశాల డైరెక్టర్ జావేద్ గారు తెలిపారు. ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థి అన్వేష్ ను పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, అకాడమిక్ ఇంచార్జి నాజియా ఇక్బాల్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, వీరభద్రయ్య, రఘుపతి రెడ్డి, రవీందర్, శివరాజ్, రాము, ఇలియాస్, కుమారస్వామి, సుమన్, రియాజ్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులుఅభినందించారు.

## 9న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

బికేయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేకవిధానాలను నిరసిస్తూ జులై 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటి పాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లుగా పాలన చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వంకార్మికకర్షక ప్రజానష్టాన్నే విస్మరించి కార్పొరేట్,పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తూపోరాటాల ద్వారా సాధించు కున్న హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. డిమాండ్స్ సాధనకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐసిటియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నర్రా ప్రతాప్ ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి బషీర్ ఆరూరి కుమార్ ఎఐసిసిటియు రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి యాదగిరిలు అన్నారు. సోమవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ గ్రెయిన్ మార్కెట్ సెంటర్ నుండి మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. మార్కెట్ నుండి ప్రారంభమైన ర్యాలీకాశిబుగ్గ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఎఐసిటియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నర్రా ప్రతాప్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి బషీర్, ఆరూరి కుమార్, ఎఐసిసిటియు రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి యాదగిరి, ఎఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఎఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు బైరబోయిన ఐలయ్య, ఐఎఫ్టియు జిల్లా నాయకులు బండి కుమార్, టియుసిఐ నాయకులు కృష్ణారావు, ఏఐయుకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ: కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అడ్మిషన్ల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 202627 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు.చివరి 2025 జూలై 29, వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేయు విద్యార్థులు https://navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన సూచించారు. పరీక్ష నిర్వహణ 2025 డిసెంబర్ 13 ఉంటుందని తెలిపారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ విద్యా బోధన కలిగిన నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 9110782213, 7993263431 హెల్ప్ లైన్ నంబర్ల కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జవహర్ నవోదయ కళాశాల ప్రిన్సిపాల్ పూర్ణిమ, డీఈఓ రాజేందర్, నవోదయ కళాశామాథ్స్ ఉపాధ్యాయులు సురేష్, లైబ్రేరియన్ లక్ష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి,ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు పాల్గొని ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొత్తం 78 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 37, కలెక్టరేట్ కు 6, జిల్లా పంచాయతీ శాఖకు సంబంధించిన 6 దరఖాస్తులు, మిగతా శాఖలకు సంబందించిన దరఖాస్తులు 29స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. **డిఇఇటి గోడ పత్రి ఆవిష్కరణ:** జిఎం ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేయింజ్ తెలంగాణ (డిఈఈటి) గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో ఉద్యోగలు పొందడానికి వీలుగా ఉచిత నమోదు చేసుకోవాలని నమోదుకై గోడ పత్రికలో సూచించిన స్కానర్ తో మొబైల్ ద్వారా స్కాన్ చేసి బయోడేటా నమోదు చేసినట్లయితే ప్రవేటు ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిబిసిడివో పుష్పలత, కలెక్టరేట్ పరిపాలన అధికా రి విశ్వప్రసాద్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, సంబంధిత శాఖల అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

## రైలు ఢీకొని 29 గొర్రెల మృతి



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్ద కురుపులకు చెందిన ఆలకుం ట శ్రీనివాస్ కుమారుడు సాయికిరణ్ ఇటీవల శ్రీను కొనుగోలు చేసిన గొర్రెలను మేపడానికి అలంకానిపేట పెద్దకొర్పులు గ్రామాల మధ్య ఉన్న రైల్వే ట్రాక్ వెంబడి గొర్రెల మేపుతున్న క్రమంలో ఊర కుక్కలు గొర్రెలను బెదిరించడంతో ఆ గొర్రెలు ఒక్కసారిగా 74 గేటు ట్రాక్ పైకి వెళ్లాయి అదే సమయంలో ఏ దురుగ కేసముద్రం నుండి నెక్కొండ వైపు కు వస్తున్న గూడ్స్ రైలు ఢీకొని 29గొర్రెలు మృత్యువాత పడ్డా యి. దీంతో ఆలకుంట శ్రీను కుటుంబం శోకసముద్రంలో మిగిలిపోయింది. శ్రీను సాయికుమార్ కుటుంబం చాలా నిరుపేదలు నూతన గృహాలకు పిల్లర్ గొతులు తీస్తూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు అయితే శ్రీను కుమారుడు సాయికిరణ్ ఇలా ఎన్ని రోజులు కష్టపడి పని చేయాలి అనుకుని గత వారం రోజుల క్రితమే కొంత అప్పుచేసి గొర్రెలను కొనుగోలు చేశాడు. వాటి ద్వారా తన జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు ఇక్రమంలో ఇ లాంటి సంఘటన ఆ కుటుంబాన్ని ఆర్థికంగా చాలా కుంగదీసింది. గొర్రెల వి లువ సుమారు నాలుగు నుండి ఐదు లక్షల రూపాయలు ఉంటుందని మృతి చెందిన గొర్రెలలో ఎక్కువ శాతం చూడి గొర్రెలు ఉన్నాయని వాటి కడుపులో నుండి పిల్లలు బయటపడి చూపులను బాధ కలిగించేలా హృదయ విదారకం గా గొర్రెల మృతి దృశ్యం కనిపిస్తున్నది. ఆలకుంట సురేందర్ కుటుంబాన్ని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.

# టిబి నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళికతో చర్యలు

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** క్షయ (టిబి) వ్యాధి నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళికతో కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాలలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిబి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల తీరుతెన్నులపై రెండు జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గవర్నర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ టిబి వ్యాధి నిర్మూలనకు ఇరు జిల్లాల కలెక్టర్లు, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. దేశంలో టిబి వ్యాధి నిర్మూలననే లక్ష్యంగా ప్రధాని టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం తీసుకువచ్చారని అన్నారు. టిబి వ్యాధి నిర్మూలనకు స్క్రీనింగ్ క్యాంపులను విస్తృతంగా నిర్వహించి టిబి కేసులను గుర్తించాలన్నారు. ప్రజల్లో టిబి వ్యాధి పట్ల అవగాహన కల్పించాలన్నారు. టీబీ నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. టిబి నిర్మూలన కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన పేషెంట్లకు దాతల ద్వారా పోషక ఆహార కిట్లను దాతల ద్వారా అందించాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో దాదాపుగా 9లక్షల జనాభా ఉన్నారని తెలిపారు. ఇందులో 1.98 లక్షల మంది హై రిస్క్ గ్రూపులో ఉన్నారని, వీరందరిని స్క్రీనింగ్, ఎక్స్ రే చేసి లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 6923మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయగా, ఇందులో 1389 మందికి ఎక్స్ రే పరీక్షలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎక్స్ రే పరీక్షలలో ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులనూ భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి తో పాటు పీఎంఎస్ఎస్వై , పరకాలలో ఏరియా ఆసుపత్రి, హనుమకొండలో టిబి ఆసుపత్రి ఉన్నాయన్నారు. హనుమకొండలోని టిబి ఆసుపత్రి, పరకాలలోని ఏరియా ఆసుపత్రిలో టిబి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 720మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. టిబి ముక్త్ అభియాన్ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో జూన్ 2వ తేదీ నుండి టిబి స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 2,04,979 మంది హై రిస్క్ గ్రూపులో ఉన్నార ని, అందులో 5,389మందిని ఇప్పటివరకు పరీక్షలను నిర్వహించడం జరిగిందని, ఇందులో 176 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 594 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాకు రూ. 60వేలు, వరంగల్ జిల్లాకు రూ. 40వేలను టిబి పేషెంట్లకు పోషకాహార కిట్లను అందించేందుకు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుడా ఛైర్మెన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, అదేవిధంగా డాక్టర్ వాసవి రాకేష్ రెడ్డి దంపతులు హనుమకొండ జిల్లాకు రూ. 50 వేలను, డాక్టర్ వంగ హేమంత్ రెడ్డి రూ.20వేలను రాష్ట్ర గవర్నర్ సమక్షంలో కలెక్టర్లకు అందజేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అడిషనల్ కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, డిఎంహెచ్వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, రెడ్ క్రాస్ సొసైటీ నుండి డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, రాష్ట్ర ఈసీ మెంబర్ ఇ.వి. శ్రీనివాస్ రావు, బిల్లా రమణా రెడ్డి, ప్రభుత్వ వైద్య అధికారులు డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆచార్య, ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతే దేశానికి వెన్నెముక

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/వాజేడు :** రైతే దేశానికి వెన్నుముక అని రైతు లేకపోతే దేశం లేదని రైతులని మోసం చేసిన కార్పొరేట్ కంపెనీలను వదిలి పెట్టేది లేదని అన్నారు. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం మండలాలలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం సోమవారం వాజేడు ఐటిఐ కళాశాలలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు పంట నష్టం జరిగిందని, తెలిసిన వెంటనే ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ కు ఫోన్ చేసి ఎంతమంది రైతులు నష్టపోయారు అధికారులతో విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో నీకు అండగా నేనుంటానని ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. ఐదు నెలల కాలంలోనే అన్ని విధాలుగా చర్యలు చేపట్టి మల్టీ నేషనల్ కంపెనీ చేత 950 మంది రైతులకు మూడు కోట్ల 80 లక్షల 97 వేల 264 రూపాయలు నష్టపరిహారం చెక్కులను అందజేయడం జరుగుతుందన్నారు.మనది రైతు ప్రభుత్వం కనుకే రైతుల పక్షాన నిలబడి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే రైతులకు అన్యాయం జరగకుండా రైతు చట్టం తీసుకురాబోతున్నామని ఆయన అన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని వ్యవసాయానికి ముందే రైతులకు రైతు భరోసా పథకం కింద రైతు పెట్టుబడి సాయం అందించడం జరిగిందన్నారు. రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అందుకోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏజెన్సీ ప్రాంతం అంటే మాకెంతో మక్కువ అని ఏజెన్సీ ప్రాంతంలోని రహదారులు మెరుగుపరుస్తూ అభివృద్ధికి దోహదపడతాయని ఆనాడే లోటపేట గండి నుండి భద్రాచలం వరకు రహదారులు వంతెనలు నిర్మించడం జరిగిందన్నారు. ములుగు జిల్లా అంటే ప్రత్యేకంగా తెలపాల్సిన అవసరం లేదు అందరికీ తెలిసిన విషయమే ములుగులో రామప్ప, లక్నవరం, ఏటూరునాగారం అభయ ఆరణ్యం బోగత జలపాతం చాలా ఆహ్లాదకరంగా ఉంటాయి.

**దళారులను నమ్మి మోసపోవద్దు సీతక్క :** ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మల్టీ నేషనల్ కంపెనీలు ఇచ్చే విత్తనాలు వ్యవసాయ శాఖ అధికారులతో పరిశీలన జరిగిన తర్వాతనే రైతులు వ్యవసాయం మొదలుపెట్టాలని దళారులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రైతులకు న్యాయం చేయాలని నష్టపరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టడాన్ని ఓర్చుకోలేక బిఆర్ఎస్ పార్టీ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుందంటే రైతుల పక్షాన వారికి చిత్తశుద్ధి లేదని ఆమె అన్నారు. ఎంతో కష్టపడి రైతులకు నష్టపరిహారం అందించడంలో కీలక పాత్ర పోషించిన ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ ను అభినందించారు. నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం చెక్కులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి సీతక్క చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఇద్దరు మంత్రుల రాకతో ఏటూరు నగరం ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణా విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డి, భద్రాచలం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మాజీ ఎమ్మెల్సీ బాలస్వామి లక్ష్మీనారాయణ, అధికారులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ పోరాటాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మానుకోట జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి అన్నారు. సిపిఐ జిల్లా మహాసభ కురవిలో ముగిసిన సందర్భంగా సోమవారం కురవి మండల కేంద్రంలోని నియోజకవర్గ సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడవ మహాసభల తీర్మానాలను నూతన కమిటిని ఆయన ప్రకటించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, కురవిని పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని, రాంపురం హైలెవెల్ బ్రిడ్జి నిర్మాంచాలని, తొర్రూర్‌లో ఏటిఓ కేంద్రాన్ని, సీతారామ ప్రాజక్టు ద్వారా బయ్యారం, డోర్నకల్ నియోజకవర్గాలకు సాగు నీరు అందించడం, నూతన మండలాల్లో మౌలిక వసతులు ఏర్పాటుచేయడం, డోర్నకల్ డ్రైఫోర్ట్ ఏర్పాటు, రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని తీర్మానాలను జిల్లా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు విజయసారథి తెలిపారు. నూతన జిల్లా సహాయ కార్యదర్శులుగా నల్లు సుధాకర్‌రెడ్డి, బి.అజయ్‌సారథి రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులుగా కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పాండురంగాచారి, రేషపల్లి నవీన్, వరిపెల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వరావు, మరో 24మంది కౌన్సిల్ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో నల్లు సుధాకర్‌రెడ్డి, అజయ్‌సారథిరెడ్డి, నెల్లూరి నాగేశ్వరావు, కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, మారగాని బాలకృష్ణ, తుర్క రమేష్, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

## పనిగంటల పెంపు జిఓను వెంటనే విరమించుకోవాలి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** తెలంగాణ రాష్ట్రంలో పనిగంటల పరిమితిని ఎనిమిది గంటల నుండి పది గంటలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి, టియుసిఐ స్ఫూర్తి భవన నిర్మాణ సంఘం నాయకులు ఓమ భిక్షపతి, కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, ఆంజనేయులు అన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు, గాంధీ సెంటర్ నుంచి బస్టాండ్ మీదుగా విశ్రాంతి భవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో కేంద్ర బిజెపి ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నడపడం కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర పాలకుల ఆలోచన ధోరణి తేటతెల్లమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక ఉత్తర్వులను రద్దు చేయాలని లేకపోతే కార్మికుల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున కదిలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9న తొర్రూరులోని విశ్రాంతి భవనం నుండి భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీరాం పుల్లయ్య, జమ్ముల శ్రీను, బందు మహేందర్, సోమనర్సయ్య, గణపురం లక్ష్మణ్, కోటగిరి యాకాంతం, రామస్వామి, మురళి, కిరణ్, వెంకన్న,సైదులు, యాకయ్య, మల్లయ్య, వీరన్న, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, సారయ్య, నాగరాజు, శ్యామ్, స్వామి, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

## 'మీతో.. కమిషనర్ కార్యక్రమానికి' అనూహ్యస్పందన



**ప్రజాపక్షం / పరకాల :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వా ర్డులలో గల ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యలను తెలుసుకోవడం కో సం ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పరకాల మున్సిపాలిటీ కమిషనర్ కడారి సుష్మ తెలిపారు. అందులో భాగంగా సోమవారం ప రకాలలో ఆమె ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. పట్టణానికి చెందిన సుమారు 15 మంది డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో పాల్గొని వారి వారి వార్డులలో ఉన్న సమస్యలను వివరించారు. ప్రజల నుంచి డయల్ యు వర్ కమిషనర్ కార్యక్రమానికి మంచి స్పందన ఉందని ఆమె తెలిపారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉన్నాయని, ఆ వార్డులలో నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడంతో పాటు ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకునే అవకాశం జరుగుతుందని అన్నారు. పారిశుధ్యం విద్యుత్తు మంచినీరు, మురుగు కాలువల నిర్వహణ లాంటి ఎన్నో ఫిర్యాదులు డయల్ యువర్ కార్యక్రమంలో వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రతి సోమవారం ఉ:11 గంనుండి 12 గంటల వరకు పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

## 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎఐటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు క్యాతరాజు సతీష్, చెన్నూరి రమేష్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, జూలై 9 దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరు రమేష్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల యొక్క హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని వాటి రద్దు కోసం కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని వారు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వేముల శ్రీకాంత్, జంపాల పవన్ సిఐటియు వెలిశెట్టి రాజయ్య తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి



**ప్రజాపక్షం / హనుమకొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ఈ రోజు సోమవారం రాయపుర పార్క్ లో వేయి స్తంభాల గుడి ఎదురుగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, టీఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న దేశవ్యాప్తంగా జరుగనున్న సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి, హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, నాయకులు ఏల్పుల ధర్మరాజు , బొట్ల భిక్షపతి మాదిగ మాట్లాడుతూ దేశంలోనే కార్మికులు దశాబ్ద కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను అమలు చేయకపోగా కేంద్రం బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మికుల హక్కుల చట్టాలను బడా పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేయటాని కార్మికులంతా వ్యతిరేకించాలని అన్నారు. టిఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బొట్ల బిక్షపతి మాదిగ,ఎఐటీయుసి నాయకులు ఎ.ఎల్లా స్వామి, బొక్క ఏలియా, మున్నంగి రఘు,శంకర్, వేణు కుమార్,ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ ఎరువులు సరిపడా అందుబాటులో ఉంచాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** వర్షాకాల వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు ఎరువులు సరిపడా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఎరువుల కొరత తీర్చాలని అఖిల భారత రైతు సమాఖ్య( ఏఐకేఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు కేశెట్టి సదానందం డిమాండ్ చేశారు. నర్సంపేట తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకటించిస్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ప్రకారం పంట రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బహుళ జాతి కంపెనీల పురుగుమందుల ధరలను తగ్గించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి గ్రామానికి ఒక వ్యవసాయ అధికారిని నియమించి, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రైతుభీమా వెంటనే అందించాలని, 50 సంవత్సరాలు పైబడిన రైతులకు ప్రతి నెలకు రూ. 5000 పింఛన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు )నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి,ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు ఎండి మాషూక్ , జిల్లా కమిటీ సభ్యులు అనుమాల రమేష్ పాల్గొన్నారు

# క్రీడ

## ముంబైకి టాటా..

### దేశవాళీలో కొత్త జట్టుతో చేరిన షా..!




భారత క్రికెటర్ పృథ్వీ షా ఈసారి దేశవాళీ క్రికెట్‌లో కొత్త జట్టుకు ఆడనున్నాడు. ఈమధ్యే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అందుకున్న షా ముంబైతో సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకున్న షా సోమవారం మహారాష్ట్ర టీమ్‌లో చేరాడు. షా రాకను స్వాగతించిన మహారాష్ట్ర క్రికెట్ సంఘం ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టింది. ఈ చిచ్చరపిడుగుకు 100 నంబర్ జెర్సీని కేటాయించింది ఎంసీఏ. ఫస్ట్ క్లాస్‌లో, ఐపిఎల్‌లో షా అనుభవం తమ జట్టుకు ఎంతో ఉపకరిస్తుందని ఎంసిఎ అధ్యక్షుడు రోహిత్ పవార్ వెల్లడించాడు. త్వరలో ఆరంభం కానున్న దులీప్ ట్రోఫీ, రంజీ ట్రోఫీలో మహారాష్ట్ర తరఫున షా బరిలోకి దిగనున్నాడు. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో చెలరేగి ఆడేందుకు సిద్ధమవుతున్నాడీ హిట్టర్.

దేశవాళీలో తన ఆటకు సానబెట్టుకోవడంలో ఎంతో సాయపడిన ముంబై జట్టుకు షా కృతజ్ఞతలు తెలిపాడు. 'గత ఏడాది కాలంగా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. ప్రస్తుతం నా కెరియర్ దృష్ట్యా మహారాష్ట్ర జట్టుతో చేరడం నిజంగా నాకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నా. క్రికెటర్‌గా నేను మరింత మెరుగవుతాననే నమ్మకం ఉంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో నాకు పలు అవకాశాలు కల్పించిన ముంబై క్రికెట్ సంఘానికి ధన్యవాదాలు' అని షా తెలిపాడు.

## ఐసిసి కొత్త బాస్

### సిఇఒగా సంజోగ్ గుప్తా నియామకం

అంతర్జాతీయ క్రికెట్ మండలి కొత్త సిఇఒగా మీడియా మొఘల్ సంజోగ్ గుప్తాను నియమించారు. చాలా సుదీర్ఘమైన రీతిలో రిక్రూట్మెంట్ ప్రక్రియ జరిగింది. మార్చిలో కొత్త సీఈవో రిక్రూట్మెంట్ ప్రాసెస్ మొదలైంది. జియోస్టార్‌లో స్పోర్ట్స్ అండ్ లైవ్ ఎక్స్‌పీరియన్సెస్ సిఇఒగా చేశారాయన. ఐసిసి సిఇఒగా తక్షణమే గుప్తా బాధ్యతలు స్వీకరించనున్నారు.




ప్రస్తుతం ఐసిసి చైర్మెన్‌గా జేషా కొనసాగుతున్న విషయం తెలిసిందే. సిఇఒ పోస్టు కోసం సుమారు 25 దేశాల నుంచి 2500 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దాంట్లో 12 మంది అభ్యర్థులను షార్ట్ లిస్టు చేశారు. క్రీడా పరిపాలనా సంఘాలు, సీనియర్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా ఐసిసి సిఇఒ పోస్టు కోసం పోటీపడ్డారు. అయితే నామినేషన్స్ కమిటీకి ప్రతిపాదిత పేర్లను ఫార్వర్డ్ చేశారు. ఆ కమిటీ గుప్తాను కొత్త సిఇఒగా ఎన్నుకున్నది. ఐసిసి కమిటీలో డిప్యూటీ చైర్మెన్ ఇమ్రాన్ ఖవాజా, ఇసిబి చైర్మెన్ రిచర్డ్ థాంప్సన్, ఎస్ఎల్‌సి ప్రెసిడెంట్ షమ్మి సిల్వా, బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఉన్నారు. కమిటీ ప్రతిపాదించిన పేరును చైర్మెన్ జేషా అప్రూవ్ చేశారు. ఆ తర్వాత ఐసిసి బోర్డుకు చేరవేశారు. సిఇఒగా నియమితుడైన తర్వాత సంజోగ్ గుప్తా ప్రకటన రిలీజ్ చేశారు. క్రికెట్ అభివృద్ధికి సహకరించనున్నట్లు చెప్పారు. ఐసిసి బోర్డు సభ్యులతో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టుగా గుప్తా తన కెరీర్‌ను మొదలుపెట్టాడు. 2010లో అతను స్టార్ ఇండియాలో చేరాడు. కాంటెంట్, ప్రోగ్రామింగ్, స్ట్రాటజీ అంశాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. డిస్నీ, స్టార్ ఇండియా స్పోర్ట్స్ చీఫ్‌గా ఉన్నారు. జియో స్టార్ స్పోర్ట్స్ సీఈవోగా నవంబర్ 2024లో నియమితుడయ్యారు.




## 'డోపింగ్' భూతానికి చెక్..

### భారత అథ్లెటిక్స్ సమాఖ్య కీలక నిర్ణయం

అథ్లెటిక్స్‌లో ఈమధ్య తరచుగా డోపింగ్ కేసులు నమోదవుతున్నాయి. అంతర్జాతీ వేదికలపై పలువురు క్రీడాకారులు పట్టుబడుతుండడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఆలోచించింది భారత అథ్లెటిక్స్ సమాఖ్య కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా జాతీయ స్థాయిలో డోపింగ్ భూతాన్ని తరిమేసేందుకు సోమవారం ఏఎఫ్ఐ కఠినమైన నిర్ణయాలు వెలువరించింది. గుర్తింపు లేని కోచ్‌ల దగ్గర శిక్షణ పొందిన అథ్లెట్లను జాతీయ అవార్డులకు నామినేట్ చేయకూడదని తీర్మానించింది. ఇకపై రిజిస్టర్ కానీ కోచ్‌ల వద్ద ట్రైనింగ్ తీసుకున్నవాళ్ల పేర్లను అర్జున, ఖేల్ రత్న అవార్డుల పరిశీలనకు పంపబోమని ఏఎఫ్ఏ తేల్చి చెప్పింది. భారత అథ్లెట్లు నిషేధిత పదార్థాలు తీసుకొని డోప్ టెస్టులో దొరికిపోతున్న నేపథ్యంలో అథ్లెటిక్ సమాఖ్య ఈమధ్య కొన్ని చర్యలు చేపట్టింది. జాతీయ స్థాయిలో శిక్షకులుగా ఉన్నవాళ్లందరూ తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరింది. జూలై 31లోపు పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది. 'ఈమధ్య కోచ్‌లు, అథ్లెట్ల తల్లిదండ్రులు కూడా డోపింగ్‌కు పాల్పడుతున్నారు. ఇది చాలా దురదృష్టకరం. అందుకు ఈ భూతాన్ని తరిమేయాలని నిర్ణయించుకున్నాం. మనదేశంలో క్వాలిఫైడ్ క్వాలిఫై కాని కోచ్‌లు ఉన్నారు. వీళ్లంతా తమ పేర్లను నిర్ణీత గడువు లోపు రిజిస్టర్ చేసుకుంటారని భావిస్తున్నా.



### రిజిస్టర్ కానివాళ్లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతాం : అడిల్లే సుమరివిల్లా

జూన్ 31లోపు పేర్లు నమోదు చేసుకున్న వాళ్ల వివరాలను ప్రజలకు వెల్లడిస్తాం. రిజిస్టర్ అయిన వాళ్ల దగ్గరే కోచింగ్ తీసుకోవాలని చెబుతాం. రిజిస్టర్ కానివాళ్లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతాం' అని ఏఎఫ్ఐ మీడియ ప్రతినిధి అడిల్లే సుమరివిల్లా వెల్లడించాడు. రెండు రోజుల క్రితం నీరజ్ చోప్రా క్లాసిక్ తొలి సీజన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నాడు అడిల్లే. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2029, 2031 వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ఆతిథ్యానికి బిడ్డింగ్ వేయనుందని తెలిపాడు. ఈ రెండింటిలో ఏ ఒక్క ఎడిషన్ హక్కులు దక్కినా సరే సంతోషమేనని ఆయన చెప్పాడు

# ఫోకస్ యువతరంగం

ఉపాధికి చక్కటి మార్గం




## ఆన్‌లైన్

ఈ రోజుల్లో యువతీయువకులు అత్యధిక శాతం మంది స్మార్ట్ ఫోన్లతోనే ఎక్కువ సమయం గడుపుతున్నారన్నది నిజం. వీరిలో నిరుద్యోగులు, స్వయం ఉపాధి కోరుకునేవారు అధికం. అలాంటి వారు ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా చక్కటి ఉపాధి పొందవచ్చు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రారంభ సమయంలోనే ఎవరికి మీ వస్తువులు లేదా సేవలపై సమాచారం వెళ్లాలన్నది గుర్తించండి. వాటిని కొనుగోలు చేసే వారు ఎవరో స్పష్టంగా తెలుసుకోండి. మీ ఉత్పత్తులకు ప్రత్యేకమైన బ్రాండ్ గుర్తింపు ఉండాలి. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. అదే విధంగా, వెబ్‌సైట్ లేదా బ్లాగ్‌ను ప్రారంభించండి. వ్యాపారం గురించి వివరాలు, కాంటాక్ట్ డిటెయిల్స్, ఉత్పత్తులు, సేవలు వివరాలు అందులో ఉంచండి. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఇఒ)పై అవగాహన ఉండాలి. గూగుల్, యాహూ వంటి సర్చ్ ఇంజిన్స్‌లో ఎవరైనా వస్తువు వివరాల కోసం శోధిస్తుంటే, మీ ఉత్పత్తి ప్రముఖంగా కనిపించేలా చూడండి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేయవచ్చు. వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకోవచ్చు. విలువైన ఆర్టికల్స్, వీడియోలు, ఇమేజెస్ ద్వారా ప్రేక్షకులను ఆకర్షించండి. గూగుల్ యాడ్స్, ఫేస్‌బుక్ యాడ్స్ తదితర పెయిడెడ్ యాడ్స్ (పిపిసి) ద్వారా మీరు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరగలుగుతారు. కస్టమర్లకు రెగ్యులర్‌గా మెయిల్స్ పంపండి, ఆఫర్లు, న్యూస్‌షెటర్స్ ద్వారా వారికి సమాచారం తెలియచేయండి. గూగుల్ అనాలిటిక్స్ లాంటి టూల్స్ ద్వారా మీ మార్కెటింగ్ ఫలితాలను విశ్లేషించండి, మెరుగుపరచుకోండి. టార్గెట్ ఆడియన్స్‌కు అవసరమైన కంటెంట్‌ను మాత్రమే షేర్ చేయండి. ట్రెండింగ్ టాపిక్స్, వీడియోలు, రివ్యూలు వాడండి. రియల్ టైమ్‌గా ఫీడ్‌బ్యాక్ తీసుకోండి, మార్పులు చేయండి. ఇవి పాటిస్తే, తక్కువ ఖర్చుతో ఎక్కువ మందిని ఆన్‌లైన్‌లో చేరుకోవచ్చు. మీ లక్ష్య ప్రేక్షకులు ఎక్కువగా వెతుకుతున్న కీలకపదాలను గుర్తించి, వాటిని సహజంగా కంటెంట్‌లో వాడండి. శీర్షికలు, మెటా డిస్క్రిప్షన్, హెడ్డింగ్‌లు, బాడీ టెక్ట్ వంటి కీవర్డ్స్ సమతుల్యంగా ఉండేలా జాగ్రత్త పడండి. సబ్ ఫోల్డర్ స్ట్రాటజీని ఉపయోగించడం ద్వారా ప్రధాన డొమైన్‌కు అధికారం పెరుగుతుంది, కొత్త కంటెంట్ వేగంగా ఇండెక్స్ అవుతుంది. ఇది ఎస్ఇఒ పరంగా దీర్ఘకాలికంగా ఉత్తమ మార్గం. కాగా, వెబ్‌సైట్ మొబైల్‌లో సరిగ్గా కనిపించాలి, వేగంగా లోడ్ అవ్వాలి. అందు కోసం ఇమేజ్‌లు ఆప్టిమైజ్ చేయండి, అనవసరమైన ప్లగిన్లు తొలగించండి. సైట్ మ్యాప్, రోబోట్స్.టిఎక్స్‌టి, కానోనికల్ వంటి ట్యాగ్స్ వాడడం ద్వారా సెర్చ్ ఇంజిన్లు సైట్‌ను సులభంగా క్రాల్ చేయగలుగుతాయి. సహజమైన, యూజర్‌ఫోకస్ కంటెంట్‌ను రూపొందించండి. కీవర్డ్ స్టఫింగ్ నివారించండి. విశ్వసనీయ వెబ్‌సైట్ల నుంచి బ్యాక్ లింక్స్ పొందడం ద్వారా మీ సైట్‌కు అధికారం, ర్యాంక్ పెరుగుతుంది. ఈ స్ట్రాటజీలను అనుసరిస్తే, గూగుల్‌లో మీ వెబ్‌సైట్ ర్యాంక్ మెరుగుపడుతుంది. బ్లాగ్ కంటెంట్ ద్వారా గూగుల్ ర్యాంక్ మెరుగుపరచడం ఎలాగో తెలుసుకోవడం మంచిది. యూజర్‌కు ఉపయోగపడే, విశ్వసనీయమైన, ప్రత్యేకమైన సమాచారం ఇవ్వండి. కంటెంట్ సులభంగా చదవదగినదిగా, విభాగాలుగా, హెడ్డింగ్‌లతో ఉండాలి. ఎక్కువగా పోటీ లేని, స్పష్టమైన, వివరమైన కీవరడ్స్‌తో కంటెంట్‌ను టార్గెట్ చేయండి. ఇవి త్వరగా ర్యాంక్ అవుతాయి. ముఖ్యమైన పదాలు టైటిల్, హెడ్డింగ్‌లు, మెటా డిస్క్రిప్షన్, బాడీలో సహజంగా వాడండి. సైట్ వేగంగా లోడ్ అవ్వాలి, మొబైల్ ఫ్రెండ్లీగా ఉండాలి, నావిగేషన్ సులభంగా ఉండాలి. ఈ జాగ్రత్తలు తీసుకోండి. సందర్భోచిత ఇమేజ్‌లు, వీడియోలు జోడించండి. వాటికి సరైన రీతిలో టెక్ట్స్ ఇవ్వండి. మీ సైట్‌లో ఇతర సంబంధిత పేజీలకు లింక్ చేయండి. నమ్మదగిన ఇతర వెబ్‌సైట్లకు కూడా లింక్ ఇవ్వండి. ఆకర్షణీయంగా, కీవరడ్స్‌తో కూడిన మెటా డిస్క్రిప్షన్ వాడండి. కంటెంట్‌ను రెగ్యులర్‌గా అప్డేట్ చేయండి. పాత కంటెంట్‌ను సమీక్షించి, అవసరమైన మార్పులు చేయండి. ఇలాంటి సూచనలు పాటించి, ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను పెంచుకోవచ్చు. నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవడం మరింత ఉత్తమ ఫలితాలనిస్తుంది.

## సామాజిక మాధ్యమాలకు బానిసలు?



మత్తు పదార్థాలు వినియోగించడమేకాదు.. సామాజిక మాధ్యమాలకు బానిసలు కావడం కూడా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నది. నిజానికి, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలు చిన్నపిల్లల నుంచి వయోవృద్ధుల వరకూ అందరినీ బానిసలుగా మార్చేస్తున్నది. అయితే, యువతే ఎక్కువగా వీటి బారిన పడుతున్నారు. స్మార్ట్ ఫోన్, ఐప్యాడ్, ల్యాబ్‌టాప్‌లకు అతుక్కుపోతూ మరో అనారోగ్య విపత్తుకు 'స్క్రీన్ అడిక్షన్'కు ఆజ్యం పోస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ నీలి తెరలపై దృష్టిని కేంద్రీకరించి రోజుకు 10 గంటల వరకు కూర్చుంటున్న యువత మన ముందే కనిపిస్తున్నారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో దూరకుండా గంటైనా గడవని దుస్థితిలో యువత ఉండడం విచారకరం. ఈ దురలవాటుతో పలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పాటు ఏకాగ్రత లోపించడం, ఒంటరితనపు భావనలు, మానసిక స్థిరత్వం తగ్గడం, ఆందోళనలు, ఒత్తిడులు పెరగడంతో చదువులు కుంటుపడుతున్నాయి. పెరుగుతున్న ఈ జాడ్యాన్ని నిలువరించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉంది.

## పెరుగుతున్న ఆత్మహత్యలు..



మన దేశంలో 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు గల యువతలో కనీసం 50 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యల విషవలయంలో చిక్కారని, అంతర్జాల వేదికలు కూడా మానసిక సమస్యలకు ఆజ్యం పోస్తున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కరోనా తర్వాత కాలంలో యువత మానసిక సమస్యలు పెరిగినట్లు నిపుణులు అంటున్నారు. దేశంలో జరుగుతున్న ఆత్మహత్యల్లో 41 శాతం ఆత్మహత్యలు 30 ఏండ్ల లోపువారే చేసుకుంటున్నారని వివిధ మాధ్యమాల్లో లభిస్తున్న సమాచారం. భారతీయ యువతుల్లో అధిక మరణాలకు కారణం ఆత్మహత్యలే అని తెలుస్తున్నది. ఆత్మహత్యలు దేశంలో అతి ప్రమాదకర ప్రజారోగ్య సమస్యగా పెరుగుతున్నది. సగటున ప్రతి రోజు దేశవ్యాప్తంగా 35 మంది విద్యార్థినివిద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. 2019 నుండి 2022 వరకు ఆత్మహత్యల రేటు 9.9 శాతం నుంచి 12.4 శాతానికి పెరగడం గమనించారు. నేటి పోటీ ప్రపంచంలో కోటా కోచింగ్ కారాగారాల్లో పలువురు యువత ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తున్నాం. వీటి నివారణకు ప్రభుత్వాలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు కంకణం కట్టుకోవాలి. ఆత్మహత్యలను నివారించాలి.

# కమ్యూనిజానికి మరణంలేదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం/కొణిజర్ల : నదులకు ఒక దరిదాపు ఉంటుంది కాని సముద్రం కనుచూపుమేరకు కనిపిస్తుందని కమ్యూనిస్టుపార్టీ కూడా సముద్రంలాంటిదని, సముద్రానికి అంతంలేదు.. కమ్యూనిజానికి మరణంలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ 18వ మండల మహాసభ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, స్వర్ణ రమేష్, కంపసాటి వెంకన్నల అధ్యక్షతన యాసా లక్ష్మీ నరసింహారావు ప్రాంగణంలో సోమవారం ఘనంగా జరిగింది. పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు వింజం గోపాలకృష్ణయ్య ఆవిష్కరించారు. అమరవీరులు స్థూపం వద్ద నివాళులుర్పించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై సాంబశివరావు ప్రసంగించారు. కొణిజర్ల మండలంలో పార్టీకి పూర్వవైభాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. త్యాగవీరులు నిర్మించిన పార్టీని కాపాడుకోవల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. బిజెపికి సిద్ధాంతంలేదని, మతాన్ని అడ్డంపెట్టుకొని రాజకీయం చేస్తోందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశసంపదను ఆదానీ, అంబానీకి దోచిపెడుతున్నాడని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మొదట మాట్లాడిందే మనమేనని స్పష్టం చేశారు. అడవుల్లో ఉన్నవారిని చంపుతున్నారన్నారు. ఎర్రజెండాలన్ని ఒక్కటైతే మరింత ఎరుపెక్కి ఎర్రకోటవరకు వెళ్తుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలో ఉండాల్సిన వాళ్లు రోడ్లుమీద, జైళ్లలో ఉండాల్సిన వాళ్లు పార్లమెంట్, అసెంబ్లీలో ఉంటున్నారన్నారు. కమ్యూనిస్టుపార్టీ ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్లు సిపిఐ కార్యకర్తలకు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని , బిఆర్ఎస్ చేసిన పనులే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే శంకరగిరి మాన్యాలు పట్టాల్సి వస్తోందని కూనంనేని హెచ్చరించారు. సభలో జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతురావు మాట్లాడుతు కమ్యూనిస్టుపార్టీకి ఎప్పటికి ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నారు. కూనంనేని ఎమ్మెల్యేగా గెలవడంతో ఎంతోమంది తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో మాట్లాడాలని వస్తున్నారని, దీనినిబట్టి కమ్యూనిస్టులు మాత్రమే అసెంబ్లీలో ప్రజాసమస్యల గురించి గళమెత్తుతారని ప్రజలు నమ్ముతున్నారని స్పష్టంచేశారు. నరేంద్రమోదీ నల్లచట్టాలు రద్దు చేయడం కోసం 750 మంది రైతులు ప్రాణత్యాగం చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఈనెల 19,20 తేదీల్లో మధిర పట్టణంలో పార్టీ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. మహాసభలో సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు, రాష్ట్రసమితి నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి,



రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నాయకురాలు తాటి నిర్మల, జిల్లా కార్యవర్గ సబ్యులు ఏపూరి రవీంద్ర బాబు, జిల్లా నాయకులు పివిరావు, వేములకొండ రమేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి

# నిరంతర పోరాటాలు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

### సిపిఐలో పలువురు చేరిక

ప్రజాపక్షం/మర్రిగూడ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు సోమవారం మర్రిగూడం మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తిచేసి సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మునుగోడు ప్రాంతంలో కాలుష్య ఫార్మా కంపెనీల రద్దుకు ప్రజా ఆందోళనకు సన్నద్ధమైతున్నట్లు తెలిపారు. దివిస్ విషకోరాల నుంచి ఈప్రాంత ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 15న దేవరకొండ పట్టణంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎరుకల నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిక్షంరెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య, జక్కుల అంజయ్య, అయిగొని వెంకన్న, వేముల సత్తయ్య, ఎరుకల యాదయ్య,రాధమ్మ, ఎండి నజీర్ పాల్గొన్నారు.

**సిపిఐలో చేరికలు...** ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో రామ్‌రెడ్డిపల్లి గ్రామం నుంచి వివిధ పార్టీల చెందిన జాల చంద్రయ్య, యాదయ్య, అయితగోని యాదయ్య, ఎడ్ల పెద్దులు, శివన్నగూడ నుండి దాసరి జంగయ్య, గుండ్లపల్లి ముత్యాలు, గుండెబోయిన లక్ష్మమ్మ, భీమనపల్లి కళమ్మలతో పాటు పలువురు సిపిఐలో చేరారు. వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి నెల్లికంటి సత్యం ఆహ్వానించారు.




# సార్వత్రిక సమ్మె విజయవంతానికి కార్మిక సంఘాల సమాయత్తం





ప్రజాపక్షం/హనుమకొండ : ప్రధాని మోదీ పెట్టుబడిదారులకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, కార్మికులను మోసం చేస్తూ వారికి నష్టం చేసే చట్టాలను తీసుకొని వస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. జూలై 9 సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 9న జరిగే సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, కార్యదర్శి జక్కు రాజుగౌడ్, ఎల్పుల ధర్మరాజు, వామపక్ష నాయకులు జి.ప్రభాకర్ రెడ్డి, రాగుల రమేష్, కూర వెంకట్, గంగుల దయాకర్, టి.ఉప్పలయ్య, బోట్ల చక్రపాణి, ఎల్పుల ధర్మరాజు, ఆర్.పూర్ణచందర్, ఎండి మైముదా, వి వీరన్న, గొడుగు వెంకట్ పాల్గొన్నారు.

**మంచిర్యాల :** జిఓ నెంబర్ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాలలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు మాట్లాడుతూ జూలై 9 సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి అమలులోకి తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకించారు. దాని ఫలితంగా తెలంగాణలో 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 10 గంటల పని విధానానికి అనుమతినిచ్చే జిఒ 282ను రాష్ట్రప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్రం కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందని, మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్మికులు పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సంక రవి, దుంపల రంజిత్, లాల్ కుమార్, టి.శ్రీనివాస్, దేవరాజ్ పాల్గొన్నారు.

**జనగామ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా సమితి సమావేశం మోటే శ్రీశైలం అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. 43 అంశాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని, దీని వలన కార్మికులకు తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. పని దినాలు పెంచడంతో పాటు యాజమాన్యాలకు ఊడిగం చేసే విధంగా కార్మిక చట్టాలు ఉన్నాయన్నారు. కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ప్రజలకు వివరించడంతో పాటు వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిక రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చామకూర యాకూబ్, గూడెల్లి రాజు, ముల్కల లక్ష్మయ్య, మర్రిక్కుల సాయిలు, దయ నాగేష్, తోట సుశీల, లింగాల రాములు, మచ్చ మల్లయ్య, బుడిగే వీరస్వామి, గొల్కొండ నాగరాజు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని జెవిసి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిడికె 11వ ఇంక్లైన్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సింగరేణి జెవిసి నాయకులు సీతారామయ్య, సదానందం, మెండే శ్రీనివాస్, వడ్డేపల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మిక హక్కులన్నీ కాలరాయపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూలై 9న జరిగే సమ్మెలో పాల్గొని కార్మికుల సత్తా ను చాటి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. జెవిసి నాయకులు సిద్దమల్ల రాజు మడ్డి ఎల్లాగౌడ్, అరెల్లి పోషం, ఎం.ఎ.గౌస్, నాయిని శంకర్, యాస శ్రీనివాస్, నరేష్, సంపత్, జాన్ కెనడి, సతీష్, రాజమౌళి, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.








# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఇవిఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఇవిఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎఐ ప్రశాంత్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ తదితరులు ఉన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత



ప్రజాపక్షం/పెంచికల్ పేట్ : మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యత అని కాగజ్‌నగర్ రూరల్ సిఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేరాలు జరిగిన తర్వాత కేసులు పెట్టడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని సిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులు ఈగల్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడిన సందర్భంలో, వారికి సంబంధించిన సమాచారాన్ని ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా తెలియజేయాలని కోరారు. మాదక ద్రవ్యాల బారిన పడిన బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తామని, వాటి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్, ఎంఎస్ఐ ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల సమన్వయంతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం




ప్రజాపక్షం/ఆసిఫాబాద్:ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రెవెన్యూ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణికి 46 ఫిర్యాదులు



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత నిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చినఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తోపాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి డిఆర్ఓ పద్మజారాణిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా ప్రారంభించాలి



ప్రజాపక్షం/నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నిజాంసాగర్ కాంగ్రెస్ నాయకులు కోరారు. జుక్కల్ నియోజకవర్గానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డిని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ఎన్ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, పిట్లం సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డిలు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. కరీంనగర్ నుండి సిరిసిల్ల మీదుగా పిట్లం వరకు నాలుగులైన్ల రహదారిని మంజూరు చేసేలా చూడాలని, సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని వారు కోరారు. ఇం దుకు స్పందించిన మంత్రి త్వరగా అట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## జిఒ 282ను రద్దు చేయకుంటే సచివాలయం ముట్టడి: బోగే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్:జిఒ నెంబర్ 282ను రద్దు చేయకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. సోమవారం అసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి జిఒ 282 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార సముదాయాల్లో 8 గంటల పని వ్యవస్థను రద్దు చేసి, 10 గంటల పని విధానాన్ని అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 282ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తేరుకోకపోతే సచివాలయ ముట్టడికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, నాయకులు సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు
# వెంటనే పరిష్కారం : కలెక్టర్





ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణ మే సంబంధిత శాఖలు సమన్వయంతో ప్ర జల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.భూభారతి చట్ట అమలుపై తహసీల్దా ర్లు కచ్చితంగా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

త్వరలో అదిలాబాద్ పా ర్లమెంట్ సభ్యుల అధ్యక్షతన నిర్వహించను న్న దిశా కమిటీ సమావేశానికి సంబంధి ంచి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పథకాలపై సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని సూచి ంచారు.జూలై 9న జిల్లా కేంద్రంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలనీ,ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఆ దేశాల ప్రకారం ప్రతి నెల 30వ తేదీన సి విల్ రైట్స్ దినోత్సవాలు నిర్వహించాలని అ ధికారులకు సూచించారు.జిల్లా అదనపు కలెక్టర్లు,ఆర్‌డిఓరత్నకళ్యాణి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఇవిఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..**
జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమ వారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఇవిఎం గోదాం కేంద్రాన్ని నెలవారీ సాధారణ తని ఖీలలో భాగంగా పరిశీలించారు.ఈ సంద ర్భంగా గోదాంలోని అన్ని రిజిస్టర్లు,భద్రతా ప్రమాణాలను ఆమె సమీక్షి ంచారు.సిసి కె మెరాల పర్యవేక్ష ణలో గోదాం భద్రత నిరం తరంగా కొన సాగించాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశి ంచారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ,ఎన్నికల విభాగం పర్యవేక్ష కులు గజానంద్, సిబ్బ ంది, తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్‌సి వర్గీకరణ
### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/బైంసా:ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం మూలంగానే ఎస్‌సివర్గీకరణ సాధ్యమైందని ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ అన్నారు.సోమవారం బైంసా మండలంలోని బిజ్జూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన సందర్బంగా ఆయన మాట్లాడారు.వర్గీకరణ పోరాటంతో పాటు పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసిన మందకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.మందకృష్ణ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది బిజెపి అని అన్నారు. పధానమంత్రి మోదీ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన మందకృష్ణను ఆత్మీయ ఆలింగనం చేసుకొని మాట ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలుపడ్డాక వర్గీకరణ సాధ్యమైందన్నారు.అసెంబ్లీలో సైతం అందరి మద్దతుతో వర్గీకరణ బిల్లు ఆమోదం పోందిందని,ఎస్‌సి వర్గీకరణ చేపట్టింది మొట్టమొదటగా తెలంగాణ రాష్ట్రమేనన్నారు.గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతించి,శాలవాతో సత్కరించారు.ఎమ్మార్పీఎస్ నాయకులు,సీనియ ర్ నాయకులు ,మాజీ ఎంపిపి,బైంసా మండ ల బిజెపి అధ్యక్షురాలు,స్థానిక సర్పంచ్ ,మా జీ ఎంపిటిసి వెంకట్ రెడ్డి,మండల ప్ర ధాన కార్యదర్శి సట్ల సాయినాథ్,ఉపాధ్యక్షుడు ,సోనారి యోగేష్ సెక్రటరీ నాగన్న తదితర లు పాల్గొన్నారు.

## నేటికీ అమలు కాని మోదీ హామీలు
### బీడీ కార్మిక యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత



ప్రజాపక్షం/బైంసా:నరేంద్ర మోదీ అనుసరిస్తున్న పెట్టుబడిదారుల అనుకూల,కార్మిక వ్యతిరేక విధానాలపై,నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ తెలంగాణ ప్రగతిశీలబీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టియు) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత డిమాండ్ చేసారు.సమ్మె బుక్ లెట్ లతో సోమవారం బైంసా మండలం దేగాంలో చేసిన ప్రచారం సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాను అధికారంలో వస్తే దేశంలో ఉన్న కుటిర పరిశ్రమలను కాపాడుతానని ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులఉ పర్మినెంట చేస్తానని హామీ ఇచ్చి తాను అధికరంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయిపోతున్న నేటి వరకు తానిచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శంచారు.స్వదేశీ జపం చేసిన మోదీఆదాని,అంబానీ విదేశీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి భారతదేశ కార్మిక వర్గం పైన ఉరితాళ్లు బిగిస్తున్నరని వారిని కట్టు బానిసలుగా తయారు చేస్తున్నారని ఆరోపించారు.బీడీపరిశ్రమపై విధించిన జిఎస్‌టి ఎత్తివేయాలని,రాజీనామా చేసిన కార్మికులందరికీ కనీస పెన్షన్ 9వేలు ఇవ్వాలని,నాలుగు లేబర్ కొడ్ లను రద్దు చేయాలని,సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చినా హామీ ప్రకారం బిడికార్మికులు అందరికీ ఎలాంటి షరతులు లేకుండా చేయూత పథకం కింద 4000 రూపాయల జీవన భృతి ఇవ్వాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగాను జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అదేరోజు బైంసాలో జరిగే కార్మిక ప్రదర్శన,ధర్నా కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలో బిడికార్మికులు వనిత,గిరి,గంగామణి,గీత, రేణుక, సురేఖ,లక్ష్మి బాయి,సోని తదితరులు పాల్గొన్నారు.

## కాల్టెక్స్ ఫ్లైఓవర్‌కు రెండోవైపు మెట్లు నిర్మించాలి



ప్రజాపక్షం/బెల్లంపల్లి :కాల్టెక్స్ ఫ్లైఓవర్‌కు రెండో వైపు మెట్లు నిరిమ్మంచి ప్రజలకు రాకపోకలు సులభం చేయాలని సిపిఐ నేతలు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. సోమవారం బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలకాంబెడ్కర్, కార్యవర్గ సభ్యులు రత్నం రాజ్యం కలిసి రైల్వే అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్టెక్స్ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ఒకే వైపునకు మెట్లు ఏర్పాటు చేశారని, రెండో వైపున నుంచి పైకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో రాంనగర్, హనుమాన్ బస్తి, బజార్ ప్రాంత ప్రజలు అనవసరంగా పొడవు తిరిగి ఫ్లైఓవర్ కింద వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఫ్లైఓవర్ ప్రారంభంలో రైల్వే కాంపౌండ్ వాల్‌కి ఆనుకుని రోడ్డుకు ఇరుకుగా ఉన్న చోట డ్రైనేజీ, వర్షపు నీరు నిలిచిపోతుండటంతో వాహనదారులు, నడిచే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీంతో రాకపోకలకు వీలుగా మార్గం అభివృద్ధి చేసి, రెండో వైపు మెట్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బెల్లంపల్లిలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్, అప్ జిటి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ వినతిపై జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తామని తెలియజేశారని సిపిఐ నేతలు తెలిపారు.

## ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలు: కలెక్టర్





ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఈనెల 10 నుండి 16 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను జిల్లాలో పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన జిల్లా సమాఖ్య సమావేశంలో పాల్గొని విజయోత్సవ సంబరాల కోసం చేపడుతున్న చర్యలపైడిఆర్‌డిఓ సాయగౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయోత్సవ సంబరాల సన్నద్ధత కార్యాచరణ కోసం ఈనెల 8న అన్ని మండలాల్లో మండల సమాఖ్య సమావేశాలు 9న గ్రామసంఘాలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ లక్ష్యానికనుగుణంగా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ అభ్యున్నతి సాధించేలా తోడ్పాటునందించాలని కలెక్టర్ హితవు పలికారు. అనంతరం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల పాలిట వరం కల్యాణలక్ష్మి: ఎమ్మెల్యే మైనంపల్లి



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:పేదింటి ఆడబిడ్డల పాలిట వరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. సోమవారం హవేలీ ఘన్ పూర్ మండలం రైతు వేదికలో పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సింధు రేణుక, సంబంధిత ప్రజా ప్రతినిధులు ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీలో భాగంగా 25 కుటుంబాలకు 25 లక్షల 2900 రూపాయలు అందించడం జరిగింది అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇంతకుముందు 10 ఏళ్ల క్రితం మైనంపల్లి హనుమంతరావు ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలను గత పాలకులు మేమే చేసినాము అని అబద్ధ మాటలతో కాలయాపన చేశారని, నియోజకవర్గంలో ప్రజలు ఎలా ఉన్నారు, ఏమి తింటున్నారు వారి యోగక్షేమాలు చూసే నాధుడే లేకుండా ఉండే, అని అదే విధంగా తెలంగాణను అప్పులు పాలు, ఆగం పట్టించిండ్రు, గత 10 సంవత్సరాలలో ఏ ఒక్కరికి కూడా ఇల్లు రాలేదని, ఇండ్లు, దళిత బంధు పేరిట కాలాన్ని గడుపుతూ ప్రజా సంక్షేమమే మరిచితిరని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి మెదక్ నియోజకవర్గంలో ఏడుపాయల అమ్మ వారి టెంపుల్ కు ఒక్కసారి కూడా వచ్చిన పాపాన పోలేదని, మన ప్రజా ప్రభుత్వం ఏడుపాయల అమ్మవారి ఆలయం, మెదక్ చర్చి అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం, ఏర్పడి 18 నెలల్లోనే మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వేల కోట్ల రూపాయలు ప్రజల సేవా సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారని, సన్న బియ్యం ఇస్తూనే రాష్ట్రవ్యాప్తంగా 25 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పారు. రైతు భరోసా రైతు భీమా, సన్న బియ్యం, ఆర్టీసీ మహాలక్ష్మి పథకం పటిష్టంగా అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించిన మంత్రి



ప్రజాపక్షం/పిట్లం:పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామంలో రూ 4.86 కోట్లతో ఈ మధ్యకాలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న హైలెవల్ బ్రిడ్జిని సోమవారం నాడు రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయని ఆయన పేర్కొన్నారు. మండలంలోని మద్దెల్‌చెర్వు నుండి పత్లాపూర్ సబ్ స్టేషన్ వరకు రోడ్డు మంజూరు చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. జహిరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ళ సంజీవరెడ్డి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ కిరణ్మయి, పి ట్లం ఎఎంసి చైర్మన్ మనోజ్‌కుమార్, వైస్‌చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు జంబిగె హ న్మండ్లు, నిజాంసాగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు,సీనియర్ నాయకులు అడ్వకేట్ , యువజన నాయకుడుకార్యకర్తలుతదితరులుపాల్గొన్నారు.

**జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ**
పిట్లం మండలంలోని సీనియర్ ఈనాడు పత్రికా జర్నలిస్టు దత్తురెడ్డి ఇటీవల కాలంలో అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి దత్తురెడ్డి కుటుంబాన్ని కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని పార్టీపరంగాఆదుకుంటామనిభరోసానిచ్చారు.

## “ కదం తొక్కిన కార్మికులు, కుల సంఘాలు”
### తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



ప్రజాపక్షం/రామాయంపేట:న్యాయం కోసం బీడికార్మికులు కదం తొక్కారు. ప్రభుత్వం అందించిన పట్టాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీడికార్మికులు, ముదిరాజ్, యాదవ సంఘాల నాయకులు పెద్ద ఎ త్తున బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈసందర్బంగా కార్మికులు, కులసంఘా ల నాయకులు మాట్లాడుతూ 1597 సర్వే నంబర్‌లో శీలం సిద్దారెడ్డి మల్లన్న, పె ద్దమ్మ దేవాలయలకు 2 ఎకరాల 9 గుం టల భూమిని అమ్మడం జరిగిందన్నారు. బీడికార్మికులకు 2 ఎకరాల భూ మిని విక్రయించి తహసీల్దార్ నుండి జాయింట్ పట్టా సర్టిఫికెట్లు పొందినట్లు వారు తెలిపారు. డెవలప్‌మెంట్ కోసం వదిలిన భూ మిని అక్రమంగా మోసాలకు పాల్పడుతూ విక్రయిస్తూ తమకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయ స్థలం చూపించి ఇంటి నిర్మాణం కోసం అ క్రమంగా అనుమతులు పొందాడని వా టిని రద్దు చేయాలని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పట్టాలకు ప్రైవేటు రిజిస్ట్రేషన్లు చేస్తున్న వ్యక్తిపై తగు చర్యలు తీసుకొని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రజనికుమారికి, ఎస్ఐ బాల్‌రాజుకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైన స్పందించి చర్యలు తీసుకోనియెడల వేలాదిమందితో తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని బాధితులు హెచ్చరించారు.

## దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్న కారు



ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై నిజామాబాద్‌కు వస్తుండగా వెనుక నుండి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాగేపల్లికి చెందిన వడ్ల రాములు (60) ఆయన భార్య ఇందిరా పని నిమిత్తం సోమవారం ఉదయం మోటారు సైకిల్‌పై నిజామాబాద్‌కు బయల్దేరగా దూపల్లి గేటు వద్దకు రాగానే బోధన్ నుండి నిజామాబాద్ వస్తున్న కారు మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో కింద పడిపోయి భర్త రాములుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తీవ్ర గాయాల పాలైన భార్య ఇందిరాను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని ఎడపల్లి ఎస్ఐ తెలిపారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ప్రమాదంతో బాగేపల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయని మృతి చెందిన రాములుకు ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిసింది.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్


## భూ సేకరణ నిలిపివేయాలని రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** భూ సేకరణ నిలిపివేయాలని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ రైతులు సోమవారం మంథని ఆర్డీవో కార్యాలయం ముందు రైతుల ఆందోళన చేపట్టారు. అనంతరం మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి కే. సురేష్ కి రైతులు వినతిపత్రం అందజేశారు. రత్నాపూర్ ని కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం మేడిపల్లి శివారులో దళితులు సాగు చేస్తున్న సుమారు 170 ఎకరాల భూములను ప్రభుత్వం తీసుకుంది. మళ్లీ తమ భూములను ప్రభుత్వం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. భూసేకరణ నిలిపివేయాలని ఆర్డీవోను రైతులు కోరారు.



## 9 వరకు భారీ వర్షాలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** రానున్న 3 రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా మన పెద్దపల్లి జిల్లాలో జూలై 7 నుంచి జూలై 9 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నీటి వనరులలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జర్గకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అనుమతులు లేని శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని నియమ నిబంధనలు పాటించని శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ మండల విద్యాధికారి రాజయ్యకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రంగు రంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా,లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ ,మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి,చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ,మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు ప్రభుత్వం నుండి పై తరగతులకు అనుమతులు ఉన్నాయా! లేవా! అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన అన్నారు.అధిక ఫీజులను వసూలు చేస్తున్న, అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, మండల కార్యదర్శి పల్లె శ్రీహర్ష, ఈదునూరి ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ గుర్తించేందుకే 'పోలీస్ డ్యూటీ మీట్'



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా రాజన్న జోన్ III స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోలీసు వృత్తిలో మరింత నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ పెంపొందించుకునేందుకు ఈ పోలీస్ డ్యూటీ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్ పేర్కొన్నారు. అందులో భాగంగా డిజిపి ఆదేశాల మేరకు రాజన్న పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్లు మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉన్న పోలీసు అధికారులు , సిబ్బందికి కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో రాజన్న జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించడం జరుగుతుంది. ఈ సంధర్బంగా సిపి మాట్లాడుతూ విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర దర్యాప్తులో మరింత శాస్త్రీయ సాధించే దిశగా ఈ డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెలలో వరంగల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయబడతారని కమీషనర్ తెలిపారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెళకువలు నేర్చుకునేందుకు, అదే విధంగా పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి సంక్లిష్టమైన కేసులను పరిష్కరించడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి , వృత్తిపరమైన పనితీరు సామర్థ్యం , మెరుగుదలకు పోలీస్ డ్యూటీ మీట్ దోహదపడుతుందన్నారు. ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌లలో వివిధ ప్రాంతాల నుంచి పోలీసు అధికారుల మధ్య మరింత సహకారం, ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి భీంరావు, ఏసిపిలు శ్రీనివాస్ జి.విజయ్‌కుమార్, వాసాల సతీష్, వేణుగోపాల్, యాదగిరి స్వామి, రంగనాయక్, పోలీసు అధికారులు, సిబ్బంది, బీడీ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్తారంలో యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/ముత్తారం :** మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన చొప్పరి సది (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం చోప్పరి సది గ్రామంలో కూలీ పని చేసుకుంటు జీవిస్తున్నాడు.గత కొంత కాలంగా మద్యానికి బానిసైయ్యాడని తెలిపారు. సాయంత్రం మద్యం మత్తులో ఏదో పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ హస్పటల్ కు తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో కరీంనగర్ లోని ఓ ప్రవేట్ హాస్పటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున మరణించినట్లు మృతుని భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. మృతునికి కూతురు లక్ష్మీ (11), కొడుకు యశ్వంత్ (10) ఉన్నారు.సది చనిపోవడం బాధాకరం మాజీ వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్ రావు చొప్పరి సది చనిపోవడం చాలా బాధకరమని ముత్తారం మాజీ ఎంపీపీ సుధాడి రవీందర్ రావు అన్నారు.శనివారం మండల కేంద్రంలో ఓడేడ్ కు వెళ్లే మెయిన్ రోడ్ పై తాను చనిపోతానని వాహనాల ముందుకు వెళ్తుంటే అక్కడే ఉన్న నేను అతనిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించానని కానీ తాను చనిపోయే ఆలోచనతో ఇంటికి వెళ్లి ఇలా పురుగుల మందు తాగి చనిపోయడం బాధకరమన్నారు. ఎమైనా సమస్యలు ఉంటే కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిష్కరించుకోవాలి కానీ ఇలా చెయ్యడం కరెక్ట్ కాదన్నారు.

# ధర్మపురి క్షేత్రాభివృద్ధికి కృషి

మంత్రి లక్ష్మణ్ కుమార్







**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీమఠం స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం,పూర్తికావాల్సిన ఇతర పనులను సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ధర్మపురి బ్రహ్మోత్సవాలలో భాగంగా గత కొన్ని నెలల క్రితం శ్రీమఠం స్థలంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించగా అట్టి స్థలంలో మఠాధిపతి శ్రీ సచ్చిదానంద స్వామి అనుమతితో ప్రహరీ గోడ నిర్మాణం కోసం భూమిపూజ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.స్వామివారి కళ్యాణ మహోత్సవం జరిగిన స్థలాన్ని పవిత్రంగా ఉంచేందుకు ప్రహరీ నిర్మాణతోపాటు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ స్థలంలో త్వరలో అన్నదాన సత్రం ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి క్షేత్రాన్ని గొప్ప టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, పురపాలక కమిషనర్ శ్రీనివాసరావు, నాయకులు ఎస్.దినేష్, వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, చీపిరిశెట్టి రాజేష్, జె.సుముఖ్, మొగిలి, ధర్మకర్తలు మహేందర్, గణేష్, పోచయ్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాలకు రూ.5 లక్షల నజరానా**

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని మగ్గిడిలోనున్న గొల్లపల్లి గురుకుల పాఠశాలకు 2024–25 విద్యా సంవత్సరం లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపట్ల ప్రభుత్వం రూ.5 లక్షల నజరానాను ప్రకటించగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత చెక్కును అందజేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో మగ్గిడిలో నడుస్తున్న గొల్లపల్లి పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల కృషి, నిబద్ధత, గుణాత్మక బోధన ఫలితంగా ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.5 లక్షలు ప్రకటించింది. సదరు ప్రోత్సాహిక చెక్కును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మంత్రి అడ్లూరి అందజేసి అభినందించారు.

**బ్యాటరీ సైకిల్ పంపిణీ**

బుగ్గారం మండల కేంద్రానికి చెందిన వికలాంగుడు దూడ జాన్ కు సోమవారం సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ బ్యాటరీ ట్రై సైకిల్ ను అదించారు. వికలాంగుడు జాన్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు.

## ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సందర్భంగా ఐడిఓసి సమావేశమందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌లతో కలసి ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈరోజు జిల్లాలోని వివిధ సమస్యలపై ప్రజావాణిలో 152 దరఖాస్తులను స్వీకరించారు. అంతకు ముందు జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి శనివారం లోపు దరఖాస్తులను పరిష్కరించాలని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టర్ ఎఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

రాజీవ్ యువ వికాసం జాప్యానికి కారణాలేంటి?

ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రామండ్లపెల్లి యుగేంధర్





**ప్రజాపక్షం/చిగురుమామిడి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను విస్మరిస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రామండ్లపెల్లి యుగేంధర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారులకు అందించడానికి జాప్యం ఎందుకు చేస్తున్నారో కారణం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం చిగురుమామిడి మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో ఎఐవైఎఫ్ గ్రామ శాఖ సమావేశం జిల్లా నాయకుడు బూడిద కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎఐవైఎఫ్ గ్రామ శాఖ నూతన కమిటీ వేయడం జరిగింది. గ్రామశాఖ అధ్యక్షులుగా కవ్వంపల్లి నవీన్, ఉపాధ్యక్షులుగా ఎంద్ర అనిల్, కవ్వంపల్లి హరీష్, ప్రధాన కార్యదర్శిగా గట్టు మనోజ్ కుమార్, సహాయ కార్యదర్శిగా నాయిని సురేష్‌లను ఎన్నుకున్నట్లు కమిటీని యుగేంధర్ ప్రకటించారు.

ఈ సంధర్బంగా యుగేంధర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, అవినీతి అంతం ఏఐవైఎఫ్ పంతం అంటూ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశానికి వెన్నెముకలాంటి యువతను నిర్లక్ష్యం చేసే పాలకుల పతనం తప్పదన్నారు. సమావేశంలో సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి జెల్ల హరీష్, ఏఐవైఎఫ్ నాయకుడు బూడిద కుమార్, నాయిని సురేష్, గట్టు మనోజ్ కుమార్, కవ్వంపల్లి నవీన్, రాము, హరీష్, ఎంద్ర అనిల్, రాజ్ కుమార్, రంజిత్, కార్తీక్, లక్ష్మణ్ ప్రకాష్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐ విద్యాసాగర్‌ను అభినందించిన సిపి డాక్టర్ అనురాధ



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2025 అతిఉత్కృష్ట సేవా పథకానికి సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ ఎంపికైనారు. అతిఉత్కృష్ట సేవా పథకానికి ఎంపికైన విద్యాసాగర్‌ను సోమవారం సిద్దిపేట పోలీస్ కమీషనర్ డాక్టర్ బి అనురాధ అభినందించారు. ఈ సందర్బంగా పోలీస్ కమీషనర్ అనురాధ మాట్లాడుతూ సిఐ విద్యాసాగర్‌కు అతిఉత్కృష్ట సేవా పథకం త్వరతో అందజేస్తామని,ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా అవార్డులు, రివార్డులు, సేవా పథకాలను అందజేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఫంక్షనల్ వర్టికల్ వారిగా పోటీపడి విధులు నిర్వర్తించి అవార్డులు, రివార్డులు పొందాలని సూచించారు. ఎలాంటి రిమార్క్ లేకుండా 25సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకొని విద్యాసాగర్ సేవా పథకానికి ఎంపికకావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## సునీల్‌రావు ఆస్తులపై ఎసిబి విచారణ

సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు అక్రమ ఆస్తులపై ఏసిబి అధికారులతో విచారణ జరిపించాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ కరీంనగర్ నగర కార్యవర్గ సమావేశం సోమవారం న్యాలపట్ల రాజు అధ్యక్షతన బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగర మాజీ మేయర్ సునీల్‌రావు పదవీకాలంలో స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి రాజ్యమేలిందని, కోట్ల రూపాయలు నీటి పాలు అయ్యాయన్నారు. సునీల్‌రావు బిఆర్ఎస్ పార్టీలో ఉన్నంత కాలం అవినీతిపై నోరు మెదపలేదని, బిజెపిలో చేరిన వెంటనే అవినీతి జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సునీల్‌రావు హయాంలో జరిగిన ప్రతి పనిలో పర్సెంటేజీల రాజ్యం నడిచిందని, చిన్న చిన్న పనులకు కోట్ల రూపాయల బిల్లులు దొబ్బారన్నారు. జంక్షన్లలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, టాయిలెట్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ, ఫుట్‌పాత్‌లు, సైడ్ ట్రాక్స్, మానేరు రివర్ ఫ్రంట్ ట్రాక్స్, మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన నిర్మాణం తదితర పనుల్లో నాణ్యత కొరవడి పూర్తిగా అవినీతి జరిగిందని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికలకు సిపిఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ జెండాను కార్పొరేషన్‌పై ఎగరేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. నగరంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, సత్తయ్య, కసిబోజుల సంతోష్ చారి, శ్రీనివాస్, నగునూరి రమేష్, ఎస్.రాజు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పటిష్ఠ చర్యలు



కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పీఎం కుసుమ్ పథకం అమలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ పిఎం కుసుమ్ పథకం క్రింద రైతులు లేదా రైతు సహకార సంఘాలు వారి భూమిలో 500 కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ సంస్థలకు ఉత్పత్తి చేసిన విద్యుత్తు ను అమ్మడం ద్వారా నెల నెలా ఆదాయం పొందవచ్చని తెలిపారు. మన జిల్లాలో 4 రైతు సహకార సంఘాల ద్వారా పీఎం కుసమ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ఒప్పందాలు పూర్తి చేసుకున్నామని తెలిపారు. 9 నెలల కాలంలో 4 చోట్ల 1 మెగా వాట్ చెప్పిన సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయాలని, ఇక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్తు ఎన్‌పిడిసిఎల్ కు విక్రయించడం జరుగుతుందని అన్నారు. టీజీ రెడ్కో నోడల్ ఏజెన్సీ సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. జూలై నెలాఖరు వరకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం క్రింద ఆసక్తి గల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా సహకార అధికారి శ్రీమాల, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**జూలై 15 లోపు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి**

జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ, మానిటరింగ్ కమిటీ ఎస్సి ఎస్టీ పిసిఆర్/పిఓఎ యాక్ట్ 1989 పెద్దపల్లి జిల్లా నందు క్యాటగిరి ఎఫ్ నందు 5 అనధికార సభ్యుల ఎస్సీ ఎస్టీ చెందిన వారు సభ్యత్వం కొరకు, క్యాటగిరి జి నందు ముగ్గురు నాన్ అఫీషియల్ సభ్యులు స్వచ్ఛంద సేవ సంస్థలతో సంబంధాన్ని కలిగి ఉన్న ఎస్సీ ఎస్టీలు కాకుండా ఉన్న జిల్లా పెద్దపెల్లి జిల్లాకు చెందిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామని అన్నారు. ఆసక్తిగల ఎస్సీ ఎస్టీ చెందిన అభ్యర్థులు సేవా కార్యక్రమాలతో కూడిన ఆధారాలు పేపర్ క్లిప్పింగ్‌లు, ఫోటోలు స్వచ్ఛంద సేవ సంస్థలకు చేసిన సేవలతో కూడిన ఆధారాలతో జూలై 15 సాయంత్రం 5 గంటలకు జిల్లా షెడ్యూల్ కులంలో అభివృద్ధి అధికారి కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని, ఈ కమిటీ నందు ఎన్నికైన సభ్యులకు ఎలాంటి పారితోషకాలు ఉండవని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కార్మిక సంఘాల బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.దేశంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాల నుండి 29 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చి దేశ కార్మికులను బానిసలను చేసే విధంగా 8 గంటల పని విధానం సమ్మె చేసే హక్కు సంఘం పెట్టుకునే హక్కు లాంటివి హరించి వేస్తున్నారని మండిపడ్డారు. కనీస వేతనాల చట్టం అమలు కాకుండా ఎఫ్ డి ఐ లకు దేశీయ పారిశ్రామిక వర్గాలకు సహజ సంపదలను దోచిపెట్టడానికి బ్రిటిష్ హయాంలో సైతం కొట్లాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే కార్మికులు ఉద్యోగులను టెంపర్ వారి కాంట్రాక్ట్ బేసిక్ ఔట్సోర్సింగ్ అనే దోపిడీ పేర్లతో ఉద్యోగ నియామకాలు చేయడం ప్రభుత్వాలు మానాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం నేషనల్ పే స్కేల్ చెప్పిన విధంగా కనీస వేతనం 26,000 ప్రతి కార్మికునికి చెందాలని పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా లాంటి సౌకర్యాలు ప్రతి కార్మికునికి అందాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఉపాధ్యక్షులు పంతం రవి, మీసం లక్ష్మణ్, ఎలగుండ రాజు, దుంద్రపల్లి రవీందర్, దేవరాజు, సిఐటియు నుండి కోడం రమణ, ఎల్లారెడ్డి, జువ్వాది విమల, ఏ ఐఎఫ్ టు యు న్యూ సోమిశెట్టి దశరథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టిఆర్ఎస్ వెంగళ శ్రీనివాస్, ఆకుల రాములు పాల్గొన్నారు.

## మంచి భోజనంతో పాటు నాణ్యమైన చదువు అందించండి

కెజిబి బాలికల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** అన్ని గురుకుల పాఠశాలల్లో మంచి బోజనంతో పాటు నాణ్యమైన విద్యాను అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే హైమవతి, అడిషనల్ కలెక్టర్ , గరిమాఅగర్వాల్ పాఠశాల ప్రిన్సిపాల్‌ను అదేశించారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని క్షేత్ర స్థాయిలో వారు పరిశీలించారు. పాఠశాలలోని వంట గదులను తినుభండారాలను, పలు క్లాస్ రూంలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి హాజరు స్టాకు రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన బోజనం, శుబ్రత పాటిస్తు మెనుప్రాకారం అహరం అందించాలని సూచించారు. కాలం చేల్లిన వస్తువులను వాడకూడదని బోజనం విషయంలో రాజీ పడోద్దని అన్నారు. విద్యార్థులు కష్ట పడి మంచిగా చదువకుని ప్రతి ఒక్కరు ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని మీ ఉజ్వల భవిషత్తు మీ పై ఉంటుందని అదే మీకు భవిష్యత్తు ను చూపెడుతుందని విద్యార్థులకు సూచించారు. విధుల పట్ల అలస్వం వహిస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# రీల్

# కథ నచ్చితే గ్లామర్ రోల్స్ చేస్తా

## మాళవిక మనోజ్



తమిళంలో 'జో' అనే చిత్రంతో తెరకు పరిచయమైన నటి మాళవిక మనోజ్. తెలుగులో ఈ చిత్రంతో తెలుగులో ఓ భామ అయ్యో రామ' సినిమాతో తెరంగేట్రం చేసింది. జూలై 11న చిత్రం విడుదల కానున్న సందర్భంగా కథానాయిక మాళవిక మనోజ్ సోమవారం పాత్రికేయులతో చిట్ చాట్ నిర్వహించారు.

*** తెలుగులో ఛాన్స్ ఎలా వచ్చింది ?**

నేను తమిళంలో నటించిన చిత్రం 'జో'లో నా అభినయం చూసి దర్శకుడు రామ్ 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో హీరోయిన్‌గా సెలక్ట్ చేసుకున్నాడు. కథ వినగానే నాకు ఎంతో నచ్చింది.

*** స్టోరీలో ఏం నచ్చింది ?**

అది సింగిల్‌లైన్‌లో చెప్పలేను. చాలా డిఫరెంట్‌గా అనిపించింది. గతంలో నేను చేసిన సినిమాల్లో విలేజ్ సింపుల్ గర్ల్‌గా చేశాను. ఈసినిమలో నా పాత్ర ఎంతో మోడ్రరన్‌గా, హైపర్‌గా, అటిట్యూడ్‌తో ఉంటుంది. ప్రతి నటికి కావాలసిన వైవిధ్యమైన పాత్ర లభించింది. ఈ చిత్రంలో సత్యభామ అనే పాత్రలో కనిపించాను. ఈ సినిమా కోసం ఎలాంటి వర్క్ పాప్, హోంవర్క్ చేయలేదు. నా రియల్‌లైఫ్‌కు ఎలాంటి కంపారిజిన్ లేని పాత్ర సత్యభామ పాత్ర. నాకు తెలుగు రాకపోయినా.. దాని భావం అర్థం చేసుకుని నటించాను.

*** తెలుగులో నటించడం ఎలా అనిపించింది?**

చాలా హ్యాపీగా అనిపించింది. తెలుగు టెక్నిషియన్స్, ఆర్టిస్ట్‌ల్లో ఎంతో ప్రొఫెజనలిజం వుంది. ఎంతో కంపర్టబుల్‌గా నటించాను. లాంగ్వేజ్ తప్ప నాకు తెలుగులో ఎలాంటి ప్రాబ్లమ్ అనిపించలేదు. అన్ని లాంగ్వేజ్‌ల మాదిరిగా నాకు ఇక్కడ ఎక్కడ కంఫర్టబుల్‌గా అనిపించింది.

*** ఈ చిత్రంలో ఛాలెంజింగ్ అనిపించిన సన్నివేశం ఏమైనా?**

ఈ సినిమాలో కోసం నాకు స్విమింగ్ రాకపోయినా.. ఓ సన్నివేశంలో షూటింగ్ వాయిదా పడటం ఇష్టం లేక నేను భయపడుతూనే స్విమింగ్ చేశాను. నాకు ఎంతో భయమేసిన సినిమా కోసం చేశాను.

*** హీరో సుహాస్‌తో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్?**

వెరీ నైస్ పర్సన్. ఎంతో హార్డ్‌వర్క్ చేస్తాడు. సినిమా సెట్‌లో సినిమా కోసం మాత్రమే మాట్లాడతాడు. పెద్ద టాకింగ్ పర్సన్ కాదు.

*** మీ ఫ్యామిలీ నేపథ్యం ఏమిటి?**

సినిమా నేపథ్యంతో సంబంధం లేని ఫ్యామిలీ నాది. ఫ్యామిలీ సపోర్ట్‌తోనే నటిస్తున్నాను. కానీ అందరూ బంధువులు మొదట్లో భయపడ్డారు. నాకు మాత్రం ఎలాంటి భయం లేదు. సినిమాల్లో నటించడం గర్వంగా ఉంది. ఇప్పుడు ట్రైలర్ చూసి మా ఫ్యామిలీ ఎంతో హ్యాపీగా ఫీలయ్యారు.

*** గ్లామరస్ రోల్స్ చేస్తారా?**

గ్లామరస్ రోల్స్.. చేయాలా వద్దా? అనే నిబంధన నాకు లేదు. కథ నచ్చితే నాకు కంఫర్టబుల్‌గా అనిపించిన రోల్స్ మాత్రమే చేశాను. నాకు నచ్చని పాత్రలు నేను చేయను.

# ఫిలిం ఛాంబర్ ఎన్నికలు నిర్వహించాల్సిందే

## చిన్న నిర్మాతల డిమాండ్



ఈనెలాఖరులో ఫిలిం ఛాంబర్ నేతల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఖచ్చితంగా ఫిలిం ఛాంబర్ ఎన్నికలు నిర్వహించాలని పలువురు చిన్న నిర్మాతలు డిమాండ్ చేశారు. ఫిలిం ఛాంబర్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు చిన్న నిర్మాతలు మాట్లాడారు. తెలుగు ఫిలిం ఛాంబర్ మాజీ అధ్యక్షుడు బసి రెడ్డి అన్నారు. ఈ నెలాఖరులో ఫిలిం ఛాంబర్ కమిటీ పదవి కలం ముగుస్తుందని, కానీ ఇంతవరకు జనరల్ బాడీ పెట్టలేదన్నారు. గత నెలలో జరిగిన ఈసీ సమావేశంలో ఛాంబర్ కమిటీ పదవి కాలాన్ని ఒక ఏడాది కాలం పాటు పొడిగిస్తూ తీర్మానం చేశారన్నారు. ఇది ఫిలిం ఛాంబర్ బైలాకు విరుద్ధమని చెప్పారు. ఈసి మీటింగ్‌లో ఈ నిర్ణయాన్ని సి. కళ్యాణ్, అశోక్, రామదాసు లాంటి నిర్మాతలు వ్యతిరేకించారని తెలిపారు. అయినా ఛాంబర్ కమిటీ ఎన్నికలకు వెళ్లకుండా మొండిగా వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కార్మికుల వేతనాలు పెంచమన్నారు. ఈ కమిటీ ఇంతవరకు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదన్నారు. కొరోనా కాలంలో మాత్రమే ఎన్నిక వాయిదా వేశామని, మిగితా సమయాల్లో ఎప్పుడు ఫిలిం ఛాంబర్ ఎన్నికలు వాయిదా వెయ్యలేదని అన్నారు. ఇప్పుడున్న కమిటీ సమయం ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బసి రెడ్డి డిమాండ చేశారు. చిత్రపురి కాలనీ వ్యవహారానికి, ఫిలిం ఛాంబర్ ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని, గడువు ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే ఫిలిం ఛాంబర్ ఎన్నికలు జరపాలని రామకృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిర్మాతలు నాయుడు, శంకర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఏడాది పాటు పదవీ కాలం పొడిగించాం : ఛాంబర్ కార్యదర్శి**

తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ పదవి కాలం ఈనెలాఖరుతో ముగుస్తోంది కాబట్టే గత నెలలో జరిగిన ఈసీ సమావేశంలో మరో ఏడాది పాటు పొడిగిస్తూ తీర్మానం చేశామని ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ చెప్పారు. ప్రసాద్ ల్యాబ్ లో ఓ సినిమా ఈవెంట్‌కు హాజరైన దామోదర్ ప్రసాద్ ను ఛాంబర్ ఎన్నికలపై వివరణ కోరగా ఏడాది కాలం పాటు పొడిగించిన మాట వాస్తవమేనని అన్నారు. కొన్ని అత్యంత కీలకమైన సమస్యలు పరిష్కారం చెయ్యాల్సి ఉందని, అందుకే ఈసీ సమావేశంలో తీర్మానించారన్నారు. ఈసీ సమావేశానికి హాజరు కాకుండా మీడియాతో మాట్లాడితే ఏం చేయలేమన్నారు.

# పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లో సాగర్ వెరీ ఫిట్

## 'ది 100' ప్రీ-రిలీజ్‌లో మంత్రుల కితాబు



ఆర్కే సాగర్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'ది 100'. ఈ హైఆక్టేన్ క్రైమ్ థ్రిల్లర్‌ను రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించారు. కెఆర్ఐఏ ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై రమేష్ కరుటూరి, వెంకి పుషడపు సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం 11న థియేటర్స్‌లోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా సినిమాటోగ్రఫీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రైట్ టైంలో రైట్ సినిమా ఇది. సినిమా ట్రైలర్ చూస్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనే సినిమా ఫస్ట్ డే చూడాలని నిర్ణయించుకున్నాను. సైబర్ క్రైమ్ నేపథ్యంలో వున్న ఈ సినిమా సమాజానికి చాలా ముఖ్యం. సొంత టాలెంట్ తో గొప్ప స్థాయికి ఎదిగారు. భవిష్యత్తులో తను చాలా గొప్ప హీరో అవుతారు. ట్రైలర్ చూసిన తర్వాత నాకు అలా అనిపించింది. పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లో సాగర్ అద్భుతంగా ఫిట్ అయ్యాడు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ చాలా అద్భుతంగా ఉంది. పవర్ ఫుల్ యాక్టింగ్ ద్వారా గొప్ప మెసేజ్ అందించారు. సాగర్ నాకు చాలా సంవత్సరాల నుంచి పరిచయం. మా ప్రాంత వాసి. సొంతగా ఎదిగి ఇంత దూరం వచ్చాడు. మొగలిరేకులతో చాలా అద్భుతమైన పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు. తన క్యారెక్టర్స్ అన్నీ పవర్ఫుల్‌గా ఉంటాయి. తన ఇంకా గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. తను చాలా మంచి టాలెంట్ ఉన్న వ్యక్తి. ఈ సినిమా ఒక పవర్ఫుల్ వెపన్‌లా ఉంటుంది. చాలా మంచి కథ ఫ్యామిలీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇది ఒక ధైర్యాన్ని సాహసాన్నిచ్చే సినిమా. డైరెక్టర్ చాలా అద్భుతంగా సినిమాలు తీశారు. సమాజంలో జరుగుతున్న చాలా సమస్యలకి సమాధానం దొరికే సినిమా అవుతుందని ఆశిస్తున్నాం. హీరో ఆర్కే సాగర్ మాట్లాడుతూ త్రేతాయుగంలో రామబాణం, ద్వాపర యుగంలో సుదర్శన చక్రం, కలియుగంలో ది 100. ఇది రాసి పెట్టుకోండి. ఈ సినిమాకి అంత పవర్ ఉంది. ఈ సినిమా మస్ట్‌గా చూడాలి. కమర్షియల్ మూవీ. వెరీ టచింగ్ పాయింట్. ఇది ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా. ప్రతి ఫ్యామిలీ చూడాలి అన్నారు. మిశా, ధన్య బాలకృష్ణ, డైరెక్టర్ రాఘవ్ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# 11న 'దీర్ఘాయుష్మాన్ భవ'

కార్తీక్‌రాజు, నోయల్, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లుగా ఎం.పూర్ణానంద్ దర్శకత్వంలో త్రిపుర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించిన 'దీర్ఘాయుష్మాన్ భవ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. కాగా ఈ చిత్రం ట్రైలర్, ప్రోమోస్, పాటలను హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో పలువురు అతిథులు ఆవిష్కరించారు. ట్రైలర్‌ను తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రోమోస్‌ను ప్రముఖ నటుడు ఓ.కల్యాణ్, పాటలను జబర్దస్త్ ఆర్.పి. ఆవిష్కరించారు.



# 9న 'అతడు' రీరిలీజ్



మహేష్ బాబు, త్రిష జంటగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అతడు సినిమా మరోసారి విడుదల చేస్తున్నారు. ఈ సినిమా తొలిసారిగా విడుదలైనప్పుడు సూపర్ డూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం రీరిలీజ్ పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో మహేష్ బాబు నటించిన అతడు సినిమాను రీ రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. 9న మరోసారి థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు మణిశర్మ అందించారు. ఇతర పాత్రల్లో రాజీవ్ కనకాల, కోట శ్రీనివాస్ రావు, షాయాజీ షిండే, అజయ్ తదితరులు నటించారు. ఈ సినిమాను ఫోర్‌కె రెజులేషన్‌లో విడుదల చేస్తున్నారు.

# 'ఎలీ ఇండియా' మేగజైన్ కవర్ పైజీపై నభా నటేష్



ప్రముఖ మేగజైన్ ఎలీ ఇండియా తన జూలై ఎడిషన్ కవర్ పేజీపై బ్యూటిపుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్ ను పబ్లిష్ చేసింది. తన పర్ఫార్మెన్స్, స్క్రిన్ ప్రెజెన్స్ తో సౌత్ ఇండియన్ సినిమాలో నభా తనదైన ప్రత్యేకత ను సంపాదించుకుందని ఎలీ ఇండియా మేగజైన్ కవర్ పేజీ స్టోరీలో పేర్కొంది. ఎలీ ఇండియా మేగజైన్ కవర్ పేజీపై పబ్లిష్ కావడం నభా నటేష్‌కు దక్కిన పెద్ద గౌరవంగా భావించవచ్చు. ఇటీవలే నభా 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్'గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకోవడం విశేషం.

నభా లేటేస్ట్‌గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో ఉంది. అలాగే నాగబంధం అనే పాన్ ఇండియా మూవీలోనూ నటిస్తోంది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

# తానా సభలో పాట ఆవిష్కరణ

ఎమ్3 మీడియా పతాకంపై మహా మూవీస్ సౌజన్యంతో బిగ్ బాస్ ఫేమ్ అమరదీప్ చౌదరి, నటి సురేఖ వాణి కూతురు సుప్రీతా నాయుడు హీరో, హీరోయిన్‌గా మాల్యాద్రి రెడ్డి దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్న చిత్రం 'చౌదరి గారి అబ్బాయితో నాయు డు గారి అమ్మాయి'. ఈ చిత్రం నుండి ఎంత ముద్దుగున్నావే అనే పాటను అమెరికాలో జరిగిన తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా), నాట్స్ (నార్త్ అమెరికా తెలుగు సొసైటీ) వేడుకల్లో వేలాది మంది ప్రవాస భారతీయుల సమక్షంలో ఆవిష్కరించారు.



# రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రముఖ సినీ నటుడు అజయ్ దేవగన్

## యానిమేషన్, విఎఫ్ఎక్స్ స్టూడియోల ఏర్పాటుకు ఓకే



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ స్టూడియో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రముఖ సినీ నటుడు అజయ్ దేవగన్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో అజయ్ దేవగన్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సినిమాల నిర్మాణంలో కీలకమైన యానిమేషన్, విఎఫ్ఎక్స్ స్టూడియో, ఎఐ, ఇతర సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టూడియో నిర్మాణాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని అజయ్ దేవగన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అంతర్జాతీయ స్థాయి స్టూడియో నిర్మాణంతో పాటు సినీ పరిశ్రమలో వివిధ విభాగాలకు అవసరమైన నిపుణులను అందుబాటులోకి తెచ్చేందుకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అజయ్ దేవగన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి, వివిధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిఎం రేవంత్ రెడ్డి అజయ్ దేవగన్‌కు వివరించారు. తెలంగాణ రైజింగ్‌కు సంబంధించి మీడియా, సినిమా రంగాలకు ప్రచారకర్తగా ఉంటానని అజయ్ దేవగన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# ఎటిఎంలా మత్స్యశాఖ

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకారుల సంక్షేమం, అవగాహనపై జరిగిన సదస్సులో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన చేప పిల్లల పంపిణీలో అనేక అవకతవకలతో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. గతంలో మత్స్యశాఖలో జరిగిన అవినీతి వల్ల మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. తొలిసారి ముదిరాజ్ బిడ్డకు సిఎం రేవంత్‌రెడ్డి మత్స్యశాఖ మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. గతంలో వచ్చిన అవినీతి మచ్చ తొలగించేలా ఇప్పటికే అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నానని, మత్స్య శాఖను ఆదర్శంగా తీర్చిదిద్దేలా తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. చేపలు ప్రకృతి ఇచ్చిన సంపద అని, మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ చేస్తామన్నారు. త్వరలోనే కేబినెట్‌లో చేప పిల్లలు పంపిణీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 87కోట్ల చేప పిల్లలు పెంచేలా చెరువులు, ప్రాజెక్టులు, కుంటలు ఉన్నాయని తెలిపారు. కరీంనగర్‌లో చేపల ఉత్పతి మెరుగ్గా ఉందన్నారు. ఈ యేడాది 82 కోట్ల చేప పిల్లలు విడుదల చేస్తామని వెల్లడించారు. ముదిరాజ్ కార్పొరేషన్, ఫిషరీస్ కార్పోరేషన్‌లు సైతం ఉన్నాయన్నారు. తెలంగాణ చేప ఉత్పత్తిలో నెంబర్ వన్‌లా ఉండేలా కార్యచరణ తీసుకుంటామన్నారు. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామన్నారు. విద్యా ఉద్యోగాల్లో కాకుండా రాజకీయాల్లోనూ బడుగులకు అవకాశం కల్పించాలని రాహుల్‌గాంధీ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కులగణన చేసే ప్రక్రియలో బిసి బిల్లు పెట్టే అవకాశం పొన్నంకి దక్కిందన్నారు. కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలు ఎంత అనేది శాస్త్రీయంగా తెలిసిందన్నారు.



**మత్స్యసంపదను పెంచేలా కృషి : మంత్రి పొన్నం**

తెలంగాణలో మత్స్య సంపదను పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చేపల్లి ఉత్పత్తికి సంబంధించి ప్రభుత్వం జిల్లాలో లోయర్ మానేర్ డ్యామ్, మిడ్‌మానేరు, ఎల్లంపల్లితో పాటు అనేక గొలుసుకట్టు చెరువుల నుంచి చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున పెంచేలా చర్యలు తీసుకుంటుందన్నారు. గత పదేళ్లలో చేప పిల్లల పంపిణీ, కొనుగోలు, మత్స్యశాఖలో అవినీతి కారణంగా మొదటి సంవత్సరం చేప పిల్లల పంపిణీ కొంత ఆలస్యం జరిగిందన్నారు.

**పలు అభివృద్ధి పనుల ప్రారంభాలు**

అంతకుముందు కరీంనగర్‌లోని పాత ఆర్ట్స్ కాలేజీ వద్ద రూ.36లక్షల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) అదనపు తరగతి గదుల నూతన భవనాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్‌తో కలిసి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియాన్ని సందర్శించారు. ఇండోర్ స్టేడియం, గ్రౌండ్, వాకింగ్ ట్రాక్‌లను పరిశీలించారు. ఎల్ఎండి మానేరు డ్యాం పరిసరాల్లో సప్తగిరి కాలనీ వాకింగ్ ట్రాక్ వద్ద వనమహోత్సవంలో భా గంగా మంత్రులు మొక్కలు నాటారు. కరీంనగర్‌లోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌లో రూ.26లక్షలతో నూతన స్విమ్మింగ్ పూల్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం సింథటిక్ ట్రాక్ వద్ద రూ.10 లక్షలతో లైటింగ్ ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. కరీంనగర్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌ను ఇంటర్మీడియట్ వరకు పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ క్రీడా మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, మేడిపల్లి సత్యం, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మత్స్యకారులు, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# యువత ముందుకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన స్నాతకోత్సవంలో ప్రసంగించారు. ప్రయోగాశాలకే కాకుండా జీవితంలో కూడా సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణాలోనే ఒక మహత్తర విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది అన్నారు. న్యాక్ ఎ+ గ్రేడింగ్, 151 – 200 బ్యాండ్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, దేశంలోనే మూడవ యూఐ గ్రీన్ మెట్రిక్, జాతీయ స్థాయిలో ఫార్మసీ కళాశాల 84 వ ర్యాంకింగ్ ఇవన్ని విశేష విజయాలు అని, ఇవన్ని కేవలం వనరుల వల్ల మాత్రమే సాధ్యం కాదని ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థుల విజన్, పట్టుదల వల్ల సాధ్యం అయినవి అన్నారు. జాతి పిత మహాత్మా గాంధీ అనట్టు 'విద్య అంటే శరీరం, మనస్సు, ఆత్మ అన్నింటిలోనే అత్యుత్తమని వెలికి తీయడమేనని, జాతీయ విద్యా విధానం 2020 దిశగా ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాల మెరుగుదల దీనికి అనుగుణంగా కృత్రిమ మేధా, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సు, న్యూట్రిషన్ సైన్సు కోర్సులు కాకతీయ యూనివర్సిటీ లో ప్రారంభించడం అబినందనియం అన్నారు. స్నాతకోత్సవం అంటే ఒక ముగింపు కాదని, ఒక కొత్త ప్రయాణం అని భారత పూర్వపు రాష్ట్రపతి ఎ.పి.జే. అబ్దుల్ కలాం అన్న మాటలు గుర్తు చేసారు. ముఖ్య అతిదిగా హాజరైన హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ కెమికల్ టెక్నాలజీ సంచాలకులు, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహిత డాక్టర్ డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ స్నాతకోత్సవం అనేది ప్రతి విద్యార్ధి జీవితంలో ఒక ఆనందభరితమైన క్షణం అన్నారు. మీ విజయానికి కారణమైన తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులకు కృతజ్ఞత గా ఉండాలని, గ్రామీణ ప్రాంతం, తెలుగు మాధ్యమం అడ్డంకి కాదు అని, మన లక్ష్యం ముఖ్యం అన్నారు. భారత ప్రభుత్వం యువత అభివృద్ధికి స్కిల్ ఇండియా, పిఎంకేవై, స్టార్ట్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి కార్యక్రమాలు ప్రారంభించింది అన్నారు. జాతీయ స్థాయి సంస్థ అయిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ కెమికల్ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చులతో మందులు, ఖరోన సమయంలో దేశీయ టీకా, పర్యావరణ హిత న్యాప్కిన్‌లు, వ్యర్థాల నిర్వహణ విజయాలు అన్నారు. గోల్డెన్ జూబిలీ సందర్భంగా విశ్వవిద్యాలయంలో గోల్డెన్ జూబిలీ అకాడమిక్ కాంప్లెక్స్, పి.వి.నరసింహ రావు పరిశోధన, విజ్ఞాన కేంద్రం, 1000 పడకల గర్ల్స్ హాస్టల్, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో సెంటినరీ బ్లాక్ ల నిర్మాణానికి ప్రభుత్వానికి డి.పి.ఆర్. పంపినట్టు తెలిపారు. కృత్రిమ మేధా, డేటా సైన్సు, పబ్లిక్ హెల్త్ లాంటి కోర్సులు ప్రారంభిస్తామన్నారు. మొత్తం 446 గోల్డ్ మెడల్స్, 374 మంది విద్యార్థులకు పిహెచ్‌డి ప్రధానం చేసారు. అంతకుముందు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఆడిటోరియంలో బోకేతో స్వాగతం పలికారు. అనంతరం అకాడమిక్ సెనేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ ఎన్.సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ సుకుమారి, ప్రొఫెసర్. ఎం.నవీన్, కే.అనిత రెడ్డి, బాలు చౌహాన్, పుల్లూరి సుధాకర్, పూర్వపు ఉప కులపతిలు ఆచార్య ఎన్. లింగ మూర్తి, ఆచార్య బి.వెంకట్ రత్నం, అకాడమిక్ సెనెట్ సభ్యులు డాక్టర్ అంపశయ్య నవీన్, మాణిక్యం, గొల్లపూడి జగదీశ్, డీన్ లు కామర్స్ డీన్ లు ఆచార్య రాజేందర్ కట్ల, సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభాగాల డీన్ ఆచార్య బి.సురేష్ లాల్, సైన్సు విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంత్, న్యాయ విభాగల డీన్ ఆచార్య ఎం.శ్రీనివాస్, ఇంజనీరింగ్ డీన్ ఆచార్య ఎం.సదానందం పాల్గొన్నారు.

# ట్రంప్ ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసుకోవాలని ట్రంప్ తన ఒత్తిడిని ఉద్ధృతం చేశారు. ఈ మేరకు ట్రంప్ యంత్రాంగం సోమవారం నుండి అన్ని దేశాలకు టారిఫ్ లేఖలు పంపడం ప్రారంభించింది. ఆగస్టు ఒకటో తేదీ నుండి భారీగా పెంచిన టారిఫ్‌లు అమలులోకి వస్తాయి. ఆ తదుపరి ఏ దేశాలు అమెరికాతో వాణిజ్యం చేయడానికి గుర్తింపు పొందుతాయి? ఏ దేశాలు గుర్తింపు కోల్పోతాయి? అనే విషయంపై అమెరికన్ కంపెనీలు, ఏజన్సీలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి. ఐతే ట్రంప్‌కు సలహాలిచ్చే ఉన్నతస్థాయి వాణిజ్య నిపుణులు ఈ గడువును అధ్యక్షుడు పెంచుతారని చెబుతున్నారు. కానీ దేశాలపై ఈలోపు తీవ్రమైన ఒత్తిడి పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేసినట్లు భోగట్టా. సంప్రదింపులకు ఎప్పుడు స్వస్తి చెప్పాలన్న సమయాన్ని ట్రంప్ నిర్దేశిస్తారని వైట్‌హౌస్‌లో నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హస్సెట్ 'ఫేస్ ద నేషన్' కార్యక్రమంలో సిబిఎస్‌కు చెప్పారు. ప్రతిదేశంతో, ప్రతివిషయంపై క్షుణ్ణంగా చర్చించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

# ఉమ్మడిగా కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఖనిజ వనరులను, వాటి సాంకేతికతను సరఫరాచేయడంలో, రక్షించుకోవడంలో మనం ఉమ్మడిగా విశ్వసనీయమైన కృషి చేయాల్సిన అవసరం ఉంది. మనలో ఏ ఒక్క దేశం కూడా ఆ వనరులను తమ స్వార్థ ప్రయోజనాలకోసం దుర్వినియోగం చేయబోమనీ లేదా ఇతర దేశాలపై ఒక ఆయుధంగా వాటిఇని ప్రయోగించబోమని భరోసా ఇవ్వాలి'' అన్నారు. లిథియం, నికిల్, గ్రాఫైట్ వంటి ఖనిజాలను కీలకమైన ఖనిజ వనరులుగా పరిగణిస్తారు. వీటిని అత్యుత్తమమైన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసే ఉత్పత్తులకు ఉపయోగిస్తారు, విద్యుత్ వాహనాలు (ఇవి), డ్రోన్లు, బ్యాటరీ స్టోరేజీలకు నికిల్, గ్రాఫైట్, లిథియంలను వినియోగిస్తారు. అదేవిధంగా కృత్రిమ మేధ రోజు రోజుకూ సరికొత్త మెరుగులు దిద్దుకుంటూ నిత్యజీవన కార్యకలాపాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతోందని మరోవైపు దీనివల్ల నైతిక విలువలకు సంబంధించిన సమస్యలు, వివక్ష, మోసం, ఇతర అపాయాల ప్రమాదం పెరుగుతుందన్న ఆందోళనలు కూడా పెరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది భారతదేశం ''కృత్రిమ మేధ ప్రభావంపై సదస్సు''ను నిర్వహిస్తుందని ప్రకటించారు.

కృత్రిమ మేధ నిర్వహణా వ్యవస్థలో నవీన ఆవిష్కరణలకు ఎంత ప్రోత్సాహాన్ని ఇస్తామో అంతకు సమానంగా మన ఆందోళనలను కూడా ఎ.ఐ పరిష్కరిస్తుందని మేం నమ్ముతున్నామన్నారు.

'ఆన్‌లైన్‌లో సృష్టించే డిజిటల్ కంటెంట్‌ను తనిఖీ చేసేందుకు ఒక అధికారిక వ్యవస్థను సృష్టించాలి, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రామాణికతలను కాపాడాలి, అలా చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో ఈ డిజిటల్ కంటెంట్ ఉత్పత్తిస్థానాన్ని గుర్తించగలుగుతాం, తద్వారా ఎలాంటి రహస్యాలు లేకుండా ఈ కంటెంట్‌ను దుర్వినియోగం కాకుండా మనం బాహాటంగా చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది' అని మోదీ చెప్పారు.

**ప్రపంచ సవాళ్ళపై 'బ్రిక్స్' చర్చలు**

ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న అనేక సవాళ్ళను బ్రిక్స్ సదస్సులో నాయకులు చర్చించారు. చైనా–రష్యా దేశాధ్యక్షుడు జిన్‌పింగ్, పుతిన్ ఇద్దరూ ఈ సారి బ్రిక్స్ సదస్సుకు హాజరుకాలేదు. వారి తరపున వారి మంత్రివర్గ ప్రతినిధులు హాజరయ్యారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, ఈజిప్టు నేత అబ్దెల్ ఫతా ఎల్ సిసి కూడా హాజరుకాలేదు. ప్రపంచంలో 11 శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థలున్న దేశాలను ఒకేవేదికపైకి తీసుకువచ్చిన ఘనత బ్రిక్స్‌కే దక్కుతుంది. ప్రపంచ జనాభాలో 49.5 శాతం ప్రజలకు ప్రస్తుతం బ్రిక్స్ వేదిక ప్రాతినిధ్యం వహిస్తున్నది. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా 40 శాతం స్థూల జాతీయోత్పత్తికి బ్రిక్స్ దేశాలు చోదకశక్తిగా ఉన్నాయి. పారిశ్రామికంగా వెనుకబడిన దేశాలకు బ్రిక్స్ సహాయం చేయాలని మోదీ ఈ సదస్సులో కోరారు.

**టారిఫ్‌ల పెంపు, ఇరాన్‌పై దాడిని ఖండించిన 'బ్రిక్స్' సదస్సు**

టారిఫ్‌ల పెంపును, ఇరాన్‌పై దాడిని బ్రిక్స్ దేశాల సదస్సు తీవ్రంగా ఖండించింది. ఐతే ట్రంప్ పేరును మాత్రం బ్రిక్స్ సదస్సు ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ మేరకు సదస్సు ఒక తీర్మానం చేసింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను కూడా దృష్టిలో పెట్టుకుని సదస్సు తీర్మానం చేసింది. అదేవిధంగా ఉక్రేన్‌పై దాడి చేస్తున్న రష్యాపై విమర్శలకు కూడా దూరంగా ఉంది. చైనా,రష్యా ప్రధాన నాయకులు ఈ సదస్సుకు ఈసారి హాజరుకాలేదు. ఐతే అమెరికాపై పరోక్షంగా బ్రిక్స్ తీర్మానం విమర్శలు చేసింది. టారిఫ్‌లు పెంచడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విధంగా టారిఫ్‌లు పెంచడం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ విధమైన ఆంక్షలవల్ల ప్రపంచ వాణిజ్యం తగ్గిపోతుందని, ప్రపంచ సరఫరా వ్యవస్థకు విఘాతం కలుగుతుందని, ఒక అనిశ్చితదశ ప్రారంభం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న 'బ్రిక్స్'తో సంబంధాలు పెట్టుకున్న ఏ దేశంపైన అయినా 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని ఆదివారం నాడు ట్రంప్ తన సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. ట్రంప్ ప్రకటనను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా డసిల్వా మాట్లాడుతూ, జిడిపిలో ఏటేటా కేటాయింపులు పెంచుతూ 2035 నాటికి ఐదూశాతం మొత్తాన్ని సైనిక వ్యయాలకు మళ్ళించాలని నాటో చేసిన తీర్మానాన్ని విమర్శించారు. ఈ ధనాన్ని యుద్ధంలో పెట్టుబడపెట్టేబదులుగా, శాంతియుత ప్రయోజనాలకు మళ్ళించడం ఎంతో సులభమని బ్రిక్స్ సదస్సును ప్రారంభిస్తూ ఆయన అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com